అభ్యుదయము

సం. ౧ సంచిక ౩.

★ ★

నిడదవోలు

★

చిలుకూరి

★

కొడవటిగంటి

★

...ంకటసుబ్బయ్య

తెన్నేటి సూరి

...ంకటరామశాస్త్రి

★

నారాయణరావు

★

మా. గోఖలే

★

జాషువ


★

అనిశెట్టి

★

...యాగ

★ ★



డిసెంబరు

ఆంధ్ర

Cossor క్రొత్తయుగానికి సరిక్రొత్త రేడియో

కొస్సార్


జగద్విఖ్యాత రాడర్ యంత్ర నిర్మాతలైన

ఎ. సి. కొస్సార్ లిమిటెడ్ వారిచే

తయారుచేయబడి, సరిక్రొత్త పరిశోధనలు కలిగియున్న

అద్భుతమైన రేడియోలు

5 వాల్వులు 2 బాండ్లు



7 వాల్వులు 2 బ్యాండ్లు

మావద్ద దొరుకును

గుంటూరు, కృష్ణా,

తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, విశాఖజిల్లాలకు

సోల్ డిస్ట్రిబ్యూటర్లు :

బెజవాడ ఎలక్ట్రిక్ కార్పొరేషన్

గవర్నరుపేట : బెజవాడ

ముఖ్యపట్టణములలో అనుభవముగల డీలర్లు ఏజన్సీకై వ్రాయుడు

అభ్యుదయ

సచిత్ర సాహిత్య మాసపత్రిక

★

సంపుటి ౧ సంచిక ౩

డిసెంబరు, 1946

★

సంపాదకులు.

చదలవాడ పిచ్చయ్య

కొడవటిగంటి కుటుంబరావు జలసూత్రం రుక్మిణీనాథశాస్త్రి

ప్రయాగ కోదండరామశాస్త్రి తుమ్మల వెంకట రామయ్య

విషయసూచిక

ముఖచిత్రం

మహాకవి శ్రీ గురజాడ అప్పారావు గారు

అభ్యుదయ

ఆంధ్ర సాహిత్యంలో అభ్యుదయ యుగ కర్త శ్రీ గురజాడ అప్పారావుగారు

"దేశమంటే మట్టి కాదోయ్ - దేశమంటే మనుషులోయ్ "

అని మొట్టమొదటిసారిగా మనదేశంలో ఎలుగెత్తి చాటిన ప్రజా కవి శ్రీ గురజాడ అప్పారావుగారు. దేశ మంటే మట్టికాదట- అయితే మన 'హిమాలయపు రాళ్ళకర్ర' ఏం కాను ? ఏమైతే ఏమి, పోనీ, ఈ మనుషుల కన్నా ఒక కులమూ, మతమూ, జాతీ అంటూ ఉన్నాయా ? అంటే అదీ లేకపోయె.... "అన్న దమ్ముల వలెను జాతులు మతము లన్నీ మెలగ వలె" నట! దీనికి అవధి ఎక్కడ ? మంచితన మనేది మాలవాడిలో ఉన్నదంటే నేనూ మాలనై పోతానన్న 'మంచి' తనానికి హద్దేమిటి ?

దేశ మంటే మనుషులు - అంటే, మనుషులే- కులాలు కాదు, మతాలు కాదు, జాతులు కాదు - కేవలం మనుషులే - అంటే, మనుషులందరూ కూడా ఒక్కటే- అన్న విశాల దృక్పథాన్నీ, విశ్వశ్రేయస్సునూ లక్షించిన మహాకవి గురజాడ.

ఈయన 1861 నవంబరు 30 వ తేదీన విశాఖజిల్లా రాయవరంలో జన్మించారు. సాధారణ కుటుంబం. తండ్రి విజయనగర సంస్థానోద్యోగి.

అప్పారావుగారికి చదువుకొనే ఈడు వచ్చేసరికి తండ్రిగారు రాయవరం నుంచి 'చీపురుపల్లి' బదిలీ అయినారు. చీపురుపల్లిలోనే అప్పారావుగారు ప్రాథమిక విద్యను అభ్యసించారు.

ఇంతలో తండ్రిగారి ఉద్యోగ కాలవ్యవధి కాస్తా దాటిపోయింది. పింఛను పుచ్చుకున్నారు విజయనగరంలో కాపురం. అప్పారావుగారు పట్టణ వాసనలకూ, నాగరికతకూ అలవడుతూ ఆంగ్ల విద్య నభ్యసించ మొదలు పెట్టారు.

ఎవరికైనా, విద్యార్థిదశ జీవితంలోకల్లా ఉత్సాహవంతమైనది. ఆకాశాన్ని లంఘించే ఆలోచనలూ, అవరోధాలను తృణీకరించే కార్యదీక్ష.... ప్రతి విద్యార్థికీ సహజగుణాలు. వాళ్ళ హృదయాల్లో ప్రవహించే కవోష్ణరక్తానికి ఈ లోకపు చలి తగలదు; వాళ్ళ ఆత్మల్ని వెలిగించే విజ్ఞాన జ్యోతికి యీ లోకపు చీకటి సోకదు. సంఘసంస్కరణకోసమో, దేశ స్వాతంత్ర్యంకోసమో, కళాభ్యుదయంకోసమో.... ఎందుకోసమైనా, వాళ్ళదే ముందడుగు!

అప్పారావుగారు హైస్కూల్లో చదివేరోజుల్లోనే కవిత్వరచన ప్రారంభించారు. అప్పుడే అప్పారావుగారి భావనాశక్తి మొగ్గ తొడిగింది.

అప్పటి ఆయన వాతావరణమే ఆ కవిత్వంలో ప్రతిఫలించేది. రోజూబడి.... గంటకో పంతులు.... ఒకటే చదువు . గంటగంటకూ పంతుళ్ళయితే మారుతారు గాని విషయం మాత్రం ఒక్కటే... వాళ్ళ వాళ్ళ సొంతగోడు. కాని, మళ్ళీ విద్యార్థులకు మార్కులు వచ్చితీరాలి; లేదా, ఆ ఏడాదిపాటూ అంత శ్రద్ధగా పంతుళ్ళ కష్టసుఖాలన్నీ వింటూ కూర్చున్న విద్యార్థులు మళ్ళీ మార్పులేకుండా అదే క్లాసులో కూర్చోవాలి ! ఈ పరిస్థితుల్లో పంతుళ్ళమీద బడులమీద విద్యార్థులకు ఏమి భక్తిశ్రద్ధ లుంటాయి ? ఉన్నా లేకపోయినా ఉన్నట్లు నటించి 'మంచిప్రవర్తన'కు యోగ్యతాపత్రాలు సంపాదించే 'మంచి పిల్లగాళ్ళు' ఉండకపోరు - కాని అప్పారావుగారు ఆ రకంకాదు. * 'ఇన్నాళ్ళబట్టీ రానిబుద్ధి ఇప్పుడు నా కెక్కడ నుంచి వస్తుంద'ని నిబ్బరంగా చెప్పుకున్న మనిషి ! అందుకనే ఆ రోజుల్లో ఆయన పంతుళ్ళనూ, బోధనావిధానాన్నీ వేళాకోళంచేస్తూ కవిత్వం వ్రాశారు ఇదే ఆయన కవిత్వానికీ, విమర్శనకూ, సంస్కార దృక్పథానికీ ఆరంభం.

ఇలా హైస్కూలుజీవితం గడచిపోయింది. కాలేజీలో ప్రవేశించేనాటికే ఇంగ్లీషులోకూడా పద్యాలల్లడం ప్రారంభించారు. ఆయన ఆంగ్లకావ్యాలు, విజయనగరంనుంచి వెలువడే 'ఇండియన్ లీజర్ అవర్' అనే పత్రికద్వారా లోకంకంట బడ్డాయి. ఇంకేం, లోకానికి ఒక కాంతిరేఖ కనిపించింది; ఒక జాతిరత్నం దొరికింది

ఆరోజుల్లోనే అప్పారావుగారికి శంభుచంద్ర ముఖర్జీగారివంటి ఉత్తమ కళా వేత్తలలో నేస్తం కలిసింది. ముఖర్జీగారు 'రీస్ అండ్ రయ్యత్' అనే తన పత్రికలో అప్పారావుగారి 'సారంగధర' (ఆంగ్లకావ్యం) ను పునర్ముద్రించుకున్నారు. అప్పారావుగారి కావ్యకౌశలాన్ని పరిపరి విధాల ప్రోత్సహించారు.

అప్పటికింకా కాంగ్రెస్‌మహాసంస్థ పుట్టలేదు. కాని స్వాతంత్ర్యచైతన్యంతో పాటు, జాతీయభావాలు ఆనాటి మేధాపంతుల హృదయాల్లో చిగురిస్తున్నాయి. అలాంటి మేధావంతుల్లో అప్పారావుగారొకరు. ఆయన 1884 లోనే దేశానికి ప్రపంచానికి మేలుచే కూర్చగల కావ్యాలు వ్రాయాలని సంకల్పించారు. రాజకీయంగా కూడా ఒక పద్యకావ్యం వ్రాయడానికి పూనుకున్నారు.

ఇంకా అప్పారావుగారు కాలేజీలో చదువుతూనేవున్నారు. ఇంతలోనే.... ఉద్యోగం....కళాశాలలో ఉపాధ్యాయ పదవి....ఉపాధ్యాయ పదవి నిర్వహిస్తూనే ఆయన 1886 లో పట్టభద్రులైనారు.

* ఇప్పుడైనా బుద్ధితెచ్చుకోమని ఒక పెద్దకీ గ్రాంధికవాది వ్రాసిన ఆకాశరామన్న ఉత్తరానికి జవాబు. చూ 'మాటా-మంతీ'

ఏమైనా, జీతంమాత్రం గొర్రెతోక వంటిది. ఎన్నాళ్ళకీ పెరగదు. ఎప్పుడూ పాతిక రూపాయలే.

ఇచ్చేది పాతికేగదా అని ఇష్టాగోష్ఠి కాలక్షేపం ఎక్కడ చేస్తాడు? నిన్నటి దాకా ఉపాధ్యాయులునూ, బోధనా విధానాన్ని దుయ్యబట్టినవాడు! మేధస్సును కరిగించి గుండెలు త్రెంచుకొని పాఠాలు చెప్పాలి. కాని కడుపునిండదు.

ఇక లాభంలేదని 1887 లో కలెక్టర్ ఆఫీసులో ఒకఉద్యోగం సంపాదించాడు కాని, అప్పారావుగారు కళాశాలను వదలటంతోపాటు, కళాశాలను కళకూడా వదిలింది. దానితో తమకు అప్పారావుగారి అవసరమేమిటో సంస్థానపు దొరలకు ఐదారు నెలలలోనే తెలిసివచ్చింది. వంద రూపాయల జీతంమీద మళ్ళీ అప్పారావు గారిని లెక్చరరుగా తెచ్చుకున్నారు.

ఆయన ఆంగ్లసారస్వతాన్ని గురించి చెప్పినా, సంస్కృత సారస్వతాన్ని గురించిచెప్పినా, చరిత్రచెప్పినా, వ్యాకరణం చెప్పినా....ఆవిషయం విద్యార్థుల హృదయాల్లో సూటిగా నాటుకునేది. ఒక విషయాన్ని సూటిగా విడమర్చి చెప్పడంలో ఆయన అగ్రగణ్యుడు. ఆయన భావం, భాషలో వంకర్లు తిరిగి అయోమయ మయ్యేటంత నీరసమైందికాదు. భాషే ఆయన భావానికి లొంగివచ్చేది.

భావానికి ఒదగనిభాష ఆయనకు నచ్చేదికాదు. కూర్చితీర్చినట్లు సహజంగా వ్యవహారయోగ్యమై, స్పష్టంగా భావప్రకటనకు ఉపయోగపడే భాషనే ఆయన స్వీకరించాడు. అదే ఆయన మాతృభాష.

"తెలుగు సారస్వత భాష (అంటే, గ్రాంధికభాష) సాంప్రదాయంవల్ల తెలుగువారి నెత్తిమీద రుద్దబడిన పెద్ద ఆటంకమని నాఉద్దేశం. సంకెళ్ళను ప్రేమించే వారిని దానిని పూజించనివ్వండి. ఏభాషలోనైతే మన సుఖదుఃఖాలను మనమందరమూ జంకులేకుండా వ్యక్త పరుస్తున్నామో.... ...ఆసజీవమైన తెలుగు, 'ఇటాలియన్ ఆఫ్ ది ఈస్టు' అనబడే తెలుగు, నామాతృభాషయైన వ్యావహారిక తెలుగే నాకు కావాలి."

ఈ తెలుగే ఆయన భావానికి చేవ దెచ్చింది. ఆయనకు తెలుసు—"వ్యవహారిక భాషలో రచింపబడిన సారస్వతం మనదేశంలోని రైతులను మేలుకొల్పుతుంది. మనదేశంలోని ఇంగ్లీషువారిని కదుపుతుంది. దానివల్ల అసంఖ్యాకములైన ప్రయోజనాలున్నాయి."

ప్రతివిషయంలోను ఇంతస్పష్టమైన దృక్పథం ప్రదర్శించిన మహాకవి వెనుక ఒక మహత్తరమైన శక్తిఉంది; అదే మన జాతీయోద్యమం 1857 సిపాయి తిరుగుబాటుతో ప్రారంభమైన విప్లవాగ్ని నానాటికీ ప్రజ్వలిస్తున్నది. దేశం నలుమూలలా స్వాతంత్ర్య నినాదాలు వినిపిస్తున్నాయి. భారత ప్రజానీకం ఒక మహత్తరాశయసాధనకోసం ముందుకు నడుస్తున్నది.

ఈ ప్రజాసైన్యంలో ఆయనకూడా ఒకయోధుడు మారుతున్న లోకాన్ని తనరచనల్లో స్పష్టంగా చిత్రించాడు. ప్రాతకొత్తల కలయికలో వచ్చే అవకతవక లను ఎత్తిచూపి, మారేలోకానికి మార్గదర్శకుడైనాడు.

ఆయనే నిజమైన అధ్యాపకుడు. తాను లోకంనుంచి ఎప్పటికప్పుడు నేర్చు కుంటున్నాడు.; తన విద్యార్థులను స్వతంత్రపథాల్లో నడుపుతున్నాడు.

ప్రఖ్యాతి కలుగగానే, ఆయనకు విజయనగరం రాజుగారి దర్శనంకూడా కలి గింది. అప్పటి విజయనగర ప్రభువైన ఆనంద గజపతికి సాహిత్యమన్నా, కళ అన్నా సదా ప్రఖ్యాతికెక్కిన పండితులందరూ ఆయన ఆస్థానంలో వుండేవారు ఎప్పుడూ ఏవో చర్చలు జరుగుతూవుండేవి శ్రీ గురజాడ అప్పారావుగారు 1889 లోనే ఆదర్చాసమితికి ఉపాధ్యక్షులుగా ఎన్నుకోబడ్డారు అప్పటి ఆయన వయస్సు 28 సంవత్సరాలు.

ఒక్క కళాశాలలో పాఠాలు చెప్పడమేకాదు, ఒక్క చర్చాసమితిలో పండి తులను మెప్పించడమేకాదు; ఆయన ప్రజల నిత్యజీవితంలో పాల్గొన్నాడు. ఆనాడు జరిగిన కాంగ్రెస్‌సభల్లో ఆయన గంభీరగర్జన స్వాతంత్ర్య సైనికులకు రణభేరిగా వినిపించింది

ఈవిధంగా 1887 నుంచీ 1896 దాకా కళాశాలాధ్యాపకుడుగా శ్రీ అప్పా రావుగారు పనిచేశారు. ఆరోజుల్లోనే 'కన్యాశుల్కం' 'కొండుభొట్టీయం' వ్రాశారు ఈనాటకాలు ఏఒక్కసమస్యనో చిత్రించడం కాక, ఆనాటి ఆంధ్రజాతీయ జీవి తాన్ని కళ్ళకుగట్టినట్లు చూపుతాయి ఒకవైపున మార్పునుకోరుతూ, రెండోవైపున ఆమార్పునే అలవరచుకోలేక, అస్తవ్యస్తంగా ప్రవర్తించే ఎంతమంది అభాగ్యు లకో ప్రతినిధిగా 'గిరీశం' ఆంధ్రసాహిత్యంలో నిలిచిపోయాడు తన వేశ్యా జీవితం మీద అసహ్యంపుట్టినా, అంతకంటె గత్యంతరంలేని మధురవాణి "పరుల మేలుకు సంతసిస్తూ", చేతనైన సహాయంచేస్తూ, ఆంధ్ర సాహిత్యంలో అపూర్వ సంఘటనలతో ప్రత్యక్షమవుతుంది. సురేంద్రనాథ్ బానర్జీఅంత అవుదామని చుట్టలు కాలుస్తూ, ఆబడిపిల్లవాడు వెంకటేశం .. పుస్తకాలకని బిల్లు.... చుట్టలకింద ఖర్చు ఆగురుశిష్యులు పిండిరుబ్బుకుంటూ అమాయకురాలు బుచ్చెమ్మ .. అన్నిశ్లోకాలను కొత్తగానే చూసే సంస్కృతవిద్యార్థి .అందరూ మన కళ్ళఎదుట కనిపిస్తున్నారు. అడుగో.... పెద్దమనిషి సౌజన్యారావు .ఆసౌజన్యంలో అన్ని సమస్యలూ తేలి పోతాయి "నాపేరు గిరీశమే నినదభీషణ శంఖము దేవదత్తమే" అన్న గిరీశం "డామిట్ ! కథ అడ్డంతిరిగిం" దనుకుంటాడు.

ఇలాగే, అప్పారావుగారు సృష్టించిన ప్రతి పాత్రకూ ఒక ప్రత్యేకత వుంది. ఆయన నాటకాలు ఆంధ్ర నాటకరంగానికి ప్రాణంపోశాయి. అంతవరకూ ఎవ్వరూ ఎన్నడూ ఎరుగని మనుషులు - రాముళ్ళు, కృష్ణుళ్ళు - నాటకాల్లో 'అపురూపంగా

కనిపించి, ఏ అద్భుతాలచాటునో మాయమయ్యేవాళ్ళు. కాని అప్పారావుగారి నాటకాలు రావడంతో మన నాటకరంగంలోకి మన మనుషులే వచ్చేశారు. మన జీవితాన్నే మనకు చూపి, మార్గదర్శకులైనారు

శ్రీ కందుకూరి వీరేశలింగంగారు ప్రారంభించిన సంస్కారోద్యమానికీ, శ్రీ గిడుగు రామమూర్తి పంతులుగారి వ్యావహారికోద్యమానికీ, సాహిత్య ప్రపంచంలో ప్రాణప్రతిష్ఠచేసి, సజీవములైన శిల్పమూర్తులను చిత్రించి చూపిన మహాపురుషుడు, మహాకవి శ్రీ గురజాడ.

ఆయన సాహిత్యంలోనేకాదు, లలితకళ లన్నిటిలోను సిద్ధహస్తుడు. చిత్రకళలోనేమి, సంగీతంలోనేమి ఆయనకు అఖండమైన ప్రజ్ఞవుంది. కాని ఆయన ఆంధ్ర సాహిత్యాభ్యుదయానికే తన జీవితాన్ని అంకితంచేశాడు.

లెక్చరర్ పదవి వదలిపెట్టిన తరువాత, ఆయన కొంతకాలం చారిత్రక పరిశోధన చేసారు విజయనగర సంస్థాన చరిత్ర, కళింగదేశ చరిత్ర వ్రాయుడానికవసరమైన సామగ్రినంతా సేకరించు కొన్నారు. భాషాతత్వ శాస్త్రాన్ని మధించారు.

కాని, ఇంతలోనే 1897 లో ఆనంద గజపతి మృతిజెందాడు. సంస్థానం వారసత్వపు దావాల్లో చిక్కుకొని పోయింది అప్పారావు గారినికూడా ఆ వ్యవహారాలే చుట్టుకున్నాయి. దీంతో 1912 దాకా ఆయనకు తీరికేలేదు.

అయినా, ఇన్నివ్యవహారాల్లో మునిగి వుండికూడా 1910 లో ముత్యాల సరాలు ప్రచురించి ఆంధ్రకవిత్వానికి కొత్తదారి చూపారు. 'దేశభక్తి' గీతం ఆలపించి ఆంధ్ర జాతికి నూత్నచైతన్యాన్నీ, సంస్కారాన్నీ సమకూర్చారు. తోకచుక్క రాలిందనగానే, ఏదోప్రమాదం వచ్చినట్లు భయపడే అమాయకలోకంవెన్ను చరచి, ధైర్యంచెప్పి, "తలతు నేనిది సంఘ సంస్కరణ ప్రయాణ పతాకగాన్" అని సంఘ సంస్కరణకు పురికొల్పారు.

ప్రాచ్యపాశ్చాత్య సాహిత్యసంప్రదాయాలు మేళవించి, సజాతీయంగా సహజంగా "క్రొత్త పాతల మేలుకలయిక క్రొమ్మెరుంగులు జిమ్మగా" జాతిని మేలొల్కొల్పి విజ్ఞాన పథాలకు నడిపే ఉత్తమాదర్శం ఆయన రచనల్లో అడుగడుగునా గోచరిస్తుంది. ఆంధ్ర సాహిత్యంలో ఆయనే అభ్యుదయ యుగానికి దారితీసిన మహాకవి.

ఆయన నాటకాలు కావ్యాలుకాక, అనేక కథలుకూడా వ్రాశారు. తెలుగులో మొట్టమొదట చిన్నకథలు వ్రాసింది ఆయనే. ఆయన వ్రాసిన "దిద్దుబాటు" "పేరేమిటి?" అన్నకథలు ప్రచురింపబడ్డాయి.

ఆంధ్ర సాహిత్యాభ్యుదయం కోసం ఆయన అహోరాత్రులూ కృషి చేశారు సంస్కృతాంగ్ల గ్రీక్ రోమన్ నాటక సంప్రదాయాల్ని, శిల్పాన్నీ పరిశీలించి, వాటిలోని ఉత్తమ సంప్రదాయాలనూ శిల్పాన్నీ గ్రహించి, ఆంధ్రసాహిత్యంలో

అపూర్వమైన నాటకాలు సృష్టించారు ఆంధ్ర సాహిత్యాన్ని గ్రాంధిక శృంఖలాల నుంచి వదిలించి స్వతంత్ర జాతీయ పంథాను నెలకొల్పారు.

"దేశమును ప్రేమించుమన్నా - మంచి యన్నది పెంచుమన్నా....
"ఓర్వలేమి పిశాచి, దేశం మూలుగులు పీల్చేసెనోయ్,
పరుల మేలుకు సంతసిస్తూ - ఐకమత్యం నేర్చవోయ్...
"దేశ మనియెడి దొడ్డవృక్షం - ప్రేమలను పూలెత్త వలెనోయ్,
నరుల చెమటను తడిసి మూలం - ధనం పంటలు పండవలెనోయ్....
"చెట్ట పట్టాల్ పట్టుకొని దేశస్థులంతా నడువవలెనోయ్,
అన్నదమ్ముల వలెను జాతులు - మతములన్నీ మెలగవలెనోయ్...."

అని దేశసేవకు ఉత్తమ లక్ష్యాన్నీ, దేశాభిమానానికి ఉత్తమ చైతన్యాన్నీ ప్రసాదించిన ఈ మహాకవి, అభ్యుదయ యుగకర్త, 1915 నవంబరు 30 వ తేదీన తన భౌతిక శరీరాన్ని చాలించాడు

కాని, ఆయన ఉత్తమ జీవితాదర్శం ఎల్లప్పుడూ ఆంధ్రజాతి హృదయంలో వేగుచుక్కగా వెలుగొందుతుంది ఆయన దివ్యవాణి ఆంధ్రజాతికి కర్తవ్యాన్ని ఉపదేశిస్తుంది; ముందుకు నడుపుతుంది.

ఆంధ్ర సాహిత్యంలో ఆయన ముద్ర చెదరనిది. ఈనాడు తెలుగులో ప్రతి రచయిత మీద, ప్రతి రచనలోను ఆయన ప్రభావం వుంది. అదే ఆంధ్ర సాహిత్యాభ్యుదయానికీ, ఆంధ్ర జాతి అభ్యుదయానికీ ఆశారేఖ!

— ప్ర యా గ

★

"గుత్తునా యని జాతి ముత్యాల్ - గుచ్చినాడే మేలిసరముల
ఇత్తునా యని తెలుగుతల్లికి - ఇచ్చినాడే భక్తితో !........
"యుగ యుగంబులనుండి మ్రోగెడు - విశ్వగాన వియత్తరంగిణి
భంగముల నుప్పొంగు నాతని - గీత శీకరముల్........"

— కృ ష్ణ శా స్త్రి

జాతీయగీతం

శ్రీ కొనకళ్ల వెంకటరత్నం

మా భరతదేశమా !
మా భాగ్యసీమ !!
మహోజ్జ్వల కళా మనీషాభిరామ !!!

కైలాస శిఖరాన
కలికిసిగ పూవువి,
కన్యాకుమారిలో
కాలి అందెల రవళి—
మూడు సంద్రాలలో ముప్పొద్దు జలకాలు
సవరించు రాణివే ! సౌందర్యరాశివే !!
మా భరతదేశమా !

గంగాతరంగాల
పొంగువారిన తపసు,
గౌతమీ తీరాన
కరుడుగట్టిన కైత,
కావేరి బంగారు క్రోవిలో నాదసుధ
పరజాతి కెరగాని వరములటె సిరులటే !
మా భరతదేశమా !

నీ భోగభాగ్యాలు
నీ నాగరీకాలు,
చివికి జీర్ణించెనా ?
జీవకళ వాసెనా ?
ఏ శుష్కవాదాలు ఏ మతోన్మాదాలు
చెలరేగె నీయింట అలుసైతి పెరకంట ?
మా భరతదేశమా !

మానాభిమానాలు,
మసిలే మగతనాలు,
విపణివీధులవెంట
విరజిమ్మి తెగనమ్మి,
స్వపరభేదముమాని రియింతు మీనాడు
కాటకాలు రచించి కలహాకాండలు పెంచి
మా భరతదేశమా!

చినుకు బూసలపేరు
తునిగిపోయిన తీరు
చిద్రుపలై చిలుపలై
చిందువందయినారు
కన్నబిడ్డల నొక్క కవుగింటనె కరంచి
ఒక త్రాట నెలకొల్పి మొకమాటపై నిల్పి
మా భరతదేశమా!

కారాగృహాలంట
కటికి రా నేలపై
పదునుదేరిన కత్తు
లెదురెరుంగని శక్తు
లావులించిన చోట, శివి నిల్చిన బాట
వెలుగుజెండా మింట విసరనీ మసలనీ
మా భరతదేశమా!
మా భాగ్యసీమ!!

ఆంధ్ర సాహిత్య చరిత్ర

(అజ్ఞాతయుగము నుంచి క్రీ. శ. 1350 వఱకు)

శ్రీ నిడదవోలు వెంకటరావు

సాహిత్యచరిత్ర అంటే సాహిత్య శాఖలైన కావ్యాలు, పురాణాలు, ప్రబంధాలు, శతకాలు, యక్షగానాలు, వచనాలు, ఛందస్సులు మొదలైన వాని పరిణామం తెలియచేసేచరిత్ర- వాఙ్మయ చరిత్ర అంటే జాతి, మతము, రాజకీయచరిత్ర వీటితో ఆయా కాలాల్లో వెలసిన వాఙ్మయముతో గల సంబంధమును వివరించేది.

మనకు తెలుగులో నేటివఱకు సమగ్రమైనదీ, సప్రమాణంగా తీసుకోతగ్గదీ, శాస్త్రీయమైన పద్ధతులమీద రచియింపబడ్డదీ- ఒక సాహిత్య చరిత్ర గాని, వాఙ్మయ చరిత్ర గాని లేనే లేదు. అసలు నన్నయ భట్టారకుడి కంటే ముందు కవిత్వం లేదని వాదించే వారు నిన్నమొన్నటిదాక, విమర్శకులైన విద్వాంసులున్నారంటే, యీ విషయంలో మనమెంత వెనక నున్నామో గ్రహింపవచ్చును.

దాదాపు వేయిసంవత్సరాల పూర్వం నుండి తెలుగులో సాహిత్యం ప్రారంభమైనట్లు కనిపిస్తుంది క్రీ శ (1022-1061) వఱకు రాజమహేంద్రాన్ని తూర్పు చాళుక్యరాజు శ్రీ రాజ రాజ నరేంద్రుడు పరిపాలించినాడు. ఈతని చివరకాలంలో అంటే క్రీ. శ. 1051 తర్వాత నన్నయ భారతము తెనుగు భాషలో వ్రాయటం ప్రారంభించాడు నన్నయ భారతం గద్య పద్యాత్మకమైన చంపూ కావ్యం. నిర్వివాదంగా యింత కంటె ముందు తెనుగుభాషలో పుట్టిన కావ్యమని చెప్పడానికి నేటికి ఏదీ కానరాదు. రాజరాజనరేంద్రుడే తన పూర్వులకు రాజధానిగా నుండే వేంగిని విడిచి రాజమహేంద్రవరం కట్టించి రాజధానిగా చేసికొన్నాడు. అఖండ గోదావరీ నది చేత పావనమైన రాజమహేంద్రవరం చారిత్రాత్మకంగా మొదట ఆంధ్ర సాహిత్య రంగం అయింది.

భారత రచనలోని కవితా పరిణతిని బట్టి చూస్తే, ఇంతకుముందే తెలుగులో కవిత్వం ఉండితీరాలనిపిస్తుంది. గుణక విజయాదిత్యుని కాలంలో పాండురంగని అద్దంకి శాసనాన్నిబట్టి చూస్తే, క్రీ. శ. 848 నాటికే తెలుగులో కవిత్వం కనిపిస్తుంది ఈ గుణకవిజయాదిత్యుడు తూర్పు చాళుక్యులలో రాజరాజనరేంద్రుడికి చాలా పూర్వుడు. ఇతని కాలం నాటికే తెనుగు వృత్తమైన తరువోజ వృత్తం ఉన్నది. అంటే ఇంతకు ముందే కవిత్వం ఉండితీరాలన్నమాట.

జనాశ్రయి అనే పేరుగల విష్ణుకుండిన మాధవవర్మ "ఛందోవిచితి" అనే తెలుగు లక్షణ గ్రంధమొకటి సంస్కృతంలో వ్రాసాడు. ఇందులోనే, తెలుగు కవిత్వానికి ప్రత్యేక లక్షణాలయిన యతిప్రాసలు పేర్కొనబడ్డాయి దాక్షిణాత్య భాషల్లోకల్లా ఒక్క తెలుగులోనే, యతిప్రాసల నియమం చక్కగా

పాటింపబడివుంది కన్నడంలో యతి లేదు. అరవంలో అక్షరాలన్నీ లేనేలేవు. కనుక సాజాత్యమై చెవులకింపుగా యతి వుండే ఆస్కారమే లేదు. దీనిని బట్టి 5 వ శతాబ్దం నాటికే, తెలుగులో కవిత్వం ఉన్నట్లు బోధపడుతుంది. అంటే, అంతకుముందే తెలుగుభాష ఉండి తీరాలి.

ఇప్పటికి సుమారు 2000 సంవత్సరాల క్రిందటినుంచీ, తెలుగుభాష వున్నట్లు మన కనేక ఆధారాలు కనబడుతున్నాయి బౌద్ధయుగంనాటి అమరావతీ శాసనాలు ప్రాకృత భాషలో వున్నాయి. కాని వీటిలోనే 'నాగబు' అనే పదం కనిపిస్తున్నది. ఇందులో 'నాగ' సంస్కృతం. 'బు' తెలుగు ప్రత్యయం. ఇలా, 2 వ, 3 వ, 4 వ శతాబ్దాలనాటి శాసనాల్లో తెలుగు ప్రత్యయాలు తెలుగు ఊళ్ళపేర్లు, మనుష్యుల పేర్లు కనిపించడంచూస్తే, అంతకు పూర్వమే తెలుగుభాష వుండివుండాలని తెలుస్తుంది. 5 వ శతాబ్దంనుంచీ తెలుగులో కవిత్వంవుంది. 9వ శతాబ్దంనుంచీ శాసనాల్లో పద్యాలు కన్పిస్తాయి. 11 వ శతాబ్దంలో గ్రంధరచన ప్రారంభమైంది ఇదేనన్నయభట్టు భారతం.

గుణకవిజయాదిత్యుడి శాసనం 'తరువోజ'లో వుంది. రెండు ద్విపదలు కలిపితే తరువోజవృత్తం అవుతుంది 'ధృవా పదం' అనే పదం 'దరువద' 'తరువద' (ద) తరు + అద, తరు + అజ, తరువోజ అయింది. తరువోజలో రెండు ద్విపదపాదము లుంటాయి. ఈద్విపదకూడా పేరుకు సంస్కృతమైనప్పటికీ సంస్కృతంలో లేదు. ద్రావిడభాషలైన అఱవము కర్ణాటకాల్లో, అంతకంటేలేదు- కాబట్టి తెలుగువారి దేశీయమైన వృత్తమని చెప్పాలి.

9 వ శతాబ్దంలో గుణక విజయాదిత్యుడి కాలంలో పాండురంగడు అనే వాడు వ్రాయించిన సీసపద్యశాసనం అసమగ్రంగా ఉంది అయితే ఆ సీస పద్యం ఉన్నంతమట్టుకు, నన్నయభట్టు వ్రాసిన సీసపద్యాలనియమంతోఉంది సీసపద్యం కూడా పై వృత్తాలలాగు అచ్చంగా తెలుగుదేశివృత్తం ఇతర ద్రావిడ భాషలోగాని, సంస్కృతంలో గాని ఎక్కడాలేదు.

తరువాత వృత్తము మనకు తెలిసింది మధ్యాక్కర—నన్నయకు రమారమి ఒకశతాబ్దం ముందుగా వెలసిన యుద్ధమల్లుని బెజవాడశిలాశాసనంలో కనబడుతుంది. ఈవృత్తం నన్నయభట్టు భారతంలోను, ఎఱ్ఱాప్రగడ తను రచించిన భారత అరణ్య పర్వశేషంలోను వాడినాడు. ఈవృత్తంలో మధ్యాక్కర, అల్పాక్కరఅనే భేదములున్నాయి. వీనిలో అల్పాక్కర మడికిసింగన వాసిష్టరామాయణంలో వాడాడు.

అయితే యిక్కడ విశేషమేమంటే యీవృత్తం కన్నడభాషలో ఉన్నది. కాబట్టి ఇది దేశివృత్తమేకాని కేవలము తెలుగుదేశివృత్తమని చెప్పడానికి వీలులేదు కాబట్టియే యీవృత్తాన్ని తక్కిన కవులెవ్వరు వాడలేదు. లాక్షణికులు మాత్రం తమ లక్షణ గ్రంధాలలో దీనిని వివరించారు.

రాజరాజు కాలంలో బేతనభట్టు కోరు

మిల్లిశాసనం వ్రాసినాడు. భాషఅంతా సంస్కృతమే అయినా ఆతడు ఉపయోగించిన వృత్తంరగడవృత్తం. ఈ రగడ కూడా సంస్కృతంలోలేదు కర్ణాట భాషలో, తెలుగులో చాలా ప్రచారంలో ఉన్నది.

ఇంకా దేశీయమైన తెలుగువృత్తం కందం - కందం చెప్పినవాడు కవి, పందిని పొడిచినవాడు బంటు అనే సామెత తెనుగులో ఉంది. క్రీ శ. 1000 ప్రాంతంలో అయ్యనభట్టు సంస్కృతంలో యతిప్రాసలుంచి కంద పద్యం వ్రాసినాడు. నన్నయ్య తను వాడిన వృత్తాల్లో కందం అన్నిటికన్నా హెచ్చుగా వాడేడు.

కాబట్టి,తరువోజ,సీస, మధ్యాక్కర, కందం, రగడ–వీటితోగూడా కావ్యరచనకి ఆధారమైన ఛదస్సులతో మన సాహిత్యం ప్రారంభించినదని తెలుసుకోవచ్చును.

మన భాషకు మొదట కావ్యంలో "తెనుగు" పేరువాడినవాడు నన్నయ్య. అతను ఎక్కడా నేడు మనకు ప్రచారంలో ఉండే "ఆంధ్ర" అనే పదం వాడలేదు- ఆ కాలంలో "తెనుగు"అనేది దేశ్యశబ్దము - అనగా స్వతస్సిద్ధంగా పుట్టిందికానిమరోభాషలోనుంచి రాలేదు. తెనుగులో సంస్కృత ప్రాబల్యం హెచ్చు అయిన తర్వాత, తెనుగు సంస్కృతినుండి పుట్టిందనివాదం పండితులు లేవదీసారు - నన్నయ్య కాలంలో ఎన్ని సంస్కృత పదములున్నప్పటికీ అది తెలుగే అనిపించుకుంటుంది — నన్నయ్య మూడు వంతులు సంస్కృత పదాలే వాడినప్పటికీ తనభాషను తెనుగే అన్నాడు. అంటే అతని కాలంలో తెనుగులో—తెనుగులోనికి సంస్కృతం నుండి వచ్చినవి (తత్సమాలు) సంస్కృత ప్రాకృతాలనుండి పుట్టినవి (తద్భవాలు) దేశంలో స్వతస్సిద్ధంగా పుట్టినవి (దేశ్యాలు)అన్నీ కలిసిఉండేవి- ఈ మూడు రకాలైన పదాలు నన్నయ్య పేరులోనే ఉన్నాయి. నన్ని: ఇది దేశ్య పదము, అయ: ఇదిఆర్యశబ్దతద్భవము. భట్టు ఇది సంస్కృతం నుండి తిన్నగా తెనుగులోనికి వచ్చింది (తత్సమం). ఆకాలంలో ఆంధ్రశబ్దం సంస్కృత సమాసంలోనే వాడేవారు. ఆంధ్ర అనేది, మొదట జాతికి తరువాత దేశానికి పేరుగాని భాషకుగాదు.

ఈ 'ఆంధ్రభాష' అనే పదం మొట్ట మొదట 'నందంపూడి' శాసనంలో ప్రయోగించబడింది.

నన్నయ్యకుపిదప, సోమల్దేవి శాసనములో ఒక సీసపద్యమే ఉన్నది. ఇది ద్రాక్షారామంలో ఉన్న శాసనం 1065 నాటిది

వనపతి 1075 లో దీర్ఘాసి శాసనం సీసమాలికగా చెక్కించాడు. అతను అతని భార్య పద్మావతి దీర్ఘాసి భగవతీ దేవికి కానుక లిచ్చారు. ప్రతీహార ముఖ్యుడననీ, ఆత్రేయ గోత్రికుడననీ, బ్రాహ్మణుడననీ వ్రాసుకున్నాడు. ఇతను కూడా నన్నయభట్టు మహాభారత రచనలో తోడ్పడ్డ నారాయణభట్టు లాగా, వానస వంశీయుడే (బానస, మహానస- వంటసాల. బానస - వానస వంశం.)

క్రీ శ 1112 నుంచి 1200 వఱకు

72 పద్యమయమైన శాసనా లున్నా యంటే, 40, 50 మంది కవులైనా వుండితీరాలి. దాదాపు ఈ శాసనాలన్నీ కృష్ణా, గుంటూరుజిల్లాలలోనే దొరుకు తాయి. ఈ జిల్లాలే ఆంధ్ర సాహిత్యానికి నడిగడ్డ. రాజరాజనరేంద్రుని తర్వాత ఈ జిల్లాలే సాహిత్యంలో ప్రాధాన్యత వహించాయి. నన్నయ తర్వాత మూడు నాలుగుశతాబ్దాలపాటు అంటే శ్రీనాథుడు సాహిత్య రంగంలోకి వచ్చేవరకు రాజ మహేంద్రవరం పేరే వినపడదు

11 వ శతాబ్దారంభంలో రాజరాజ నరేంద్రుడు అధికారానికి వచ్చాడు. అన్నదమ్ములు శత్రుత్వం వహించారు. వారిని తరిమివేయవలసి వచ్చింది. శత్రువుల దండయాత్రలను ఎదుర్కొ న్నాడు. చివరిరోజుల్లో తమ్ముడే దండె త్తాడు. కొడుకు దగ్గర లేకుండా పోయాడు. రాజరాజనరేంద్రుని పరిపా లనలో వచ్చిన ఈ రాజకీయ కల్లోలం, నన్నయమృతికీ, భారతరచన ఆగిపోవ డానికీ కారణం కావచ్చు.

నన్నయ కాలంలో కొంచెంగా బౌద్ధ మతం, జైనమతం వుండేవి. శైవ, వైష్ణవభేదాలులేవు రామానుజాచార్యులు నన్నయభట్టుకు సమకాలీనుడు

క్రీ. శ. 941 లో కన్నడంలో పంప డనే కవి భారతంవ్రాశాడు కన్నడులది జైన సంప్రదాయం ఆయన భారత కథను మార్చి, అర్జునుణ్ని నాయకుణ్ని చేసి. చివరకు అతనికి ద్రౌపదినిచ్చి వివాహం చేశాడు. దీనికి విక్రమార్జున విజయం అని పేరు.

ఆంధ్ర భారత అవతారికలో "బహు భాషా జ్ఞానంవల్ల భారతకథ తెలుసు కున్నాను. పంప భారతంలో జైన సంప్రదాయం వుంది తెలుగులో భార తీయ వైదికసంప్రదాయంకోసం భారతం వ్రాయ"మన్నాడు రాజరాజు.

అర్జునుడు మత్స్య యంత్రాన్నికొట్టి ద్రౌపదిని పెండ్లాడిన ఘట్టంలో "మత్స్య యంత్రాన్ని క్షత్రియుడే కొట్టాలి; కాని బ్రాహ్మడికి చేతకానిది లే"దని సమర్థిం చాడు నన్నయ. "సరళ తమాల", "సాలప్రాంశు" అనేవి కన్నడంలో కూడా అలాగే వున్నాయి. వీటినిబట్టి నన్నయ్య కన్నడ భారతం చదివేవుంటా డని తోస్తుంది.

ఇక నన్నయ్య తీసుకున్న ఛందస్సు చూద్దాం. ఆయన తెలుగు వృత్తాలే ఎక్కువగా వాడాడు. కంద పద్యాలు మరీ ఎక్కువ అని తెలుసుకున్నాం. చంపకమాల, ఉత్పలమాలాదివృత్తాలను మొట్టమొదటగా ఆయనే తెలుగులోకి తెచ్చాడు. కన్నడ భాషలో అదివరకే వున్న యీ వృత్తాలను తెచ్చి, వీటికి అదనంగా యతి చేర్చాడు. సంస్కృ తంలోకూడా ఈ వృత్తాలున్నాయి. కాని వాటికి ప్రాస లేదు. ప్రాసనుబట్టి వీటిని కన్నడంలోనుంచే నన్నయ తెచ్చినట్లు బోధపడుతుంది వృత్తాలకు నన్నయ భట్టు అందెవేసిన చేయి. కన్నడుల మాదిరిగానే ఆయన సంస్కృతానికి సాధ్యమయినంత తెలుగుదనం కల్పిం చాడు.

రాజరాజనరేంద్రుడు సంస్కృత సాహిత్యంలో ప్రసిద్ధుడైన భోజరాజుకు సమకాలీనుడు

వ్యాసదాసుడని ప్రసిద్ధికెక్కిన క్షేమేంద్రకవి, నన్నయతో సమకాలికుడు. ఇతడు సంస్కృతంలో భారత మంజరి అనే కావ్యం వ్రాసాడు. ఇతడు కాశ్మీరంలో ఉండేవాడు.

నన్నయ్యకు శబ్దశాసనుడని బిరుదని తరవాత కవులు పేర్కొన్నారు కాని నన్నయ్యకుఇదిబిరుదమనన్నా భారతము నన్నయకుతరువాత రచించిన తిక్కన ఎఱ్ఱాప్రెగడ లెవ్వరునూ చెప్పలేదు ఇంచుమించుగా 4 శతాబ్దముల తర్వాత శ్రీనాథుడు, జక్కన నన్నయను శబ్ద శాసనుడని అన్నారు ఇది బిరుదుగా వారు చెప్పలేదు బిరుదమైతే గద్యలో నన్నయ వ్రాసుకునే యుండును. అది శబ్దవ్యాకరణ శాస్త్రము తాను చదువు కొన్నానని చెప్పుకోవడముతప్ప బిరుదంగా చెప్పుకోలేదు.

11 వ శతాబ్దంతో నన్నయయుగం అయిపోయింది తర్వాతది 1100 మొదలు 1250 వరకు శైవకవుల యుగం

నన్నయకూ, తిక్కనకూ మధ్య రెండు శతాబ్దాల ఎడమున్నది ఈమధ్య కాలమే శైవకవుల శకం. వీరు వీర శైవులు. నన్నెచోడుడు, మల్లికార్జున పండితారాధ్యుడు, పాల్కురికి సోమ నాథుడు, యథావాక్కుల అన్నమయ్య— ఈనలుగురూ శైవకవులలో ముఖ్యులు.

శ్రీపతి పండితుడు, శివలెంక మంచన పండితుడు, మల్లికార్జున పండితుడు తెలుగుదేశంలో వీరశైవ మత స్థాపనకుమూలకారకులు. వీరిలో శ్రీపతి పండితుడు 'శివదీపిక' అనే గ్రంథం తెలుగులో వ్రాసాడు. ఇతడే మొదటి తెలుగు శివకవి.

శివకవుల్లో తరువాతవాడు నన్నెచోడుడు ఇతని కాలం వివాదగ్రస్తంగా వుంది ఈయన వ్రాసిన 'కుమార సంభవం' 1908 లో మానవల్లి రామకృష్ణకవి ప్రచురించేవరకూ, అసలలాంటి పుస్తకం వున్నదన్న సంగతే ఎవరికీ తెలియదు తంజావూరుప్రతిని ఆధారం చేసుకొని, రామకృష్ణకవి దీన్ని ప్రచురించాడు నన్నెచోడుడు నన్నయభట్టుకు ఒక శతాబ్దం పూర్వపువాడని రామకృష్ణ కవి తన పీఠికలో వ్రాసాడు

నన్నెచోడుడు రాజు. ఏ దేశ పాలకుడో వ్రాసుకోలేదు. ఈయనతండ్రి పాకనాడును పరిపాలించేవాడు గుంటూరు, కందుకూరు, నెల్లూరుహద్దు నుండి సముద్రంవరకూ ఉన్న 21 వేల గ్రామాలు ఈ రాజ్యంలో ఉండేవి. ఈ రాజ్యం 1160 కి పూర్వం వుండేది. తర్వాత వెలనాటి చోళులే ఈరాజ్యాన్ని జయించినారు. నన్నెచోడుడు ఏరాజ్యాన్నిపాలించి వుండడు. ఇక "టెంకణాదిత్యుడు" అనే ఇతని బిరుదు వంశ పారంపర్యంగా వచ్చిందే కాని, దానికేమి ప్రత్యేకమైన అర్థంవుండదు.కనుక నన్నెచోడుడు నన్నయభట్టుకు పూర్వుడనడానికేమీ చారిత్రకాధారం లేదు.

నన్నయ పోకడలకూ, నన్నెచోడుని పోకడలకూ తేడావుంది కనుక, నన్నెచోడుడు నన్నయ్యకు పూర్వుడని రామకృష్ణ కవి వ్రాశాడు. 'బ్రహ్మాండ' అనే దానికి ప్రాసగా 'మూండు' అని వాడాడు. ఇది ప్రాచీన లక్షణ మని రామకృష్ణకవి.

అయితే ఇదే ప్రయోగం పాల్కురికి సోమనాథుడు కూడా చేశాడు ఆయన నన్నయ్యకు తర్వాతివాడని అందరికీ తెలుసు గదా!

వలపలి గిలక ప్రాసవేశాడు నన్నెచోడుడు ఈ ప్రాసను నన్నయ్య వాడలేదు. కాని శైవ కవులందరూ వాడారు

నేర్చికొను - నేచికొను, నేర్తున్ - నేతున్ అని తిక్కన ప్రయోగించాడు ఇది తెలుగు సంప్రదాయం. యౌవనం- యవ్వనం - జవ్వనం; ఇందులో యవ్వన మని నన్నె చోడుడు ప్రయోగించాడు ఇదే ప్రయోగం అనంతుని భోజరాజీయంలో కూడా కన్పిస్తుంది. ఇంకా చాలామంది వాడారు నన్నయ 'ముష్టా ముష్టి' అని సంస్కృత వ్యాకరణ విరుద్ధంగా వాడాడు ఇది సంస్కృతానికి 'తెలుగీ కరణ'. నన్నెచోడుడు 'పుడమీశుడు, పుడమిపుడు' అని ప్రయోగించాడు. ఈ ప్రాచీన తెలుగు సంప్రదాయాన్ని గమనిస్తే, నన్నెచోడుడు నన్నయ తరువాతివాడని తేలుతుంది.

ఇక 'ఆంధ్రం' అనే పదాన్ని నన్నయ్య వాడలేదు; శివకవులూ వాడలేదు. శివకవులు జాను తెనుగని ప్రయోగించారు కవిత్వ పద్ధతుల్లో మార్గి, దేశి - అని రెండుచెప్పారు. ఇందులో మార్గిఅంటే సంస్కృత లక్షణానుగుణంగా తెలుగులో వ్రాసేది; దేశి దేశానికి సహజమైనది. సంగీతంలో కూడా మార్గతాళం, దేశితాళం-అని రెండు తాళాలున్నాయి

ఇక్కడ జాను తెనుగు అంటే తెనుగు జనపదాల్లో వాడుకలో ఉన్న భాషఅని అర్థం జాను చదునునుండి వచ్చింది — అనేవ్యుత్పత్తి ఎంతవరకు సరియైనదీ చెప్పలేము

దండి కావ్యాదర్శంలో చెప్పిన నవరసాలు, అష్టాదశ వర్ణనలు, 32 అలంకారాలు శివకవులు తమ కావ్యాల్లో వాడారు శివకవులలో మొట్టమొదట కుమార సంభవములాంటి ప్రబంధాలు బయలుదేరాయి కాగా తర్వాత ఎప్పుడో హరివంశం, నృసింహపురాణం వ్రాసిన ఎఱ్ఱాప్రెగడ ప్రబంధ పరమేశ్వరుడనడము;—ప్రబంధం కనిపెట్టి నందువల్ల పెద్దన ఆంధ్రకవితా పితామహుడనడం అర్థంలేనిమాట. ప్రబంధమనే కావ్యం కృష్ణదేవరాయల కాలంలో జాతీయ జీవనచిత్రణకు వినియోగించ బడింది తరువాతి ప్రబంధాలు వీటికి కార్బను కాపీలు కవిరాజ శిఖామణి నన్నెచోడుడే మొట్టమొదటి ప్రబంధం వ్రాసాడు

మల్లికార్జున పండితారాధ్యుడు శివతత్వసారం అనే గ్రంథం వ్రాసాడు. ఇది అసంపూర్ణం కేవలం శైవమత విషయకం అందువల్లనే దీనికి తెలుగు సాహిత్యంలో అంతపేరు రాలేదు ఇదంతా కందపద్యమయం

పాల్కురికి సోమనాథకవి బసవపురాణం పండితారాధ్యచరిత్ర వ్రాసాడు ఇంకా అనేక కావ్యాలు వ్రాసాడు. మణిప్రవాళశైలి. అరవంలోను, కన్నడంలోను కూడా వ్రాసాడు. ఈయన కన్నడ శైవవాఙ్మయానికిఆదిపురుషుడు. కన్నడములో జైనవాఙ్మయం తర్వాత శైవ వాఙ్మయమే చెప్పుకోదగింది

సోమనాథుడు వృషాధిప శతకం

వ్రాసినకాలం నుండీ శతకాలు బయలు దేరాయి. ప్రజాజీవితాన్ని అర్థం చేసు కొని, వ్యక్తి జీవిత విశేషాలతో మేళ వించి చిత్రించేవారు శివకవులు. వీరికి ప్రజలతో బాగా సంబంధం వుండేది. వీరు అగ్రజాతులవారి కోసరంగాక, మామూలు ప్రజాసామాన్యం కోసమే వ్రాసారు. అందువల్లనే సొంపయిన తెలుగు ఛందస్సులో వ్రాసారు. అప్పుడే బయలుదేరింది శైలినిగూర్చిన చర్చ.

పాల్కురికి సోమనాధుడు ప్రాస యతిని ప్రయోగించాడు. ఇది ఆ కాలంలో ఒక పెద్ద విప్లవం. ఆయన ద్విపదల్లో కావ్యకళనుచూపిస్తానన్నాడు. అన్నం పెరుగూ కలపాలిగాని, వడ్లూ పెరుగూ కలిపినట్లు ప్రజల కర్థంగాని భాషలో కావ్యకళ చూపి మాత్రం ఏం ప్రయోజనమన్నాడు. "ఐహికాముష్మిక ద్విపద హేతువు ద్విపద నాబరగు" నన్నాడు.

ద్విపదవాఙ్మయానికి, మూల పురుషుడు సోమనాధుడు - సోమనాధుని బసవ పురాణమే తెలుగులో మొదటి ద్విపదకావ్యం. తరువాత రమారమి రెండువందలకి పైగా ద్విపదకావ్యాలు బయలుదేరాయి.

పాల్కురికి సోమనాధుని సమకాలి కుడూ, శిష్యుడూ అయిన చక్రపాణి రంగనాధుడు తెలుగు, కన్నడభాషలలో గొప్పకవి - రంగనాధుడని కవులచరిత్ర పేర్కొన్నవాడితడే. ఈతడే రామాయణము ద్విపదగా వ్రాసాడు. కాబట్టే దానికి రంగనాధ రామాయణమని పేరు వచ్చింది. అయితే నేడు రంగనాధ రామాయణం గోన బుద్ధారెడ్డి రచితమని ఉన్నది - బుద్ధారెడ్డి రంగనాధుడు సమకాలికులవడంచేత. యీ చిక్కు ఏర్పడింది. బుద్ధారెడ్డి భాషాభిమాని కవి అవడంచేత. రంగనాధుని గద్యలు, మొదలైనవి తప్పింపచేసి తన పేరు అతికించికొని యుండును కాని పండిత లోకములో ప్రసిద్ధమైన రంగనాధుని పేరు తప్పించలేకపోయినాడు. లక్షణ గ్రంధాల్లో రంగనాధుని రామాయణమని యున్నది - ఏకుమళ్ళ రంగశాయికవి - (యిప్పటికి 200 ఏండ్ల క్రిందటివాడు) ద్విపద భాగవతంవ్రాస్తూ అందులో ద్విపదలో రామాయణం వ్రాసినవాడని స్పష్టంగా వ్రాసాడు - రంగనాధ రామాయణ ద్విపద బహు మనోహరంగా ఉంటుంది - లక్షణగ్రంధ కర్తలు దీన్నిప్రమాణంగా తీసికొన్నారు. అయితే భాషాపరిపాటిలో ఇది శైవ కవులనుసరించినదే. ఈ విషయమై ప్రత్యేక పరిశ్రమ యవసరం.

యధావాక్కుల అన్నమయ్య క్రీ.శ. 1242 లో సర్వేశ్వరస్తోత్రము - మత్తేభ శార్దూల వృత్తాల్లో చెప్పాడు - ధారాళమైన ఈతనిశయ్య భావములు తక్కిన శతకములకు మాతృకలైనవి- క్రీ.శ. 1130 లో మల్లన 'గణిత శాస్త్ర సార సంగ్రహం' వ్రాశాడు. అందులోని కొలతలు ఈనాటికీ వాడుకలో వున్నాయి. ఆ కొలతలే కాకతీయుల కాలంలోను వుండేవి ఇది మన సాహిత్యంలో మొదటి శాస్త్రీయ గ్రంధం.

తర్వాత 1250 మొదలు 1320 వరకు తిక్కనయుగం. ఈ శకంలో

మొదటివాడు కేతన. ఈయన తిక్కన శిష్యుడు. తన దశకుమార చరిత్రను తిక్కనకే అంకితమిచ్చాడు ఆంధ్ర భాషాభూషణమనే వ్యాకరణం వ్రాశాడు. ఇదే తెలుగులో మొదటి వ్యాకరణము కన్నడంలోని నాగవర్మ కర్నాట భాషా భూషణంలాగానే యిదికూడా వ్రాయ బడింది. ఇక కేతన వ్రాసిన మూడవ గ్రంథం విజ్ఞానేశ్వరీయం అనే గ్రంథం. తెలుగులో మొదటి ధర్మశాస్త్రం

గంగాదేవి మధురావిజయం అనే సంస్కృతకావ్యం వ్రాసింది అందులో ఆమె తిక్కయజ్వను సంస్కృత కవిగా వినుతించింది. విద్యానాథుణ్ని కూడా పేర్కొన్నది

తిక్కన ప్రథమదశలో కేతన ఉన్నాడు. తిక్కన దండనాయకుడుగా ఉన్న కాలంలోనే, అంటే మంత్రిగా ఉన్న కాలంలోనే కేతన ఆయనకు కృతి నిచ్చాడు. తర్వాత తిక్కన యజ్ఞంచేసి మహాభారత రచన కుపక్రమించాడు. దేశి కవితారీతిని నిర్వచనంగా ఉత్తర రామాయణం వ్రాశాడు తన తాతగారైన మంత్రి భాస్కరుని పద్ధతినిబట్టి, ఆశ్వాసాంతాలు విభక్త్యంతములుగా వ్రాశాడు. తన ప్రభువైన మనుమసిద్ధిని అక్కన్న బయ్యన్నలు రాజ్యంనుంచి తరిమివేశారు. కాని తిక్కన కాకతి గణపతిదేవుని సహాయంతో అక్కన్న బయ్యన్నల నోడించి, మనుమసిద్ధిని మళ్ళీ రాజ్యానికి తెచ్చాడు.

కాకతి గణపతి గురువు విశ్వేశ్వర శివదేశికులు - శివదేవయ్య వ్యవహార నామం. ఈయనకు ఆంధ్ర కవితా పితామహుడని బిరుదు. ఈయన పురుషార్థ సారం అనే రాజనీతి గ్రంథం వ్రాశాడు. తిక్కనకు ఈయనంటే చాలా గౌరవం. భీష్మ నిర్యాణ ఘట్టంలో 'పురుషుడు పురుషార్థ సార భూషణుడు గదే' అన్న చోట తిక్కన శివదేవయ్యను లక్షించి వుంటాడు.

వీటన్నిటినీ బట్టి 1260 నాటికి, అంటే కాకతి గణపతిదేవుని కాలం నాటికి, తిక్కన భారత రచన నారంభించాడని తెలుస్తున్నది తిక్కన 1288 లో చనిపోయినట్లు ఒక ఆధారం వుంది ఈయనకు చివరిరోజుల్లో మారన కవి శిష్యుడు

మారన మార్కండేయ పురాణం వ్రాశాడు నాగయగన్న మంత్రికి కృతి యిచ్చాడు. ఈ గన్నడి తాత తలారి. మారన ద్వితీయ ప్రతాపరుద్రుని కాలం వాడు (1295 - 1326.)

1294 లో ఒకసారి మహమ్మదీయులు మన దేశంమీదికి వచ్చి వెళ్లారు. తర్వాత 1303 లో దేవగిరిమీద పడి గెల్చి కప్పం వసూలుచేసుకొని వెళ్లారు. 1309 లో ఒరంగల్ మీద పడ్డారు; కాని ఓడిపోయారు. ఈ యుద్ధంలో నాగయ గన్నడు సేనా నాయకుడు 1326 ప్రాంతంలో కాకతీయ రాజ్యం అంతరించింది.

తిక్కన్నే తెలుగువాఙ్మయ సృష్టికర్త అని, కవి బ్రహ్మ అని ఎఱ్ఱాప్రెగ్గడ చెప్పాడు. తెనుగుభాష, తెనుగుజాతి, తెనుగుతత్వము— ఈ మూడింటికిన్నీ సామరస్యంకలిపి, ఉత్కృష్టమైనట్టిదిన్నీ ఉత్తేజకరమైనట్టిదిన్నీ ఉదాత్తమైనట్టి

దిన్నీ యైన తెనుగు జాతీయ వాఙ్మయ సౌధం సంఘర్షణలేని సామరస్యం అనే పునాదిపైననిర్మించాడు లౌకికుడై రాజకీయంగా మంత్రియైనప్పటికీ, వైదికయై యజ్ఞంచేశాడు కత్తిగంటం ఒకేలాగున నడిపించిన మహావ్యక్తి వీరశైవ, వీర వైష్ణవ మతభేదాలవల్ల తెనుగుసంఘం సంకుచిత హృదయ మైపోతుందని హరిహరనాథ తత్త్వం ప్రతిపాదించాడు. ఈ మతం నిత్యజీవితంలో తను సమన్వయం చేసుకోవడమేకాకుండా, భారత కావ్యరూపాన్ని, ఆ ధర్మతత్త్వాన్ని ప్రబోధం చేసాడు

తెలుగులో మొదట కృతికర్తా, కృతిభర్తా అయినవాడు తిక్కనయే. తిక్కన్న అంటే తిగ + కన్ను, మూడు కన్నులు గలవాడు ఈశ్వరుడనే అర్థం చెప్పారు కాని తిక్కన శబ్దవ్యుత్పత్తి అది కాదు అది శ్రీ కాళహస్తీశ్వరుడి నామం అరవంలో తిరుక్కాళత్తి అయినది అది తెలుగులో సంకుచితమై పోయి తిరుక్క - తిక్క అయింది

ఈతని కాలములోని మంచన అనే కవి కేయూరబాహు చరిత్ర అనే ప్రబంధం వ్రాసినాడు. ఇది సంస్కృత నాటకం ప్రబంధంగా వ్రాసింది. అట్టి పద్ధతి కితడే శ్రీకారము చుట్టాడు. ఇందులో అవతారిక వెలనాటి చోడుల చరిత్రకు చాల ముఖ్యమైనది కవిత్వం చాలా సరళంగా ఉంటుంది. దీనికి సంస్కృత మాతృక రాజశేఖరకవి విద్ధసాలభంజిక అనే నాటిక.

తిక్కన భారతం చంపూ పద్ధతినే నడవటంచేత తక్కిన కవులంతా విశేషించి, చంపూపద్ధతినే అవలంబించారు. దానితో సోమనాథ రంగనాథులు పునరుజ్జీవింప చేసిన ద్విపద వాఙ్మయంలో రచన సన్నగిల్లింది— శతకాలు మొదలైన శాఖలమీద కూడా మోజు లేకపోయింది— చంపూ పద్ధతే సర్వే సర్వత్ర సాహిత్య పథకంలో రాచబాట అయింది.

కాకతీయుల తరువాత తెలుగుదేశం నూరేండ్లు రెడ్డిరాజులు పాలించారు-వీరికి మొదట అద్దంకి రాజధాని—తరువాత కొండవీడు—వీరు కాకతీయుల వలెకాక, తెలుగు కావ్యాలు కృతులు పొందారు- ఈ ఆంధ్రమహాసామ్రాజ్యమంతా ఏకముఖంగా ఏలారని మనముగర్వించే కాకతీయ రాజులలో ఒక్కరూ స్వయంగా కృతి భర్తలు కాలేదు

రెడ్లు కృతికర్తలు కృతిభర్తలు అయినారు. రెడ్డిరాజుల యుగం- క్రీ. శ. 1320-1450 వరకు అని చెప్పవచ్చును.

ఈ రెడ్డి రాజులలో అనవేమా రెడ్డి కాలంలో ఎఱ్ఱాప్రగ్గడ వెలసినాడు ఈతడు మొదట రామాయణము రచించి అన వేమారెడ్డి తమ్ముడైన మల్లారెడ్డికి కృతి యిచ్చాడు. ఎఱ్ఱాప్రగడ రామాయణం చంపూ పద్ధతినే ఉన్నది- కాని యిప్పుడు కనిపించడములేదు- కూచిమంచి తిమ్మన సర్వ లక్షణసార సంగ్రహంలో కొన్ని పద్యాలు ఉదాహరించినాడు.

తరువాత భారతమునకు సంబంధించిన హరివంశమును పూర్వోత్తర భాగములు రెండింటిని రచించి అనవేమా రెడ్డికి కృతియిచ్చినాడు, ఆపైని భారతములో అరణ్యపర్వములో నన్నయ

విడిచినభాగము అరణ్యపర్వశేషం వ్రాసి నన్నయ వ్రాసినట్లుగా రాజరాజునకు అంకితముచేసాడు. ఇది వ్రాసిన తరువాత ఈతడు "ప్రబంధ పరమేశ్వరుడు" అని బిరుదు వహించాడు తరువాత నరసింహపురాణం వ్రాసాడు. ఇది పురాణమై ప్రశస్తమైన ప్రబంధఫక్కీని ఉంటుంది దీనికి తాళపత్ర మాతృక నేటివఱకు లభ్యంకాలేదు

కవితా విషయంలో ఎఱ్ఱాప్రెగ్గడ నన్నయ్యలో ఉండే ప్రసన్నగుణము, తిక్కనలోఉండే తెనుగు జాతీయత రెండు సమ్మేళనము చేసినాడు-ఈతని కవిత్వం చాల ప్రసాద గుణముగలది. కాబట్టే నన్నయ్య, తిక్కన, ఎఱ్ఱన వీరుముగ్గురిని కవిత్రయమని తరువాత కవులు నుతించారు,

ఎఱ్ఱాప్రెగ్గడ పద్ధతి చంపూపద్ధతి అగుటచేత, దేశిరచనలు పెంపొంద లేదు ఎఱ్ఱాప్రెగడ కాలమునకు తరువాత శ్రీనాధుని కాలంలో దేశిరచన తిరిగి అభివృద్ధిలోనికి వచ్చింది.

ఎఱ్ఱాప్రెగ్గడతో సమకాలికుడు నాచన సోమనాధ కవి. ఈతనిని అధునాతనులు చిన్నయసూరిగారు సర్వజ్ఞుడని అన్నారు. సీతారామాచార్యులుగారు, వీరేశలింగం పంతులవారు సూరిగారిని అనుసరించారు. ఈతడు తెలుగుకవులలో ఉద్దండకవి భావనా ప్రపంచంలో నన్నెచోడ కవిరాజు ఒక్కడే యితనితో తులతూగువాడు. ఈతడు హరివంశములోని ఉత్తరభాగంలో కథలు తీసికొని ఉత్తర హరివంశ మను పేర 6 ఆశ్వాసాలప్రబంధం వ్రాశాడు ప్రతిభ పాండిత్యము ప్రతి పదమునందును చూపే నాచన సోమనాధుని కవిత్వంలో ప్రసాదగుణం చాలా తక్కువ. ఎక్కువగా మేధస్సును ఆకర్షిస్తుంది. సోమనాధుని కవిత్వం హృదయాన్ని ఆకర్షించలేదు. ఇతడు తిక్కనవలె హరిహరనాధునకు తన కావ్యము అంకితం చేసినాడు భారత కవి త్రయంలో తన్ను చేరుస్తారని గద్యలో తిక్కన్నను పేర్కొన్నాడు అయితే ఆ గౌరవం ఎఱ్ఱాప్రెగడకు దక్కింది. ఈతనికి సాహిత్య రస పోషణ డనే బిరుదము ఉన్నది. ఇతని ఉత్తర హరివంశంలో అపూర్వ పదములు - ప్రయోగాలు - సంప్రదాయ పరిజ్ఞానమువలన సాధింపదగిన విషయాలు చాలా ఉన్నాయి. ఇతని గ్రంధంలో హంస డిభకోపాఖ్యానం చాలా బాగున్నప్పటికి ఇందు ధరోపాఖ్యానం లాంటి ఘట్టం, మన తెలుగు వాఙ్మయంలో ఎక్కడా లేదని వీరేశలింగంపంతులుగారి అభిప్రాయం. ఇతనికి, ఎఱ్ఱాప్రెగడకిగలకవితాభేదాలను గూర్చి పండితులు చాలా దెబ్బలాడుకున్నారు. పర్యవసానము తక్కిన వాదాల్లాగే నికరము తేలలేదు

ఈరెడ్డిరాజుల పాలన-క్రీ. శ. 1370 వఱకును మొదటిభాగముగా పరిగణించిన ఎఱ్ఱాప్రగడ యుగంతో సరిపోవును. తరువాత 1360-70 మొదలు 1450 వఱకు శ్రీనాధ మహాకవియుగమని చెప్పడం సమంజసము. అదిరెడ్డి రాజుల పాలనలో రెండవ భాగముగా చారిత్రకంగా యేర్పడుతుంది.

హంపీ - మన బాధ్యత

శ్రీ గొర్రెపాటి వెంకటసుబ్బయ్య

"వెలిగించరా సోదరా
నవ్యాంధ్ర జ్యోతిని
వెలుగులను వెదజిమ్మరా !
లేపాక్షి లేఖనము
హంపీ విచిత్రముల
తీర్చి దిద్దినశోభ
వెల్లువల గట్టంగ
వెలిగించరా సోదరా"

—ఏడిద కామేశ్వరరావు.

కర్ణాటక సామ్రాజ్యకాలంలో మనం అన్ని విధాల అభివృద్ధి పొందాం అది దక్షిణ భారత చరిత్రలో స్వర్ణయుగం. ఆ సామ్రాజ్యం జీర్ణమైనా, దానికి రాజధాని యైన విజయనగరం, ఉత్తర హిందూస్థానములోని చరిత్ర ప్రసిద్ధమైన అయోధ్య, పాటలీపుత్ర, కన్యాకుబ్జ స్థానేశ్వర పట్టణములవలె పూర్వపు పోలిక లేకుండా మారిపోక వున్నందుకు మనం ధన్యులం నేడు విజయనగరం నిర్మానుష్యమైనా, కేదారభూయిష్టమైనా, ఆనాటి శోభ శిధిలావస్థలో కూడ యాత్రికుల భావనా బలమున కందునట్లు నిల్చియుండుట మనఅదృష్టం అనాలి.

మన భారతభూమిలో ప్రాచీనకట్టడాలెన్నో భూమిలో విలుప్తమైనవి మరి ఎన్నో మహమ్మదీయులు నాశనం చేసారు. మన అశ్రద్ధవల్ల, మూర్ఖత్వం వల్ల యెన్నో రూపురేఖలు లేకుండా పోయినవి. ఇంకా పోవుచున్నవి. మిగిలిన వాటిలో కొన్ని పరదేశాలకు పయనమై పోయినవి.

ఇట్టిస్థితిలో అత్యధికశిల్పాలు ఒక్కచోట విజయనగరానే గలవు. అది మన సహజవస్తుప్రదర్శనశాల(మ్యూజియం). ఆ శిల్పాలదశగాంచి సంరక్షణకై సవతి తల్లిప్రేమతో చూచే, ఆర్కిలాజికల్ డిపార్టుమెంటు సంరక్షకత్వంతో సంతృప్తి పొందవలసినదేనా ? మన బాధ్యతయేమైనా కలదా ? విజయనగర సామ్రాజ్యము మాదని కర్ణాటకులు, మాదనిఆంధ్రులు వాదులాడినప్రయోజనమేమి? మీదైనచో యేమిచేశారు ఆ శిల్ప రక్షణకు? దానివైభవప్రకటనకు ?

కర్ణాటకులు 1936 సం॥రము డిశంబరు 25, 26, 27 తేదీలలో హంపీ బజారులో కర్ణాటక సామ్రాజ్యపు 6 వ శతాబ్దపు స్మృతిసమావేశము జరిపి కృతార్థులయ్యామని కూర్చున్నారు. ఆంధ్రులు 1946 వ అక్టోబరు 13, 14, 15 తేదీలలో విరూపాక్షుల యావరణలో విజయనగర సామ్రాజ్యదినోత్సవ సమావేశము జరిపి తమ ప్రాచీన వైభవాన్ని స్మరించుకొని హంపీ అభివృద్ధికై ప్రభుత్వానికొక తీర్మానం పంపారు. ఒక సంచికకూడా ఆంధ్ర ఐతిహాసక పరిశోధక సంఘము, రాజరాజనరేంద్ర పట్టాభి

షేక సంచికవలె ప్రచురించవచ్చు.అంత టితో ఆఖరు ఆంధ్రులపని.

మన ఆంధ్రులు ఈ విజయనగర సామ్రాజ్యం మనదని సగర్వంగా వ్రాసు కున్నారు చెప్పుకుంటున్నారు. ఒక కాకతీయ సామ్రాజ్యంతప్పితే అచ్చంగా ఆంధ్రులదని సగర్వంగా చెప్పుకునేది లేదని సవినయంగా విన్నవిస్తున్నాను. విజయనగర సామ్రాజ్యం కర్ణాటకులదని వాదనవున్నట్లే, శాతవాహనసామ్రాజ్యం మహారాష్ట్రులదని మరొకవాదన కలదు. కర్ణాటక సామ్రాజ్యపు నాలుగువంశాల్లో సంగమ, సాళువ, వంశాల సంగతి వివాదగ్రస్తం. స్పష్టంగా నే చెప్పజాలను. కాని కృష్ణరాయల వంశమగు తుళువవంశము స్పష్టంగా కర్ణాటకవంశమే నాల్గవ వంశమగు ఆర్వీటివంశం అచ్చంగా ఆంధ్రవంశం. అయినా, ఆనాటి ఆంధ్రకర్ణాటక సమైక్య కృషియే విజయనగర సామ్రాజ్యాభి వృద్ధికి ఆధారమయింది. అది మన ఉమ్మడిది. ఆంధ్రులదేకాదు ః ఆంధ్రులది కూడా అని గ్రహించుట అవసరం.

కనుక ఆంధ్రులు కర్ణాటకులు విడి విడిగాగాని సమిష్టిగాగాని ఈశిల్ప సంర క్షణకై సత్వరంగా కృషిచెయ్యాలి. అది స్వయంగా చెయ్యనీ, ప్రభుత్వం చేతచేయించనీ. విరలాలయంలో ద్వారం వద్దనున్న ముద్దులమూటగట్టు విగ్ర హాలు అట్లా ఎండకూ వానకూ తడిసి ఎంతకాలం వుంటవి ? అట్టివి మరికొన్ని లోటస్‌మహల్‌వద్ద కమలాపురంలోనూ (టూరిస్టులదర్సుబంగళా) కలవు. వాటి నన్నిటినీ, విరలాలయంలో ఒక భవనం కట్టించి అక్కడ భద్రపరచాలి.

పడిపోతూవున్న భాగాలు మరమ్మతు చేయించాలి.

యాత్రికులు అనేకులు ఆ భవ్యమంది రాలమీద తమపేర్లువ్రాసి పాడుచేస్తు న్నారు. అట్లాచేయకుండా, అధికంగా కాపలాగాండ్లను నియమించాలి.

అమరావతీస్థూప చిత్రాలన్నీ అచ్చు వేసి వివరాలతో ఇంగ్లీషులో ప్రకటించి నట్లే, విజయనగర శిల్పాలుకూడా ప్రక టించి దేశభాషలో వివరాలు వ్రాసి అందుబాటగు ధరలతో ప్రకటించాలి.

ఇంకా వివిధప్రాంతాలు త్రవ్వించి పరిశోధన చేయాలి.

విజయనగర శిల్ప వైభవమంతా ఫిలింకంపెనీ ద్వారా ప్రచారం చెయ్యాలి.

విజయనగర సామ్రాజ్య వైభవాన్ని యితివృత్తంగా తీసుకొని ఒక ఫిలిం తీయాలి.

ఆనాటివైభవం, శిల్పసంపద వర్ణిస్తూ నూతన సందేశాలతో మన కవులు కలాలు కదపాలి యాత్రికులకు అందు బాటులో వుండేటట్లు వసతులు వృద్ధి చేయాలి.

అక్కడికి వచ్చినవారికి ఆరోగ్య భంగం కాకుండా వసతులు కల్గించాలి.

విజయనగరం జనవాసయోగ్యంగా వుండే ప్రయత్నాలన్నీ ప్రభుత్వంచేత చేయించి అది తిరిగి ప్రాముఖ్యతలోనికి వచ్చు ఏర్పాటులన్నీ చేసినప్పుడే మనం గర్వించగల కారణం వుంటుంది. పెద్ద లిచ్చిపోయిన సంపదంతా మన కళ్ళ

యెదుట నశించుచుండుట చూచి వుపేక్ష వహించుట ఉచితమా ! కనుక ఇందుకై సంస్థలు, వ్యక్తులు విరివిగా యత్నించాలి. ఆందోళనవల్ల మనం ఎట్టిపనైనా యత్నించగల మనేందుకు నాగార్జున శిల్పాలసందర్భంలో మన కృషిఫలితమే నిదర్శనం

ఇలాగే ఆంధ్ర దేశంలో అక్కడక్కడా వున్న శిల్ప సంపదనంతా కాపాడుకుంటూ ఒక మ్యూజియం నెలకొల్పుటకు తీవ్ర కృషిచేయాలి. మన ఆంధ్రదేశంలో మ్యూజియం లేకపోవుట చేతనే మన శిల్పాలన్నీ పలు ప్రాంతాలకు పోయినాయి వాటి నన్నిటినీ మరల మనం రప్పించాలి.

ఇట్లా పురాతన శిల్పాలను కాపాడుకుంటూ మన కళాభిరుచిని పెంపొందించుకోవాలి. ఎందుచేతనంటే "ఏ జాతి వారెంత నాగరికత వహించారో తెలుసుకోవాలంటే, శిల్ప విద్యయందు వారెంత నైపుణ్యం కలవారో దాన్ని గ్రహిస్తేనే చెప్పగలను" అన్నాడు ఆంగ్లతత్వవేత్త రస్కిన్ మహాశయుడు.

మన పూర్వులంతా కళాప్రియులే. దేవాలయాలు, భవనాలు, ఆభరణాలు, పాత్రలు, గృహోపకరణాలు, వస్త్రాలు, ఆటవస్తువులు, అవీ, ఇవీ, అననేల మన కళాదేవతయొక్క కరకమలం స్పృశించనివస్తువేలేదు. కాని వారి సంతతివారమైన మనం అనుకరణ జీవులమై కళయొక్క వికృతాన్నే కళగా భావిస్తున్నాము. ఇంతేగాక ఏది కళాత్మకం ? అనే మాట వదిలివేసి ఏది చౌక, అనే ఆలోచింప సాగాం దాన్ని వీడాలి. నేటి నుండి శిల్పం మన నిత్యకృత్యాలల్లో జీవిత సర్వస్వంలో అల్లుకొనిపోయి సౌందర్యాన్ని పుష్పింపజేయాలి కనుక తిరిగి మనం కళాలక్ష్మికి స్వాగతమిచ్చి ఆనందప్రకాశమగు శిల్పాన్ని అభివృద్ధి గావింతుము గాక !

"అందాలు చిందేటి అమరావతియును
రాలుపలికేటి హంపీ చిత్రాలు
కళలు వర్షించు నాగార్జున కొండ
శిల్పసిరాజిరా తెలుగు లక్ష్మికి"

—నార్ల చిరంజీవి.

*

" శిలలుద్రవించి యేడ్చినవి, జీర్ణములైనవి తుంగభద్ర లో
పల; గుడిగోపురంబులు సభాస్థలులైనవి కొండముచ్చుగుం
పులకు; —చరిత్రలో మునిగిపోయిన దాంధ్రవసుంధరాధి పో
జ్జ్వల విజయప్రతాప రభసంబొక స్వప్నకథావిశేషమై—"

— కొడాలి సుబ్బారావు

'అభ్యుదయ' అమృత వర్షం

శ్రీ చిరుమామిళ్ల శివరామకృష్ణప్రసాదు

"అభ్యుదయ"ను జాగ్రత్తగ పరిశీలించినాను చచ్చి విశీర్ణమై యున్న సంఘమునకు, జవజీవములు క్రుంగిపోయి యున్న ఆంధ్ర సాహిత్యమునకు ఈ "అభ్యుదయ" అమృత వర్షమై వెలుగొందుచున్నది. ప్రతి పుటయందు, ప్రతి పంక్తి యందు, ప్రతి అక్షరమునందు, భావమునందు ఒక నూతనత్వము, ఒక ఆవేగము, ఒక విశిష్ఠత, ఒక ఆనందము వెల్లివిరసి యున్నవి. రచయితలను, నిర్వాహకులను అభినందింపవలసి యున్నది.

ఒక సముద్రము కదలినది, ఒక నుఱుగు కెరట మువ్వెత్తుగ లేచినది, ఏ శక్తి దీని నాపగలదు? ఏ యుక్తి దీనిని వంచింపగలదు? ఏ కత్తి దీనిని శిక్షింపగలదు? కానిండు. ఆంధ్రవాఙ్మయమును, ఈ మెఱుపులతో ఈ యుఱుములతో నిండిపోనిండు,

★

ఆంధ్ర సాహిత్యానికి మీ "అభ్యుదయ" తప్పక
వెలుగు నియ్యగల దని ఆశిస్తున్నాను.

— సౌరీస్

పిల్లి కథ

శ్రీ కొడవటిగంటి కుటుంబరావు

" మ్యా ! మ్యా !

" అమ్మోయ్, పిల్లకూనేవ్ ! " అన్నది చిట్టి.

"తెల్లగా ఎంత ముద్దొస్తోందో !" అన్నాడు బుల్లాడు.

" ఛీ, ఛీ! దాన్ని ముట్టుకుంటారే మర్రా. పిల్లిని ముట్టుకుంటే పంచమహాపాతకాలూ చుట్టుకుంటై, " అన్నాడు నాన్న

" మ్యా, మ్యా !" అన్నది కూన.

" చూడు నాన్నా. ఎట్లా దగ్గిరికొస్తుందో " అన్నాడు బుల్లాడు.

" ఇది పెంపుడుపిల్లి. అందుకే పారిపోవటంలేదు, " అన్నది చిట్టి.

" చూడు నాచెయ్యి ఎట్లానాకుతుందో, " అన్నాడు బుల్లాడు.

" దానికాకలవుతోంది, "అన్నదిచిట్టి

" చెబుతే మీక్కాదుటర్రా ? దాన్ని వెళ్ళగొట్టండి ముందు.....బొచ్చంతారాలిపోయి ఎంత అసహ్యంగా ఉందో, దాన్ని ముట్టుకున్నారంటే మీకూ్కడా చీడ పట్టుకుంటుంది, "అన్నాడు నాన్న.

" దాని కాకలవుతుంది, నాన్నా. కొంచెం అన్నంపెట్టి వెళ్ళగొడదాం, " అన్నది చిట్టి.

" దానికి చీడలేదు, నాన్నా, " అన్నాడు బుల్లాడు. మజ్జిగా అన్నమూ కలిపిపెడితే కూన ఉత్సాహంగాతిన్నది.

అనుకున్న ప్రకారం కూన ఇల్లువదిలిపోలేదు అది ఇల్లు తన సొంతం చేసుకున్నది. అందరితో పాటు ప్రతిపూటా తిండి కొచ్చేది. మిగతా సమయాల్లో ఎండపొడో, వెచ్చని చోటో చూసుకొని నిద్రపొయ్యేది. రాత్రిపూట ఎవరో ఒకరి పక్కలో పడుకునేది దాని యిష్టం వచ్చినప్పుడు బయటికి వెళ్ళి పెత్తనాలు చేసి వచ్చేది.

నాన్నకు పిల్లిని చూస్తే చాలా కోపంగా ఉండేది. "ఏమిటీ వెధవపిల్లి? పొద్దునే మనకు దీని దర్శనం! అస్తమానమూ ఏ పనిచేసుకోబోయినా అడ్డం వస్తూంటుంది.... పిల్లలూ, మీరు దీన్ని మచ్చికచేస్తే ఊరుకోను రెండుపూటలు తిండివెయ్యకుండాఉంటే అదేపోతుంది" అన్నాడు నాన్న.

"ఏం, నాన్నా, పాపం....!" అన్నది చిట్టి.

"పిల్లి పాపిష్టిది ఇంకా కుక్కనయం విశ్వాసం గల జంతువు. దానికి స్వామిభక్తి ఉంది. పిల్లికి విశ్వాసం లేదు. తన సుఖమే చూసుకుంటుంది. ఇంకొకరి సుఖం ఓర్చలేదు. మనం ఏదన్నా తింటుంటే శాపనార్థాలు పెడుతుంది. పిల్లి శాపనార్థాలంటే అవే.

మనం తినే ముద్దలుకూడా లెక్కపెడు తుంది" అన్నాడు నాన్న.

"పిల్లికి ఒంట్లు వచ్చా, నాన్నా ?" అన్నాడు బుల్లాడు.

"దాని ఒంట్లు దానికొచ్చులే." అన్నాడు నాన్న చిరాకుగా.

"పిల్లికీకూడా కృతజ్ఞత ఉంటుంది. నాన్నా. అది నాతోనూ బుల్లాడితోనూ ఆడుకుంటుందిగాని నీతో ఆడుకోదేం?" అన్నది చిట్టి.

"ఏమైనా దానికి అన్నంపెడితే నేను ఒప్పుకోను మనుషులకే తినటానికి లేకుండా ఉంది!" అన్నాడు నాన్న.

"దాని తిండెంత, నాన్నా ? మనం పారేసినంత ఉండదూ !" అన్నాడు బుల్లాడు.

"వీల్లేదు." అన్నాడు నాన్న

*

"చూడండి, ఈ దిక్కుమాలిన పిల్లి ప్రద్దాన్నోనూ మూతి పెడుతున్నదీ! ఎట్లా చచ్చేది దీంతో ?" అన్నది అమ్మ.

"గోతాలుపెట్టి ఊరిబయట విడిచేస్తే గాని దీనిపీడ వదలదు."

"దాన్ని అన్నంపెట్టక చంపుతుంటే ఏం చేస్తుందేం?" అన్నాడు బుల్లాడు

"దాన్నెవరు మేపుతారు? దానితిండి అది చూసుకోమను" అన్నాడు నాన్న.

"దాని తిండి ఏం చూచుకొంటుంది. ఇప్పుడింటో ఎలికెలుకూడా లేకుండా పోయినై" అన్నాడు బుల్లాడు.

"అవును, పాపం. దాని ధర్మమా అంటూ ఈ పిల్లొచ్చాక ఎలికెల బాధ లేదు" అన్నది అమ్మ.

"అది ఎలికెల్ని పట్టినా మనం దాని కన్నం పెట్టం" అన్నది చిట్టి.

"మనమే కృతజ్ఞత లేనివాళ్ళం" అన్నాడు బుల్లాడు.

"ఇంకేం ఎలికెల్ని పట్టుకోమను ? మళ్ళీ అన్నంకూడా దేనికీ ?" అన్నాడు నాన్న.

"ఎలికెలు అయిపోయినకొద్దీ మనకు లాభం, దానికి నష్టం. ఇదేం న్యాయం నాన్నా ?" అన్నాడు బుల్లాడు.

"పట్టుకునేటందుకు ఎలికెలు లేక పోతే ఇంకా ఈ పీనిగె మన కొంపలో దేనికీ ?" అన్నాడు నాన్న.

"అక్కర తీరితే అల్లుడు లంజ కొడుకు" అన్నాడు బుల్లాడు.

"అది ఇంటో ఉండగూడదర్రా, వెధవ చీడ పిల్లి! దాన్ని ముట్టుకుంటేనే రోగాలొస్తాయి" అన్నాడు నాన్న.

"చీడపిల్లా నాన్నా ? చూడు దాని వొంటినిండా ఊలుబంతల్లే ఎంతబొచ్చో. బలిసి ఎంత ముద్దొస్తున్నదో !" అంది చిట్టి.

"మనింటో బాగా పాలూ, మజ్జిగా తిని కొవ్వింది. లావుగా ఉండదూ ?" అన్నాడు నాన్న.

"చిక్కితే చిక్కిందంటావు, బలిస్తే బలిసిందంటావు, యెట్లా నాన్నా ?" అన్నాడు బుల్లాడు.

"మనం మనుష్యులంకదా, పిల్లుల్ని దగ్గిర పడుకోబెట్టుకోవటమూ, దాన్ని ఎత్తుకుని ఆడుకోవటమూ అసహ్యం కాదుట్రా ?" అన్నాడు నాన్న

"అది మనకన్న శుభ్రంగాఉంటుంది,

రోజుకు పదిసార్లు ఒళ్ళంతా నాక్కుంటుంది. పక్కమీద ఉచ్చకూడా పొయ్యదు" అన్నది చిట్టి.

నాన్న మాట్లాడలేదు కాని, మర్నాటి నించీ పిల్లికూడా కనపళ్లేదు. నాన్న ఏంచేశాడో మరి.

★

క్రిస్మస్ శెలవులకి బావొచ్చాడు

చిట్టీ, బుల్లాడూ బావ చెరో చెయ్యీ పట్టుకు వేళ్ళాడుతూ పిల్లి కథంతా చెప్పారు.

"పిల్లిని వెళ్ళగొట్టటంఅన్యాయమే" అన్నాడు బావ. "మచ్చికచెయ్యని పిల్లి దాని యిష్టంవచ్చినట్లు అది జీవిస్తుంది. తిండి దొంగిలిస్తుంది. కొట్టబోతే పారిపోవటం నేర్చుకుంటుంది దాని బతుకు అది చూసుకుంటుంది. కాని మనం దాన్ని మచ్చిక చేసిన తరువాత దాని బతుకు అది చూసుకోలేదు. ఎలికెలబాధ కోసం పిల్లిని పెంచి ఎలికెల బాధ పోగానే దాన్ని వెళ్ళగొట్టేస్తే దాని గతి ఏంకానూ ? కొన్నాళ్ళు మనుషులు దానికి తిండి పెట్టటంచేత మనిషి తనకు శత్రువనేజ్ఞానం దానికి లేకుండాపోతుంది. దొంగతనంగా తిండి సంపాదించటం దానికలవాటుండదు మనిషిని నమ్ముతూ అది తిండిలేక చస్తుంది. ఆ పాపం పెంచినవాళ్ళని చుట్టుకుంటుంది" అన్నాడు బావ.

"ఇప్పుడు మళ్ళీ మనింటో ఎక్కడ చూసినా ఎలికెలే" అన్నది చిట్టి.

"ఎందుకుండవూ ? పిల్లి ఉన్నంత కాలమూ దానిఉపయోగం ఏమీ లేనట్టే ఉంటుంది. అదిపోయిన తరువాతగాని దానిప్రయోజనం తెలియదు." అన్నాడు బావ

"పిల్లులు మంచివికావంటాడే నాన్న? వాటిని ముట్టుకుంటే పంచమహా పాతకాలు చుట్టుకుంటాయట. వాటిని ముట్టుకుంటే రోగంకూడ వస్తుందట." అన్నాడు బుల్లాడు

"దానిబతుకు దాన్ని బతకనివ్వక మనం దాన్ని సరిగా చూడనప్పుడు పిల్లి అనారోగ్యంగా ఉండదూ ? వొంటి నిండా చీడపడుతుంది. బొచ్చంతా రాలిపోతుంది. మనంచూడకుండా అదిమనం తినే వాటిని ముట్టుకోవచ్చు. మనపక్కల్లో పడుకోవచ్చు. మనగిన్నెల్లో మూతి పెట్టవచ్చు, అట్లాకూడా మనకు రోగా లొస్తాయి ...అంతేగాని మనం శ్రద్ధగా పెంచేపిల్లి ఎంత ఆరోగ్యంగా నైనా ఉంటుంది" దానివల్ల మనకూ, మనవల్ల దానికీ, లాభం వుంటుంది. అన్నాడు బావ.

బావ ఈ మాట అంటుండగానే బుల్లాడు దూరంగా ఒక పిల్లిని చూశాడు. బయట గడ్డిలో ఏదోవెతుకు తున్నది పిల్లి.

"అదిమనపిల్లే, బావా"! అన్నదిచిట్టి.

బావా, చిట్టీ, బుల్లోడుకలసి పిల్లిని చూడటానికి బయటికొచ్చారు. వాళ్ళు దగ్గిరికి రావడంచూచి పిల్లి నాలుగు గజాలు పారిపోయి వాళ్ళకేసి భయంతో చూస్తూ నిలబడింది.

"చూశావా. చిట్టీ, మనపిల్లి ఎట్లా అయిపోయిందో, దాని వొంటి మీద

బొచ్చంతా రాలిపోయి, చిక్కిపోయి ఎట్లాఉందో ?" అన్నాడు బుల్లోడు.

"ఛీ, పాడుపిల్లి మనకొద్దు!" అన్నది చిట్టి

"మనింటో ఎలికెలో ?" అన్నాడు బావ

"ఎలికలయితేమటుకు దీన్నెట్లా పెంచుతాం, బావా ?" అన్నదిచిట్టి.

"అట్లాకాదే, చిట్టీ దీనికి నాలుగు రోజులు తిండిపెడితే మళ్ళీ బాగా బలుస్తుంది వొంటినిండా బొచ్చొస్తుంది. ఎలికెల్నికూడా పడుతుంది!" అన్నాడు బావ

"నేను పట్టుకోనా ?" అంటూ బుల్లాడు పిల్లిదగ్గిరికెళ్ళాడు. పిల్లి భయపడుతూ ముడుచుకుపోయి, పీలగొంతుతో, "మ్యాం," అన్నది.

"ఎంతజాలిగా అరుస్తోందో" అన్నది చిట్టి.

★

పిల్లి ఇప్పుడు బాగాబలిసింది. చిట్టితోనూ బుల్లాడితోనూ చాలసరదాగా ఆడుకుంటుంది. ఇంటోఎక్కడా ఎలికెఅలికిడిలేదు. అదిఒక్కోసారి నాన్నపక్కమీదికేవెళ్ళి దర్జాగా పడుకుంటుంది. నాన్నదానికేసి అనుమానంగా చూస్తాడుగాని, ఏమీఅనడు.

★

" పరుల కలిమికి పొర్లి యేడ్చే
పాపి కెక్కడ సుఖం కద్దోయ్ ?
ఒకరి మేల్ తన మేలనెంచే
నేర్పరికి మేల్ కొల్లలోయ్ ! "

— గురజాడ

భూస్వరూపంలో మార్పు

శ్రీ వి. వెంకటరామ శాస్త్రి

ప్రకృతిలో అకస్మాత్తుగా వచ్చే మార్పులు చాలా వున్నాయి. ఆధునిక శాస్త్రిలలో ఇలాంటి మార్పులకు ఎక్కువపాముఖ్యత ఇస్తున్నారు; ఆకస్మికసంఘటనలకు ఇటీవల ఇంత ప్రాముఖ్యత రావడానికి కారణాలు ఎన్నో వున్నాయి వాటిలో ఒక కారణం ఏమిటంటే·

సుస్థిరంగా కనిపిస్తున్న సమాజంలోని మానవులు ప్రకృతిలో కూడా ఈలాంటి స్థిరత్వాన్నే నిరీక్షిస్తారు. ఇదే విధంగా సమాజ పరిస్థితి అస్థిరంగా వున్నప్పుడు ఆ సమాజంలోని శాస్త్రజ్ఞులు ప్రకృతిలోని ఆకస్మిక సంఘటనలనే ప్రధానంగా చూస్తారు ఇది సహజమే. కాని ఇంతమాత్రంతోనే విషయం స్పష్టంకాదు.

సాఫీగా నడుస్తున్న ప్రకృతిలో అప్పుడప్పుడు అకస్మాత్తుగా వచ్చే సంఘటనలకు ఏ దయ్యమో, దైవమో కారణమని మన పూర్వీకులు నమ్మేవాళ్ళు.

ఉదాహరణకు : ఉరుములు మెరుపులు - ఇవి ఇంద్ర రథచక్రాల గమనమువల్ల ఏర్పడుతాయి అని మన పురాణాలలో చెప్పారు. క్రమేపి మనుష్యులు అన్నివిషయాలలోను శాస్త్రీయదృక్పథం అలవరచుకొన్నారు. అందువల్ల ఇలాంటి పురుములు మెరుపులకు ప్రకృతిలోని కారణాలను తెలుసుకోగలిగారు.

ఇంకా పాశ్చాత్యదేశాలలో చూడండి. నూరు సంవత్సరాలవరకు కూడా చాలా పిచ్చినమ్మకాలుండేవి ప్రపంచం 6000 సంవత్సరాల క్రితం సృష్టింపబడిందనీ, అటుతరువాత 1000 సంవత్సరాలకు ఒక మహాప్రళయం వచ్చిందనీ, భూస్వరూప లక్షణాలన్ని ఈ సృష్టి ప్రళయాలవల్లనే కలిగాయిగాని మరేమీ లేదనీ నమ్మేవారు.

కాని, శాస్త్ర పరిశోధనవల్ల తేలిందేమిటి? మన భూమిమీది నైసర్గిక లక్షణాలన్నీ అంటే గొప్పగొప్ప పర్వతాలదగ్గరనుంచి అగాధమైన సముద్రాలవరకు ప్రతి ఒక లక్షణం నేడు మన కంటిముందు కనిపిస్తున్న ప్రకృతిశక్తులు అక్షలాది సంవత్సరాలుగా పనిచేయటంవల్ల కలిగినవే - అనే మూలసిద్ధాంతాన్ని భూగర్భశాస్త్రంలో మొట్టమొదటిసారిగా లైయల్ శాస్త్రజ్ఞుడు ఋజువుచేశాడు.

పశుజాతులలోను ఓషధులలోను భిన్నజాతుల కలయికవల్ల కొత్త కొత్త మిశ్రజాతి రకాలను ఉత్పత్తిచేయటం సమాజంలో అలవాటయిపోయింది. దీనిని బట్టి ఇలాంటి పద్ధతిని అనుసరించే, ప్రకృతిలో కాలక్రమాన మార్పు చెందుతున్న వివిధ పరిస్థితుల కనుగుణ్యంగా అనేక లక్షలాది సంవత్సరాల జీవితంలో వివిధకొత్తజాతుల మృగాలు

ఓషధులు ఉద్భవించి పెరిగిన వనే విషయాన్ని డార్విన్ తెలియ జెప్పాడు.

ద్రవములు వాయు పదార్థములు అత్యధికవేగంతో పరుగిడుతున్న అణువుల సమూహమని శాస్త్రజ్ఞులు క్రమేపి విశదీకరించారు. కాని ఈ అణవుల పరిమితి ఎంతో స్వల్పమవటంచేత ఇవి వున్నాయని గూడా మనకు సాధారణంగా గుర్తుకురావటం లేదు ఈ పదార్థముల గమనం నిరంతరంగా మనకు కనిపిస్తుంది.

పదార్థ విజ్ఞానశాస్త్రంలో ఇలాంటి వివరణను అనుసరించే న్యూటన్, డెకార్టే ప్రకృతిలోని ఇట్టి నిరంతరం మార్పుచెందుతున్న అంశాలను గణిత శాస్త్రరీత్యా పరిశోధించేటందుకు ఒక గణిత పద్ధతిని కనిపెట్టారు దానిద్వారా నిరంతరంగా ప్రవహిస్తున్నట్లు కనిపించే ద్రవపదార్థముయొక్క పారుదలను గురించి గణనంచేయడం సులభమయింది. కాని భస్మరూపంలో వున్న పదార్థాలయొక్క చలనమును, గణనం చేయటము కష్టసాధ్యంగానే వుంది అదే విధంగా చలనరూపములో వున్న విద్యుచ్ఛక్తి గణనము సులభంగా చేశారు. కావి, ఎలక్ట్రాన్సుకు వచ్చేటప్పటికి, వాటి చలనాన్ని గురించిన, గణనము, కష్టసాధ్యమయింది

నిరంతరమైన మార్పులను గురించిన గణితశాస్త్రాన్ని నిరభ్యంతరంగా పూర్తిగా అభివృద్ధిచేసి ప్రకృతిలో కనిపించే మార్పులన్నిటికిని ఆ సూత్రాలనే వర్తింప జేయటానికి ప్రయత్నించారు. కాని ప్రకృతిలో కొత్తగా గోచరిస్తున్న కొన్ని మార్పులను (ఎలక్ట్రాన్ల చలనము లాంటివి) వారు తమ గణిత శాస్త్రంలోని సాంప్రదాయక సిద్ధాంతాల ననుసరించి విశదీకరించలేక పోయారు. వెంటనే జరిగిందేమిటి? ఇలాంటి కొత్తగా గోచరించిన మార్పులు శాస్త్రానికిప్రకృతికికూడా అతీతమైనవని ఆదర్శ ఆధ్యాత్మిక వాదాలలోకి దిగిపోయారు.

పైనచెప్పిన లైయల్ సిద్ధాంతంచాలా వరకు సరియైనదే. భూతత్త్వమునకు సంబంధించిన సంఘటనలను నేడు మనకు కనిపించే ప్రకృతిశక్తుల పద్ధతిని అనుసరించే విశదీకరించవచ్చును. కాని రాబోయే సంఘటనలన్నీ నేడు జరుగుతున్న సంఘటన లాంటివిగానే వుంటాయని ఎవరూ చెప్పలేరుగదా?

భూగర్భంలో పరివర్తన పరంపరల వల్ల పర్వతములు పైకిలేచాయి; సముద్రములు ఏర్పడ్డాయి. ప్రస్తుత నైసర్గిక పరిస్థితికి ఈపరివర్తనలే కారణం పరివర్తనపరంపరల మధ్యమధ్య చాలా కాలం భూగర్భం శాంతంగా వుంటుండేది.

హిమాలయ పంక్తులు, ఆల్ప్సు కొండలు, రాకీశిఖరములు, ఆండీసుపర్వతములు-వీటిని పైకి లేవదీసిన భూగర్భ పరివర్తనంయొక్క తుది విసురులో మన భూజీవితం ఈరోజు గడుస్తున్నది. జపాను, ఫిలిప్పైన్సు, జావా మొదలైన ప్రదేశాలలో పర్వత నిర్మాణ కార్యక్రమం ఇంకాసాగుతూనేవుంది.

దీనికిక్రితం హెర్సినియన్ యుగంలో ఒకపరివర్తనం సంభవించింది. అది భూగర్భంలో బొగ్గు ఏర్పడిన వెంటనే

జరిగింది. అపరివర్తన ఫలితంగానే జకోస్లొవేకియాలోనిపర్వతాలు, స్కాట్లండు లోని అగ్నిశిఖరాలు మొదలైనవి పైకి లేచాయి.

ఈ పరివర్తనల మధ్యకాలంలో భూమి ప్రశాంతంగా ఉన్నప్పుడు పర్వత శ్రేణులు అరిగి చట్టురాతి ప్రదేశాలుగా ఏర్పడుతాయి ఈ ప్రాంతాలే ఇంకొక పరివర్తన కాలమందు కొండలుగా పైకి లేస్తాయి.

ఇకమన భూగోళము యొక్క శీతోష్ణ పరిస్థితిని గురించి ఏమిటి ? మన ఈ ప్రస్తుత యుగంలో చల్లదనం భూజీవిత చరిత్రలో సామాన్యంగా వుంటుండే చల్లదనాసికంటే ఎక్కువగా ఉన్నదిఅని చెప్పాలి మనభూమి ఒకహిమయుగం లోనుంచి ఇప్పుడిప్పుడే బయటపడు తున్నది. మళ్ళీ ఇంకో హిమయుగం రావచ్చు

భూమియొక్క నైసర్గిక పరిణామ చరిత్రతో అంటార్టిక్కా, గ్రీన్లండుల లాంటి మంచు ప్రదేశాలు ఏర్పడడం చాలా అరుదు. ఇంగ్లాండుగూడా ఇప్పుడు చలిప్రదేశంగా వున్నప్పటికి, ఇంతకు మునుపు (అంటే ఈ కాల పరిణామా లన్ని లక్షల లెక్కలో వుంటాయని జ్ఞాపకం వుంచుకోవాలి) సాధారణంగా హిపొపాటమస్‌లాంటి ఉష్ణదేశపు మృగా లకుకూడా జీవయోగ్యమైన వేడిగల ప్రదేశంగా వుంటుండేదని చెప్పడానికి నిదర్శనాలు వున్నాయి. గ్రీన్లాండు ఒక ప్పుడు పచ్చని ఓషధులతో నవనవలాడు తుండిన ప్రదేశమే నని శాస్త్రజ్ఞులు తెలుసుకొన్నారు.

ఇలాగే డార్విన్ చెప్పిన చిరకాల క్రమమైన జీవకోటి పరిణామ సిద్ధాంతం కూడా సరియయినదే. ఆ సిద్ధాంతరీత్యా ఒక కొత్త జాతిమృగం జీవశాస్త్రజ్ఞులు గుర్తింపదగిన ప్రత్యేక లక్షణాలతో ఏర్పడడానికి దాదాపు 10 లక్షల సంవ త్సరాలకు పైగా పట్టవచ్చు. ఇంకా గొప్ప మార్పులు రావడానికి ఇంకా ఎంతో ఎక్కువ కాలం పట్టుతుందనే డార్విను సిద్ధాంతం.

ప్రాచీన జీవశాస్త్రజ్ఞుడు (Palaeo-ontologist) - బ్రూము - సరీసృపముల మెట్టునుంచి చతుష్పాదులవరకు ఏలాగు జంతువులు పరిణామం చెందినవనే విష యాన్ని చక్కగా రుజువుచేశాడు. నిజ ముగా చూస్తే కొన్ని ప్రాచీన జీవములు సరీసృపములా, లేక మృగజాతికి చెంది నవా అనేవిషయాన్ని గట్టిగా నిర్ణయించ లేని స్థితిలోవున్నారు అంటే జీవ జాతుల పరిణామం అంత నెమ్మదిగా చిరకాల క్రమంగా జరిగిందన్నమాట ఉదాహరణకు చూడండి: అంతరించి పోయిన జీవజాతుల్లో కొన్నింటియొక్క అస్థి పంజరములను పరీక్షించినప్పుడు అవి సరీసృపజాతికి చెందినవిగా నిర్ణ యించారుగాని, తదుపరి వాటికి పిల్లి మీసాలలాంటి మీసాలుండేవి అని, వాటిలోకొన్నింటికి దేహమంతా వెంట్రు కలుగూడా వుండేవని తెలియవస్తున్నది. సరీసృపత్వము నుండి చతుష్పాదత్వా నికి మార్పుచెందటానికి దాదాపు 5 కోట్ల సంవత్సరాలైనా పట్టివుండాలని శాస్త్ర జ్ఞుల అంచనా.

కాని, జీవములు చేపలుగా నీటిలోనే

జీవించడం మానేసి భూజీవితానికి అనుకూలమైన మార్పు చెందడం మాత్రం చాలా అకస్మాత్తుగా జరిగినట్లు కనిపిస్తుంది. చేపలకున్న రెక్కలు భూమిమీద నడవడానికి కాళ్ళుగా ఏలా పరిణామం చెందాయి అనే విషయాన్ని తెలుసుకొనేటందుకు అవసరమైన శిలా భవాలు (Fossils) కనిపించవు. ఈ మార్పు సముద్రతీరములు ఏ మాత్రం లోతు లేని చదరపు మడుగులుగా వుంటుండిన కాలంలో జరిగివుండాలని చెప్పవచ్చు.

కొన్ని జలగాములు తాము నివసిస్తున్న నీటి వానరులలోని నీరంతా ఎండిపోవడం మూలాన అతి శీఘ్రకాలంలోనే అవసరమైన పరిణామాన్ని పొంది భూజీవితాన్ని అలవాటు చేసికొని వుండాలి. కాని దీనికి ఋజువు ప్రపంచమంతటా ఎంత వెతికినా శిలాభావములు ఏవీ కనిపించలేదు.

ఇలా కనిపించకపోవడానికి కారణం లేకపోలేదు చేపలలో ఈమార్పు రావడానికి దాదాపు 30 కోట్ల సంవత్సరాలు వుండాలి. ఇంత దీర్ఘకాలంలో కొండలు రాళ్ళు చాలావరకు అరిగిపోయాయి. ఎక్కువభాగం సముద్రంలో కరిగిపోయింది.

ఏది ఎలా వున్నప్పటికి కొన్ని గొప్ప మార్పులు మాత్రం చాలా అకస్మాత్తుగానే కలిగివుండాలి అనే విషయానికి కావలసినంత ఋజువు కనిపిస్తున్నది హంగరీ, యుగోస్లావియా దేశాలలోని చెరువులలో జీవిస్తుండిన ఒక రకమైన నత్తలు, తమ నివాసములయిన మంచినీటి వానరులకు కొత్తనీరు రాకపోవడంవల్ల, అవి భూమధ్యభాగంలో వుండిపోవడంవల్ల, వాటిలో నీరంతా వుప్పునీరై అడుసుమయమై పోయినప్పుడు కొన్ని లక్షల సంవత్సరాలలోనే తమ స్వరూపాలలో పూర్తిగా మార్పుజెందాయి అని తెలియవస్తున్నది.

దీనివల్ల తేలేదేమిటి? పరిణామం సత్వరంగాకూడా జరుగవచ్చు ఇది స్పష్టమయింది. జీవ పరిణామంలోని ముఖ్యమైన గొప్ప మార్పులు అన్నీ కాకపోయినా కొన్ని అయినా సత్వరంగా జరిగాయని తెలుసుకొన్నారు. వీటిలో కొన్నిమార్పులు అకస్మాత్తుగా క్షణంలో జరిగినవికూడా వున్నాయి.

వుదాహరణకు—ప్రతిజాతికి సంబంధించిన సెల్లు (జీవఅణువు) లోను, ఆ జాతికి ప్రత్యేకమై క్రోమోజోముల సంఖ్య ఏర్పడివున్నదని శాస్త్రజ్ఞులు ఇటీవల కనిపెట్టారు. ఈక్రోమోజోములను ఆ అణువుల విభాగం జరిగేటప్పుడు సూక్ష్మదర్శినిద్వారా చూడవచ్చు, లెక్కపెట్టవచ్చు. మనుష్యులకుగాని పాశ్చాత్య దేశాలలోని కోతులకుగాని ఈ క్రోమోజోముల సంఖ్య 48. కొన్ని దక్షిణ అమెరికా కోతులకు ఈ సంఖ్య 54.

ఈ క్రోమోజోముల సంఖ్య తరగడంగాని పెరగడంగాని కొద్దికొద్దిమెట్లు వారిగా జరగదు చూడండిమరి, కోతులకు మనుష్యులకు జాతిలో ఇంతమార్పు కలిగినా క్రోమోజోముల సంఖ్య ఇంకా ఒకటే. క్రోమోజోములసంఖ్య తరగడం పెరగడంఅంటే జాతిలో గొప్ప విప్లవకరమైన మార్పురావడం అన్న

మాట. ఈసంఖ్య వేళ్ళసంఖ్య తరగడం పెరగడం మాదిరి జరగదు. క్రోమోజోముల సంఖ్యలో మార్పు ఎప్పుడు జరిగినా అకస్మాత్తుగానే జరుగుతుందనే నిర్ణయానికి రాగలిగారు శాస్త్రజ్ఞులందరు.

కొన్ని జీవజాతులయొక్క క్రోమోజోముల సంఖ్య అన్నింటిలో ఒకే విధంగా లేక వివిధసంఖ్యలు కనిపిస్తున్నాయి. అంటే ఆ జాతి జీవముల క్రోమోజోముల సంఖ్య పరిశోధనచేయటానికి మనకు అవసరమైన పరిజ్ఞానం అవకాశం ఈనాడు జరిగింది. ఈనాడు ఆ జాతిలోని విప్లవకరమైన మార్పు జరుగుతున్నది అనే మనం తెలుసుకోవాలి.

తుదకు ఇంకొక విషయంకూడా చెప్పాలి ఓషధులలో కొత్తమిశ్రమజాతులను సృష్టించవచ్చుననే విషయం దృఢమయింది. కాని చతుష్పాదులలో ఇలాంటి నూతన జాతి సృష్టి మిశ్రమ పద్ధతులవల్ల జరగగలదా అనేవిషయం ఇంకా వివాదాంశంగానేవున్నది. డార్విన్ పరిణామ కాలక్రమాన్ని నిర్ణయించడములో సామాన్యంగా జరిగే పరిణామ వేగాన్ని సరిగానే అంచనావేశాడు గాని, సత్వరంగాను, ఒకొక్కప్పుడు అకస్మాత్తుగాను జరగగల పరివర్తన క్రమాన్ని గురించిన అంచనాలో పొరబాటుపడ్డాడు.

ఈ పొరబాటే జరిగింది దృగ్గణిత శాస్త్రంలోకూడా. నక్షత్రమండలాల పరిణామం సాధారణంగా నెమ్మదిగానే నడుస్తుంది. ఇంతవరకు మన శాస్త్రజ్ఞులు చేయగలిగిన గణనల మూలంగా మనం తెలుసుకొన్న విషయం ఒకటే : మన కాలపరిమాణం (అంటే దినములు, నెలలు, సంవత్సరములు, వీటి పరిమాణం), నక్షత్రములలో జరిగేమార్పు: నిర్ణీతకాలములు, ఇవన్నీ క్రమేపి మార్పుజెందుతున్నాయి అనే విషయాన్ని మాత్రం తెలుసుకొన్నారు. అంతే.

కాని, అప్పుడప్పుడు ప్రళయాంతకమైన సంఘటనలు సంభవిస్తాయి. ప్రత్యేకంగా ఒకనక్షత్రం ప్రేలి పోవచ్చు. ఆప్రేలుడువల్ల కలిగే ప్రకాశం కొన్ని నెలల పర్యంతం వెలుగుతూవుంటుంది. ఒకొకసారి ఇలాంటి ప్రేలుడుమూలాన కొత్తగృహకూటమికూడాఏర్పడుతుంది. ఇలాంటి మార్పులు అకస్మాత్తుగా అరుదుగా సంభవిస్తాయి ఆకస్మిక విప్లవ సంఘటనలకు ప్రపంచంలోను, ప్రకృతిలోను ఇంత ప్రముఖ స్థానంవుంది.

ప్రస్తుతం మానవ జాతియొక్క చరిత్రలోకూడా ఇలాంటి ఆకస్మికవిప్లవ పరిస్థితి ఏర్పడింది కాన ఈ నేటిసంఘటనలకు అనుగుణ్యంగా మన ఆలోచనా పద్ధతులను మార్పుచేసుకోవడం తప్పనిసరిగా అత్యవసరం.

కవీ!

శ్రీ చోరగుడి జాషువ

ఓ కవికోకిలా బ్రతికియున్న సమస్తము దీర్చికొందు నీ
బాకి; భజింతు నీ మృదులపాదము ; కమ్మని కంఠమెత్తి నా
ఆకలిమంటలో గల మహాగ్నికణమ్ములగూర్చి పాడవే
లోకము మారుమ్రోగునటు లోభుల గుండెలు నీరమౌనటుల్.

విహరించితివి ప్రేమలహరీ తరంగాల
రసికశేఖర మనోరంజకముగ
ఆడించితివి విశాలాకాశ కావ్యవీ
ధుల రాజరాజు లంజలిఘటింప
కడిగించినావు రక్తప్లావితాయుధ
ప్రకరమ్ములను శౌర్యరసములోన
కదిలించినావు భక్తశ్రేణి జఘనప్ర
వేశితాత్ముడవై పరేశుకడకు

ఏది చేయగా చేతగాలేదు నీకు ?
జననమందితి దివ్యనక్షత్రమందు
కడుపుచిచ్చున గ్రుంగిపోయెడు జనమ్ము
నరయజాలని హేతు వెయ్యది కవీశ ॥

పచ్చని కూడు-కూర కడుపార భుజించియెరుంగనట్టి నా
వెచ్చని జీవితమ్మును కవీ! ఒకసారి లిఖింపుమోయి ; నీ
ముచ్చెలమ్రోత విన్న నొక ముప్పదిబారల మేరలో మనం
బిచ్చి నమస్కరించి "తొలిగే" ఒక మానవజీవినే కవీ ॥

పరమాణువు చరిత్ర

శ్రీ డి. ఎ. ఎ. ఎస్. నారాయణరావు

1945 వ సంవత్సరంలో పరమాణు బాంబు (ప్రళయబాంబు) ప్రయోగంద్వారా పరమాణువన్నది చాలా ప్రాముఖ్యాన్ని పొందింది. ఈ పరమాణువు మానవ జాతిని తుడిచిపెట్టివేయనీయడానికీ లేక భూతలస్వర్గ మనుభవింప చేయనీయ డానికీ కూడా శక్తికలిగిఉంది. కాని అదృష్టవశాత్తు దానికి మనస్సు, ఇష్టా నిష్టాలులేవు కనుక అది ఏమిచేసేది నిర్ణయించే సామర్థ్యం మానవునిలోనే వుంది. అందువలన మానవుడు దాని సహాయంతో భూతలస్వర్గ మనుభవించ డానికే ప్రయత్నిస్తాడని ఆశిద్దాము. ఇంతటిశక్తి సామర్థ్యాలు కల పరమా ణువు చరిత్ర తెలిసికొనదగినది.

మనచుట్టూఉన్న పదార్థము పరమా ణువులనే చిన్న కణాలచే నిర్మింపబడి ఉంటూందని దరిదాపు రెండున్నరవేల సంవత్సరాలక్రిందటే డెమోక్రిటస్ అను గ్రీకుతత్వజ్ఞుడు ఊహించాడు పాశ్చాత్య తత్వజ్ఞులలో పరమాణువును గురించి ఊహించినవారిలో ఇతడే మొదటివా డనిపిస్తూంది. ఇతనితరువాత ఎపిక్యూ రస్అను నతడు పరమాణువాదాన్ని ప్రోత్సహించాడు. ద్రవాల పరమాణు వులు నున్నగాగుండ్రంగా ఉంటాయని, ఘనపదార్థాల (soli) పరమాణువులు కొక్కెములుకలిగి, జారిపోకుండా ఒక దానికొకటి అతకబడిఉంటాయని ఇతడు ఊహించాడు. లూక్రిటస్ అనే కవి పర మాణువులమీద పద్యాలు వ్రాసాడు. మతప్రచారకులమాట విని ప్రతీది దైవ చిత్తం అనుకోనక్కరలేదనీ, ఎన్నో విషయాలను పరమాణుస్వరూపం గుర్తిస్తే తెలిసికోవచ్చుననీఇతడన్నాడు ఒకతడిబట్టఎండ వేసినపుడు అది ఎందుకు ఆరుతుందంటే, ఆ దారాలమధ్యనున్న గుండ్రని చిన్ననీటి పరమాణువులు తప్పించుకు పారిపోవడంవలన అని ఇతడు బోధపరచాడు. ఇలాగే ఎన్నో విషయాలను పరమాణువుల సహాయ ముతో సమర్ధించాడు. కాని ఈసమర్ధన లను దైవవ్యతిరేక వాదనలుగా పరిగ ణించారు మతప్రచారకులు.

మనహిందూ తత్వజ్ఞులుకూడా పర మాణువుల నూహించినట్లు తెలుస్తూంది బోధిసత్వుడనేజ్ఞాని కోటికోట్ల పరమా ణువులను ఒక వరుసలో ఉంచితే ఒక యోజనం (7 మైళ్ళు) పొడవుంటా యని చెప్పాడు. అంటే పరమాణువు వ్యాసం (diameter) దరిదాపు $\frac{1}{10^9}$ సెం. మీ. అన్నాడు. నిజానికి ఇది ప్రస్తుతం శాస్త్రజ్ఞు లూహిస్తున్న పర మాణువువ్యాసం కొలతలో పదోవంతు ఉంది.

లూక్రిటస్ తరువాత పరమాణువుల గురించిన అభిప్రాయాలు వెనుకకు త్రొక్కివేయబడ్డాయి. మళ్ళా 16, 17 వ

శతాబ్దాలలో ఈ అభిప్రాయాలు తల ఎత్తాయి. కానివీరందరూపరమాణువును గురించిచెప్పినదానికిశాస్త్రాధారములులేవు వారివూహాశక్తివల్లనేచెప్పారు. శాస్త్రీయ పునాదులపైన, బహువిధాలైనసాక్ష్యము లతోద్రవ్యంయొక్క పరమాణుతత్వాన్ని స్థాపించి, కంటితో చూడకపోయినా, చూసినట్లుగా శాస్త్రజ్ఞులందరు పరమా ణువు బరువు పరిమాణములను చెప్పే టట్లు చేయగలిగినవాడు జాన్ డాల్టను.

జాన్ డాల్టను 1766 వ సంవత్స రంలో ఇంగ్లండు దేశపు ఒకపల్లెటూరిలో జన్మించాడు. అతడు ఒక బీదకుటుం బానికి చెందినవాడు. అందువలన కొద్ది చదువుతో, ముక్కుపచ్చలారక ముందే పదమూడవ ఏటనే తనగ్రామంలో ఉపా ధ్యాయుడుగా ఉద్యోగంలో చేరవలసి వచ్చింది ఆజన్మాంతం ఉపాధ్యాయుడు గానే వేరువేరు పాఠశాలలలో పని చేశాడు. యూనివర్సిటీ విద్యకు అవకాశం లేకుండా చిన్నతనంలోనే ఉద్యోగంలో చేరవలసివచ్చినా, అతనికి తీవ్రమైన జ్ఞానకాంక్ష ఉండేది జీవిత మంతా బ్రహ్మచారిగానే ఉండిపోయి, ఐహికవాంఛలు లేకుండా, తన కొద్ది జీతంతోనే తృప్తివంతమయిన జీవితం గడుపుతూ జ్ఞానార్జనకు పాటుబడ్డాడు పరిశోధనలద్వారా ఇతనికి విశేషమైన ఖ్యాతివచ్చాకకూడా ఇతనిని పెద్ద ఉద్యో గానికి ఆహ్వానించినవారు లేరు. ఇతడు ప్రయత్నించనూలేదు. భౌతికజీవనంలో సౌఖ్య ప్రాముఖ్యత కొరకుగాక, తత్వ దృష్టితో, జ్ఞానకాంక్షతో, సత్యాన్వేషణ చేసిన కొద్దిమంది మహాపురుషులలో డాల్టను ఒకడని చెప్పవచ్చును.

మనలో ప్రస్తుత మింత కుతూహ లాన్ని కలిగిస్తున్న పరమాణువును మొట్టమొదట గుర్తించి, విజ్ఞానశాస్త్రం లోనికి తీసికొనివచ్చినవాడు ఈ డాల్టనే. రసాయనిక శాస్త్రంలోని పరిశోధనలను ఆమూలాగ్రంగా తెలిసికొని, వాటిని జాగ్రత్తగా పరిశీలించాడు. రసాయనిక మార్పులు జరిగేటప్పుడు వేరు వేరు పదార్థాలు ఏ బరువులలో కలుస్తాయి అనే విషయంమీద ప్రయోగాలద్వారా కొన్ని సూత్రాలు స్థాపించబడ్డాయి. ఆ సూత్రాలను సిద్ధాంతపూర్వకంగా సమ ర్థించడానికి చేసిన ప్రయత్నంలో ఇతడు 1808 లో పరమాణు సిద్ధాంతాన్ని స్థాపించాడు

ఒకపదార్థాన్ని విభజిస్తూపోతే వచ్చిన చిన్న భాగాలకు ఆ పదార్థం తాలూకు గుణాలులేక ధర్మాలు ఉంటాయని అంద రికీ తెలిసినదే. ఉదాహరణకి నీటిలో ఒక చుక్కను తీసికొన్నా దానికి నీటి ధర్మాలు ఉన్నాయి. ఆ చుక్కలో మళ్లా యింకా చిన్నభాగాన్ని తీసికొన్నా దానికీ ఆ ధర్మాలు ఉంటాయి. అలాగా పదా ర్థాన్ని ఎంత చిన్న భాగాలుగా విభజిస్తూ పోయినా ఆ చిన్నభాగాలకు ఆ ధర్మాలు ఉంటూనేవుంటాయి కాని ఇలా పదా ర్థాన్ని యెంతవరకు విభజించగలము అంటే దానికో హద్దువుంది పదార్థ మును విభజిస్తూపోతే చివరకు అతి చిన్న కణం వస్తుంది ఇక దానిని విభ జించడం అసాధ్యం. ఆ అవిభాజ్యమైన కణాలకే పరమాణువులని పేరు. అంటే పదార్థం మనకు పైకగపడేటట్లు ఏకాం

డిగా ఉండదు. చిన్న కణాల ప్రోగు అన్నమాట. ఒక్కొక్క పదార్థానికి చెంది, దానితాలూకు పరమాణువులుంటాయి. ఒక పదార్థం తాలూకు పరమాణువు లన్నీ ఒకేలాగుంటాయి కాని వేరు వేరు పదార్థాల తాలూకు పరమాణువులు వేరు వేరుగా వుంటాయి.

మనచుట్టూఉన్న పదార్థాలలో మూల పదార్థాలన్నవి, సంయోగ పదార్థాలన్నవి ఉన్నాయి. మూలపదార్థాలన్నవి ఏవిధంగానూ రెండు భిన్న పదార్థాలలోకి విభజింపబడలేవు. ఇనుము, బంగారం, పాదరసము, ఉదజని మొదలైనవి మూలపదార్థాలు. సంయోగ పదార్థాలన్నవి రెండు లేక అంతకంటె ఎక్కువ మూలపదార్థాల కలయికవలన వచ్చినవి. ఉదాహరణకి నీరు ఉందంటే అది ఉదజని, ప్రాణవాయువు అనే రెండు వాయువుల సంయోగంవలన వచ్చింది. అలాగే మనం రోజూ వాడుకునే ఉప్పు, సోడియము- క్లోరిను అను రెండు మూల పదార్థాల కలయికవలన వచ్చింది. మూలపదార్థాలు కలిసి సంయోగ పదార్థాల నిస్తున్నాయంటే మూల పదార్థాలపరమాణువులు జట్లుగా కలిసి, సంయోగపదార్థాలపరమాణువుల నిస్తున్నాయనిడాల్టను అన్నాడు. రసాయనిక మార్పులు జరిగేటప్పుడు పరమాణువులు మాయమవలేవనీ, నశింపవనీ, కొత్తగా సృజింపబడవనీ, కొత్త రకాలుగా జట్లు కడతాయని అన్నాడు.

డాల్టను సంయోగ పదార్థాల అతిస్వల్ప కణాలనుకూడా పరమాణువులనే అన్నాడు. వాటినీ, మూలపదార్థాల తాలూకు కణాలనీ కూడా పరమాణువులే అనడంలో కొన్ని చిక్కులు వచ్చాయి. 1811 లో ఇటాలియను శాస్త్రజ్ఞుడు ఏవగడ్రో ఈ సమస్యను చక్కగా పరిష్కరించాడు సంయోగ పదార్థాల తాలూకు అతిస్వల్ప కణాలకు అణువులు (Molecules) అని పేరు పెట్టాడు. ఈ సంయోగ ద్రవ్యం అణువులలో దాని తాలూకు మూలపదార్థాల పరమాణువులుంటాయన్నమాట, అంతేగాక వాయువులు మొదలైన కొన్ని మూలపదార్థాలలోనే రెండుగాని ఒక్కొక్కప్పుడు అంతకు ఎక్కువకాని పరమాణువులు ఎప్పుడూ జట్లుగా ఉంటాయనీ, భౌతిక మార్గాలవలన ఆ జట్లను విడదీయడం కష్టమనీ తెలిసింది. ఆ జట్లనుకూడా అణువులన్నాడు. ఉదాహరణకి ఉదజని వాయువులో ఎప్పుడూ రెండేసి పరమాణువులు కలిసి జట్లుగా ఉంటాయి. అందుచేత ఆ రెండు పరమాణువుల జతను ఉదజని అణువు అంటారు

అణువులను భౌతిక మార్గాల్లో సాధారణంగా విడదియ్యలేముగాని, రసాయనిక మార్గాలలో విడదియ్య వచ్చును. రసాయనిక మార్పులన్నవి కొన్ని అణువులలోని జట్లు విడిపోయి, కొత్త జట్లు లేక కొత్త అణవులు తయారవడమే. సంయోగ పదార్థాల అణువులన్నీకూడా మూల పదార్థాల పరమాణువుల వలననే కదా వచ్చాయి కనుక సృష్టిలో ఎన్ని రకాల మూలపదార్థాలున్నాయో అన్ని రకాల పరమాణువులు మాత్రమే ఉన్నాయన్నమాట. ప్రస్తుతం 92 మూలపదార్థాలున్నట్లు తెలుస్తూంది. కనుక సృష్టి

అంతా ఈ 92 రకాల పరమాణువుల చేతనే నిర్మింపబడిన దన్నమాట.

ఉదజని పరమాణువు అన్ని పరమాణువులకంటె తేలికైనది దాని బరువును ఒకటిగా తీసికొని, దానితో పోల్చి ఇతర మూలపదార్థాల తాలూకు పరమాణువుల భారాలను నిర్ణయించడానికి మార్గాలు కనుగొనబడ్డాయి. అలాగ మూలపదార్థాల పరమాణు భారాలు (atomic weights)నిర్ణయింపబడ్డాయి. డాల్టను పరమాణు సిద్ధాంత కాలంనుండి 19వ శతాబ్దం చివరిదాకా వేరు వేరు పరమాణువుల బరువులు కనిపెట్టడం, కొత్త మూలపదార్థాలను లేక కొత్త పరమాణువులను కనిపెట్టడంలో ఎంతో మంది శాస్త్రజ్ఞులు కృషిచేసారు 19వ శతాబ్దం చివరలో పరమాణువును గురించి మళ్ళా అద్భుతమైన విశేషాలు తెలిశాయి.

ఒక- గాజుగొట్టంలో బంధింపబడిన వాయువుయొక్క ఒత్తిడిని బాగాతగ్గించి, దానిమీద విద్యుత్తును ప్రయోగిస్తే, కొన్ని కిరణాలు వస్తాయి. వీటికి కేథోడు కిరణాలు అని పేరు. వీటిని క్రూక్స్ శాస్త్రజ్ఞుడు విపులంగా పరిశీలించాడు. మొదటిలో ఈ కిరణాలు విద్యుత్తుతో కూడిన పరమాణువులేనేమో అనుకున్నారు. కాని తరువాత జె. జె. తామ్సను వీటి మీద ఎన్నో పరిశోధనలు చేశాడు అవి కణాలేనని మొదట చూపెట్టాడు, తరువాత వాటి వేగాన్ని బరువుని, వాటి మీదవుండే విద్యుదావేశాన్ని కూడా కనిపెట్ట గలిగాడు. అందుమూలంగా ఆ కిరణాలు అతి వేగంతో కదులుతున్న ఋణవిద్యుదావేశితమయిన కణాలని తెలిసింది. ఒక్కొక్కదాని బరువు ఉదజని పరమాణువు బరువులో సుమారు 1/1800 వంతు ఉంది. కనుక ఇవి పరమాణువులు అవలేవు. అన్నిటికంటె తేలికైన ఉదజని పరమాణువు బరువులోనే ఎంతో చిన్నభాగం వాటి బరువు. వాటినే ఎలక్ట్రాన్లు అంటారు అవి కొత్త రకంకణాలు.

ఈ ఎలక్ట్రానును కనిపెట్టిన జె. జె. తామ్సనుకూడా డాల్టనువలెనే ఇంగ్లీషు శాస్త్రజ్ఞుడు. కేంబ్రిడ్జిలో ఫిజిక్సు ప్రొఫెసరుగా ఉంటూ ఈ పరిశోధనలుచేసాడు. రెండవ ప్రపంచ మహా సంగ్రామం మొదటిలో ఇతడు జీవించే ఉన్నాడు. కాని, తన పరిశోధనల ఫలితంగా వీలయిన పరమాణుబాంబును చూసే అదృష్టము లేకుండా 1940లో మరణించాడు.

పరమాణువులన్నీ ఈ ఎలక్ట్రానులతోనే నిర్మింపబడ్డాయని 1899 నాటికే జె. జె. తామ్సను ఒక అభిప్రాయాన్ని వెలిబుచ్చాడు. సాధారణస్థితిలో పరమాణువు ఇంకేదో ధన విద్యుత్తు మూలంగా మొత్తంమీద విద్యుత్ రహితంగా ఉంటుందనీ, దానినుండి ఎలక్ట్రాను విడినపుడు ధనవిద్యుద్యుతంగా అగపడుతుందనీ అన్నాడు. పరమాణువులోని ధనవిద్యుత్తుకు మూలమేదో అప్పటికి తెలియలేదు. కాని ఆ తరువాత ప్రోటానులన్న కణాలు గుర్తింపబడ్డాయి. తామ్సనే వాటి బరువును విద్యుదావేశాన్ని నిర్ణయించాడు. అవి ధనవిద్యుద్యుతమైన కణాలు ఒక్కొక్క ఎలక్ట్రానుమీద ఎంత ఋణ విద్యుత్తు

ఉందో, ఒక్కొక్క ప్రోటాను మీద అంత ధనవిద్యుత్తు ఉంటుంది కాని ప్రోటానులుమాత్రం బరువైన కణాలు. ఒక్కొక్క ప్రోటాను దరిదాపు ఉదజని పరమాణువంత బరువు కలిగిఉంటుంది. పరమాణువులో ప్రోటానులు ధనవిద్యుత్తును ఎలక్ట్రానులు ఋణవిద్యుత్తును కలిగించి, మొత్తంమీద విద్యుత్‌రహితంగా అగపడచేస్తాయనుకోడానికి వీలు కలిగింది

ఇదేకాలంలో రేడియో యాక్టివిటీ అనే కొత్త దృగ్విషయం బయటపడ్డది. 1896 లో బెకెరెల్ శాస్త్రజ్ఞుడు యురేనియ మన్న పదార్థము శక్తివంతమైన కిరణాలనుఇస్తుందనికని పెట్టాడు. ఆకిరణాలు నల్లకాగితంగుండాకూడా ప్రయాణంచేసి, దగ్గరలోఉన్న ఫోటోగ్రాపు ప్లేటును పాడుచేశాయి. ఇటువంటి కిరణాలను ఇంకేపదార్థా లిస్తాయోనని తీవ్రమైన పరిశోధనలు జరిగాయి మేడమ్ క్యూరీ ఆమెభర్తా కలిసి ఎన్నో కష్టాలకోర్చి థోరియము, పొలోనియం, రేడియము మొదలైన రేడియో యాక్టివిటీచూపే కొత్తపదార్థాలను కొన్నిటిని కనుగొన్నారు. వాళ్ళు తమ ఆరోగ్యానికి లెక్కచేయకుండా కనిపెట్టిన రేడియము ఇప్పుడు కొన్ని ప్రమాదకరమయిన జబ్బులను కుదర్చడానికి ఉపయోగపడుతూ ప్రపంచానికి ఎంతో సహాయకారిగా ఉంది.

రేడియోయాక్టివిటీ పరిశోధనలద్వారా పరమాణువు గురించి చాలా విషయాలు బయటపెట్టిన లార్డు రూధర్‌ఫర్డు కూడా ఇంగ్లీషుశాస్త్రజ్ఞుడే. ఇతడు1871 పారిస్ కమ్యూన్ రోజులలో న్యూజిలాండులో జన్మించాడు. అక్కడే విశ్వవిద్యాలయంలోవిద్యను పొందాడు తరువాత ఇంగ్లండులో పరిశోధనలు సాగించాడు. 1919 నుండి కేంబ్రిడ్జి యూనివర్సిటీలో ప్రొఫెసరుగా పనిచేసాడు 1908 లో ఇతని పరిశోధనలకుగాను ఇతడికి నోబెలు బహుమాన మీయబడింది. ప్రభుత్వ మితనికి ఆర్డర్ ఆఫ్ మెరిటు బిరుదా న్నిచ్చింది. 1925 లో 1931 లో ప్రభువును (Baron) చేసింది. పరమాణు విచ్ఛేదాలగురించి ప్రముఖమైన పరిశోధనలు చేసినవారిలో చాలమంది ఎప్పుడో ఒకప్పుడు ఇతని శిష్యులే

రేడియో యాక్టివు పదార్థా లిచ్చే ప్రసారాలను జాగ్రత్తగా పరిశీలించి, వాటిలో ఎలక్ట్రానులు, ఆల్ఫాకణాలు, గామాకిరణాలు ఉన్నాయని చూపెట్టాడితడు. గామాకిరణాలు ఎక్సుకిరణాలవంటివి కానివాటికంటె ఎక్కువశక్తివంతమైనవి ఆల్ఫాకణాలన్నవి ప్రోటానుకు 4 రెట్లు బరువుంటాయి. ప్రోటానుకు రెండు రెట్లు ధనవిద్యుత్తుతో కూడి ఉంటాయి రూధర్‌ఫర్డు, సాడీ అను శాస్త్రజ్ఞుడు కలిసి రేడియో యాక్టివిటీ మూలంగా ఒక పరమాణువు కొన్ని కణాలను పోగొట్టుకొని ఇంకొక పరమాణువులోనికి మారిపోతూందని చూపెట్టారు. అంటే ఒక పదార్థం తాలూకు పరమాణువులు కొన్ని ప్రతినిమిషం విచ్ఛిన్నమై, ఇంకొకరకం పరమాణువులలోకి మారిపోతున్నాయి. ఇలాగ తమంతట తాము మారిపోయే రేడియో

యాక్టివు పదార్థాలు ప్రకృతిలో కొన్నే ఉన్నాయి.

ఆల్ఫాకణాలను మామూలుగా స్థిరముగా ఉండే వేరువేరు పదార్థాల మీదకు పంపి, అవి ఎలా వెదజల్లబడతాయో రూధర్‌ఫర్డు తన శిష్యుల సహాయంతో పరిశీలించాడు. ఈ పరిశోధనల మూలముగా పరమాణువును గురించి కొన్ని విషయాలు తెలిసికొన గలిగాడు. పరమాణువులో మధ్యభాగం కేంద్రకమనేది ధనవిద్యుద్యుతంగా ఉంటుందనీ, దాని పరిమాణం 10^{12} కి 10^{13} సెం. మీ. మధ్య ఉంటుందనీ తెలిసింది. అసలు పరమాణువు పరిమాణమే 10^{8} సెం. మీ ప్రాంతాల్లో ఉంటుంది. అందులో కేంద్రకం మరీ సూక్ష్మమైన దన్నమాట. అంతేకాక దరిదాపు బరువంతా కేంద్రకంలోనే ఉంటుందని తెలిసింది.

ఇలాగ 1911 ప్రాంతాలనాటికి రూథర్‌ఫర్డు తన పరిశోధనలమూలంగా పరమాణువులో మధ్యభాగాన్ని అతి సూక్ష్మమైనధనవిద్యుద్యుతమైనకేంద్రకం ఉంటుందనీ దానిచుట్టూ దూరాల్లో ఎలక్ట్రానులు ఉంటాయనీ తెలియచేశాడు.

అంతేకాక ఆల్ఫాకణాలను సుస్థిరమనుకొనబడేఇతరపరమాణులవుమీదకు పంపినపుడు అందులో కొన్ని పరమాణువులు విచ్ఛిన్నమయ్యాయి. ప్రోటాను కణాలు బయల్వెడలాయి ఆ సందర్భములో. కనుక కేంద్రకంలో ప్రోటానులుంటాయని అనుకోవచ్చును. కాని దానిలో ఒక్క ప్రోటానులు మాత్రమే ఉంటాయనుకోడానికి వీలులేదు. ఎందుకంటే ప్రోటానులు మాత్రమే ఉంటే, పరిమాణువుకి తగిన బరువు వచ్చేసరికి కేంద్రకం యొక్క ధనవిద్యుత్తు ఉండవలసిన దానికంటె ఎక్కువై పోతుంది. కనుక కేంద్రకంలో ప్రోటానులతో పాటు అంతకంటె తక్కువ సంఖ్యగల కొన్ని ఎలక్ట్రానులు కలిసి ఉంటాయనీ, అటువంటి కేంద్రకం చుట్టూ ఇంకొన్ని ఎలక్ట్రానులుతిరుగుతూ ఉంటాయనీఅనుకునేవారు. ఈ ఎలక్ట్రానులు కొన్ని వలయాలలో సర్దుకొని ఉంటా యని సిద్ధాంతాలు వచ్చాయి ఆ సిద్ధాంతాల మూలంగా రసాయనిక విషయాలను ఎన్నిటినో సమర్థించడానికి వీలయింది.

ఏ పదార్థాన్నైనా విద్యుత్తువల్ల శక్తివంతం చేసినపుడు అది కాంతినిస్తుంది. ఒక్కొక్క పదార్థం తనకు సహజమైన కొన్ని రంగుల కాంతి నిస్తుంది ఒక పదార్థం ఇచ్చే కాంతిని భౌతిక పరికరణాల ద్వారా విశ్లేషించి, అందులో ఏ ఏ రంగులున్నాయో చూడవచ్చును దానిని ఫొటోగ్రాపు తీయవచ్చును. ఆ ఫోటోగ్రాపును వర్ణపటము (Spectrum) అంటారు. ఒక్కొక్క మూలపదార్థం వర్ణపటం ఒక్కొక్క లాగుంటుంది. వేలుముద్రను బట్టి మనిషిని తెలిసికో గలిగినట్లుగా, వర్ణపటాన్ని బట్టి అది ఏ పదార్థం తాలూకుదో చెప్పవచ్చును. ఈ వర్ణపటంలో ఉదజని కొన్ని ప్రత్యేక రంగులు కల కాంతి నెందుకు ఇస్తుందో నీల్సుబోరు తన సిద్ధాంతంలో చెప్పగలిగాడు అందుచేత అతని సిద్ధాంతం చాలా ప్రాముఖ్యత పొందింది. దీని ప్రకారం కేంద్రకం చుట్టూ ఎలక్ట్రానులు కొన్నిమార్గాలలోలేక కక్ష్య

లలో తిరుగుతూ ఉంటాయి. కేంద్రకం నుండి ఈకక్ష్యలు నిర్ణీత దూరాలలో ఉంటాయి. ఎలక్ట్రానులు ఒకకక్ష్యనుండి ఇంకొక కక్ష్యకు గెంతడం మూలంగా శక్తిని (కాంతి రూపంలో)ఇవ్వడమో లేక తీసుకోవడమో జరుగుతుంది. ఒక పరమాణువు కాంతి నివ్వడమన్నది ఎలక్ట్రానులు కక్ష్యలలో గెంతడం ద్వారా జరుగుతూంది. ఈ కక్ష్యలు నిర్ణీత దూరాల్లో ఉండడంనుండి, కొన్నినిర్ణీతమైన శక్తులను అంటే కొన్ని ప్రత్యేక రంగుల కాంతులను మాత్రమే ఇవ్వగలదు ఒక్కొక్క పరమాణువు స్పెక్ట్రాస్కోపీ అనేశాఖను ఎక్కువగా అర్థం చేసికోడానికి ఉపకరించిన సిద్ధాంతాన్ని స్థాపించిన ఈ నీల్సుబోరు డచ్చిశాస్త్రజ్ఞుడు. 1885 లో జన్మించాడు కోపెన్ హేగెనులో డాక్టరేటు డిగ్రీని సంపాదించాక, 1911 వ సంవత్సరంలో జె. జె. థామ్సను వద్ద ఆమరుసటి సంవత్సరం రూథర్ ఫర్డువద్ద పరిశోధనలు చేశాడు. 1916 నుండి కోపెన్ హేగెనులో ప్రొఫెసరుగా ఉన్నాడు. 1922 లో ఇతడిసిద్ధాంతానికిగాను ఇతడికి నోబెలుబహుమానము వచ్చింది. ఈ మధ్య పరమాణు బాంబు నిర్మాణంలో ఇతడు కూడాపాటుపడ్డాడు. యుద్ధకాలంలో జర్మనుల అధికారం క్రిందికి వెళ్ళిగూడా వాళ్ళకన్ను గప్పి డెన్మార్కునుండి తప్పించుకొని, ఇంగ్లీషు అమెరికను శాస్త్రజ్ఞులకు పరమాణు నిర్మాణంలో సహాయం చేశాడు.

కేంద్రకం ప్రోటాను ఎలక్ట్రానులతో నిర్మితమైన దనడంలో ఒక విషయం బయట పడుతుంది. కేంద్రకానికి ఎంత విద్యుదావేశ ముందో తెలుసును. ఆవిదుదావేశ ముండడానికి, కేంద్రకంలోఎన్ని ప్రోటానులు, ఎన్ని ఎలక్ట్రానులు ఉండాలో తెలుస్తుంది. ఒక్కొక్క ప్రోటానుబరువు, ఒక్కొక్క ఎలక్ట్రాను బరువు విడివిడిగా తెలుసును కనుక కేంద్రకంలోని ప్రోటానుల, ఎలక్ట్రానుల బరువులనుకలిపితే, కేంద్రకం బరువుకి సమాన మవాలన్న మాట. కాని అలా అవడంలేదు కేంద్రకం బరువు దానిలోని కణాల మొత్తం బరువుకంటె, కొద్దిగా తక్కువ వుంటుంది. అంటే కేంద్రకం నిర్మాణంలో కొద్దిగా ద్రవ్యం హరించిందన్న మాట. ద్రవ్యం శక్తిగా మారగలదు. ఈ హరించిన ద్రవ్యం శక్తిగా మారిపోయింది. కేంద్రకానికి నిర్మాణ సమయ మప్పుడు హరించి పోయిన శక్తికంటె ఎక్కువ శక్తి ఇస్తే కాని, అందులోని కణాలు వేరవ లేవు. అందుకే కేంద్రక మంత స్థిరంగా ఉంటుంది దానిని బ్రద్దలు గొట్టాలంటే చాలా ఎక్కువ శక్తినుపయోగించాలి.

1932 లో రూథర్ ఫర్డు శిష్యుడు ఛాడ్విక్ న్యూట్రాన్ కణం అనేదానిని కనుగొన్నాడు. ఈ న్యూట్రాను కణం ప్రోటా నంతబరువు కలిగి ఉంటుంది. కానిదానికి విద్యుదావేశం ఏమీఉండదు. దీనిరాకతో కేంద్రకం నిర్మాణాన్ని సుళువుగా ఊహించు కోడానికి వీలయింది. కేంద్రకంలో ప్రోటానులు, ఎలక్ట్రానులకు బదులు ప్రోటానులు, న్యూట్రానులు ఉంటాయనుకోవడం ఎక్కువ సమంజసంగా ఉంది. ధనవిద్యుదావేశం కావలసినంత ఇవ్వడానికి ప్రోటానులు

ఉపయోగిస్తాయి. ఆపైన బరువుసరిపడే టట్లు న్యూట్రానులు ఉంటాయి. ఇటు వంటి కేంద్రకంచుట్టు ఎలక్ట్రానులు నిర్ణీత మైన కక్ష్యలలో తిరుగుతూ ఉంటాయి. ఒక్క పరమాణువులో ఎంతో సృష్టివై చిత్ర్య ముంది. సౌర మండలంలో సూర్యుని చుట్టూ గ్రహాలవలెనే, కేంద్ర కంచుట్టూ ఎలక్ట్రానులు సదాతిరుగుతూ ఉంటాయి గ్రహాలు ఒకకక్ష్యలో నుండి ఇంకొక కక్ష్యలోనికి గెంతలేవు కాని ఎలక్ట్రానులు అలాగెంతుతూ ఉంటాయి కూడా.

రూధర్‌ఫర్డు తనశిష్యులతో కలిసిఇతర ఆలాకణాలతోస్థిరపరమాణువులనుఛేదిం చాడనిఇదివరకుచూశాం. తరువాతఅనేక రకాలైన కణాలతో అలా ఇతర పరమా ణువులను ఛేదించారు అంటే ఒకమూల పదార్థాన్ని ఇంకో మూలపదార్థంలోనికి మార్చారు. ఈపనికి రేడియో యాక్టివు పదార్థాలిచ్చే శక్తివంతమయిన కణాలు ఉపయోగించారు, లేక ఇతరవిధాల వచ్చిన ఎలక్ట్రానులను విద్యుత్ప్రయోగం మూలంగా అతిశక్తివంతంచేసి వాటిని ఉపయోగించారు న్యూట్రానుకణం పర మాణువులను ఛేదించడంలో అన్నిటి కంటె ఎక్కువ చాకచక్యంకలది. దీని మీదవిద్యుదావేశంలేదు. కనుక కేంద్రకం దీనిని వెనుకకుత్రోసివేయ ప్రయత్నిం చదు ఇది కేంద్రకంవైపు వెళ్ళడం తటస్థిస్తే, దానిలోనికి జొరబడిపోయి, దానిని విచ్ఛిన్నం చేస్తుంది.

సాధారణంగా ఒక పరమాణువును ఇతరకణాలతో ఢీకొన్నప్పుడు, ఆపర మాణువు కొద్దికణాలనిచ్చి, ఇంకొక పరమాణువులోనికి మారుతుంది. అలా మారడంలో అది కొద్ది బరువునే పోగొట్టుకొంటుంది కాని 1939 లో ఆటోహాన్, స్ట్రాస్‌మాన్ అను వారలు ఇంకొకరకం విచ్ఛేదాన్ని చూపెట్టారు. పరమాణువు కొద్దికణాలను పోగొట్టు కోవడం కాక, దరిదాపు మధ్యకు బ్రద్దలై పోతుంది ఇలాగ కేంద్రకం దరిదాపు మధ్యగా రెండు పెద్దముక్కలక్రింద బ్రద్దలై పోవడాన్ని న్యూక్లియార్‌ఫిషన్ (nuclear fission) అంటారు. ఈ పరిశోధనకుగాను ఆటోహాన్‌కు 1944 లో రసాయనికశాస్త్రంలో నోబెలుబహు మానం ఇచ్చారు ఇతడు 1879 లో జర్మనీలో జన్మించాడు. అక్కడ కొంత శాస్త్రకృషిచేసాక, 1905 లో రూధర్ ఫర్డువద్ద కొన్నాళ్ళు పరిశోధనలుచేశాడు. తరువాత బెర్లినులోని కైజరు విల్ హెల్మ్ ఇన్‌స్టిట్యూటుకి వెళ్ళిపోయాడు. అక్కడే 'న్యూక్లియారు ఫిషన్'కని పెట్టేడు

పరమాణువు లన్నిటిలోకి బరువైనది యురేనియంపరమాణువు. దీనిని న్యూట్రానుఢీ కొన్నప్పుడు, ఇది ఇలాగ బ్రద్దలై క్సెనాను, స్ట్రాంషియము అన్న పరమాణువుల నిస్తుంది. ఈ సంద ర్భంలో కొన్ని న్యూట్రానుకణాలుకూడా వెలువడుతాయి. యురేనియమును న్యూట్రానులతో ఢీకొన్నప్పుడు వచ్చే పదార్థాలేమిటని హాన్ రసాయనికమా ర్గాలవలన అతినిపుణతతో కనిపెట్టాడు. ఆఫలితాలుచూసి లీసామైట్నర్, ఫ్రిష్ అను శాస్త్రజ్ఞులు వెంటనే యురేనియం పరమాణువు రెండు పెద్దభాగాలక్రింద

బ్రద్దలయినదన్నమాట అని సిద్ధాంత పూర్వంగా తేల్చారు. ఈవిషయానికి ఫిషన్ అని వాళ్ళే పేరుపెట్టారు. లీసా మైట్నరు అన్నఆమె జర్మనీదేశపు స్త్రీ శాస్త్రజ్ఞులలో అగ్రగణ్యురాలు. ఆమె అదివరకు హాన్‌తోకలసి పరిశోధనలు చేసి, రేడియో యాక్టివిటీచూపే కొత్త పదార్థాన్నొకదానిని కనిపెట్టింది. కాని రాజకీయకారణాలవలన ఈమె జర్మనీని వదలి స్వీడనుకు వెళ్ళిపోవలసివచ్చింది. అక్కడినుండే ఈమె ఫిషనుగురించి పరిశోధనలు చేసింది.

హాన్ 'న్యూక్లియార్ ఫిషను'ను కని పెట్టగానే, వివిధదేశాలలో ఇతర శాస్త్రజ్ఞులు ప్రయోగాలుచేసి, హాన్ పరిశోధనలను బలపరచారు. అంతేకాకుండా, థోరియము పరమాణువునుకూడాఎక్కువ శక్తివంతములైన న్యూట్రానులవలన ఇలా దరిదాపుమధ్యగాచీల్చవచ్చునని తెలిసింది. కొద్దికాలంలోనే నీల్సుబోరు ఈఫిషను ఎలా జరుగుతుందో సిద్ధాంత పూర్వకంగా వివరించాడు. యురేనియంలో రెండురకాలున్నాయి ఒకటి తేలికరకం, ఇంకొకటిబరువురకం. తేలికరకం చాలా తక్కువగాఉంటుంది కాని తేలికరకమే న్యూట్రానులవలన సులువుగా బ్రద్దలవగలదు యురేనియముపైకి న్యూట్రానులను పంపినపుడు, ఈతేలికరకమే బ్రద్దలౌతున్నాయని నీల్సుబోరు ఉద్దేశం.

పరమాణువు ఇలా బ్రద్దలవడంలో జరిగే ఒక ముఖ్య విషయాన్ని గుర్తించాలి. అదివరకు పరమాణువు విచ్ఛేదింపబడి, కొద్ది కణాలను మాత్రమే పోగొట్టుకొనినపుడు కొద్దిగా శక్తికూడా బయటపడేది. పరమాణువు మార్పులు పొందుతున్నపుడు కొద్దిగా ద్రవ్యం హరించిపోతుంది. అలా హరించి పోయిన ద్రవ్యమే శక్తిగా మారుతుంది. ఫిషనులో ఎక్కువ ద్రవ్యం హరించి పోతుంది. అందుచేత చాలా ఎక్కువ శక్తి బయటపడుతూంది. యురేనియం ఫిషనులో $\frac{1}{1000}$ వంతు ద్రవ్యం హరించి పోతుందని లెక్కల వలన తేలింది. ఇంత పెద్దభాగం ఇదివర కెప్పుడూ హరించిపోలేదు. అందుచేత ఇలా వచ్చే శక్తిని ఉపయోగంలోకి తేవచ్చుననే ఆశ కలిగింది ప్రపంచమంతటా.


యురేనియముఫిషనులో ఇంకో విషయంకూడా గుర్తింపదగ్గది. యురేనియమును న్యూట్రానులతో ఢీకొన్నపుడు ఆపరమాణువులు బ్రద్దలవడమేకాకుండా, మళ్ళా న్యూట్రానులను కూడా ఇస్తాయి. ఆ న్యూట్రానులుఇంకాకొన్ని పరమాణువులను ఛేదిస్తాయి ఇలాగ ఈ మార్పు తీసికొన్న యురేనియము అంతటికీ త్వరలో వ్యాపించి, అన్ని పరమాణువులను త్వరలో ఛేదిస్తుంది. కాని విచ్ఛేదం ఇలా అన్ని పరమాణువులకీ వ్యాపించడం కొన్ని ప్రత్యేక పరిస్థితులలోనే జరుగుతుంది ఇది ఎప్పుడిలా వ్యాపిస్తుందన్నదానికి ఎన్నో లెక్కలుకట్టాలి. ఒక హద్దుకుపైగా యురేనియమును తీసికోవాలి.


అనేకమంది పెద్ద శాస్త్రజ్ఞులు కలిసి ఈ విషయమై అమెరికాలో పనిచేసి, 1945 నాటికి ఇలా న్యూక్లియారు ఫిషనులో వచ్చే శక్తిని బాంబురూపంలో

తేగలిగారు. దానిఫలితమే హిరోషిమా, నాగసికా పట్టణాల ధ్వంసమూ, యుద్ధం సమాప్తమూనూ


పరమాణువును గూర్చిన జ్ఞానము ఇలా వృద్ధి అయి, మొదట విధ్వంసనానికి ఉపయోగపడింది. కాని త్వరలోనే అది మానవ శ్రేయస్సుకై ఉపయోగపడుతుందని ఆశిద్దాము బాంబులో ఉపయోగపడిన యురేనియము తేలికరకం దొరకడం చాలా కష్టం. అదికాక సుళువుగా దొరికే ఇంకే పదార్థములోనైనా పరమాణువులు సుళువుగా ఫిషను అయేటట్లయితే, పరమాణుశక్తిని సంపాదించడం సుళువవుతుంది. అంతేకాక, యురేనియం పిషనులో $\frac{1}{1000}$ వంతు ద్రవ్యంమాత్రమే శక్తిగా మారుతుంది. అంతకంటె ఎక్కువభాగం ద్రవ్యం శక్తిగా మారడానికి వీలయినట్లయితే శక్తి ఇంకా ఎక్కువగా సుళువుగా వస్తుంది పీటినిగురించిన పరిశోధనలు ప్రతి దేశంలోను తీవ్రంగా జరుగుతున్నాయి.

ఈ పరమాణుశక్తి వ్యక్తుల లాభాలకొరకూ, కొన్ని ప్రత్యేక దేశాల అధికార లాభాలకొరకూ, ఉపయోగింపబడకుండా మానవసంఘం కట్టుదిట్టం చేయగలిగినట్లయితే ఇది మానవునికి ఎంతో ఉపయోగకరమై, భూతల స్వర్గాన్ని సృష్టించగల దనుకోవడంలో సంకోచమక్కరలేదు





నీటిఅణువు




ఉప్పుఅణువు

"మనచుట్టూఉన్న పదార్థాలలో" (చూ. పేజీ 37)


మధ్యనున్న నల్ల చుక్క కేంద్రకం అందులో ప్రోటానులు న్యూట్రానులు ఉంటాయి. చుట్టూ వలయాలలో ఎలక్ట్రానులు గిరగిరా తిరుగుతూ ఉంటాయి

(చూ. పేజీ 40 "ఏ పదార్థానైనా విద్యుత్తువల్ల శక్తివంతం చేసినపుడు")



రేడియో యాక్టివు పరమాణువు.

(చూ. పే. 39 "ఇదే కాలంలో రేడియో యాక్టివిటీ)



యురేనియం పరమాణువును న్యూట్రాను ఢీకొనగానే, అది రెండు ముక్కలక్రింద బద్దలయి, శక్తివంతమయిన కిరణాలను కణాలను ఇస్తుంది.

(చూ. పే. 42. "సాధారణంగా ఒక పరమాణువు")

పృధ్వీ గీతం

శ్రీ అనిశెట్టి సుబ్బారావు

ఓహోహో ! ఓహో ! పృధ్వీ !
ముద్దరాలి వపుడూ ఎపుడూ
పుణ్యనదీ క్షాళితులము పూజించితిమమ్మా పృధ్వీ !
నీ శీతల జలకరాలు మిన్నుల కభిషేక మిచ్చి
నెమలి పింఛముల మనసులు. నీలికళ్ళ పూలు తెచ్చి
విశ్వోద్ధృతగతిలో పీఠమమర్చి—
వెన్నెల వన్నెల వలువ ధరింపించామే.
పాలగుండెలీ మేమే పండ నవతరించామే !

ఒహ్హో ! నీలో మృత్యువు విషవృక్షం పెరిగి నేడు
ఫలములు మాకా ?
నేటికి నీవా మాతవు ?
రుద్ధజ్వాలలు కక్కే చీకటి గుహ నీ గర్భమో !
అమ్మా పృధ్వీ !
చల్లని నీ గర్భముపై మా అవ్యక్తపు కొన గోళులు
ప్రాకి లిఖించిన వేవో
శాశ్వత శాసనాలో, స్మృతులో
చిలిపి చక్కలిగింతలు విహ్వాలతలు రేపాయో !

పడిలేచే నీ పాపలె రాలిన నక్షత్రాలా,
పక పక నవ్వే పాపలె ఆరిన నక్షత్రాలా,
గర్భవ్యధ కోర్వలేని బాలింతవా ఓ పృధ్వీ !
సుకుమార కుసుమప్రాణుల, మానవులను
కుంపటిలోనే పూడ్చావా ·

పృధ్వీ ! పృధ్వీ !
ఊహ తెగిన ఏ లోకంనుంచో, నవ్వుచు కేరుతు

యుగయుగాలుగా ప్రవహించిన ప్రాణి కిరణమై
వచ్చిన మాకై,
నీ సర్వం బూజరచీకటిగ్రామానై మింగావా!
నీ సర్వం గ్రహాంతరిత నిశ్శబ్దంగా త్రాగావా!

మహా పాపి భూమీ!
బ్రతుకే వధగా బిడ్డలు గతులాగి నశిస్తున్నారే
మానవులే!
జనన మరణ పర్వతాల కనుమలలో పడి
నడిచే నీడలమే,
పెద్దపులుల పంజలెవో, కొండచిలువ నాల్కలెవో
ఊపిరి బిగబట్టి లేచు!
సుళ్ళు తిరుగు విషఝంఝలు గిర గిర గిర
యోజనాల కెత్తినవీ,
ఆకలి పొగ లేని మంట ఆవరించి మిన్నంటును!
పడగ విసురు మూగమంట నాల్కల కత్తులై
ఝళితములై లేప్రాణుల గళములు ముట్టినవో!

ఓహో! ప్రాక్పశ్చిమ దిగ్భాగాలే
కాలిన గ్రంథపు పుటలో—
ప్రాణి ప్రాణి కమలిన నల్లని మసిలో
అణువులుగా విడిపోయిన పదమో!
జీసస్ గోరీ కప్పిన రాయై పడినదొహో చీకటి!
గోరీ లోపలి వెచ్చని ఆవిరులై, ఘాటౌ వాసనలై
ఎగయలేని జ్ఞానుల జాగృతి!
కాలవస్తుపరిణామాలేకమైన విశ్వగతిలో
ధగద్ధగితమై వెల్గిన కాలిబూడిదై రాలిన
తోకచుక్క లాదర్శాలో!
చేతులు విప్పి నటించే చీకటి తొడపై
కాలిన హింసాచక్రపు టిరుసు అరుణ బింబమో!

* * *

ఊహా తెగిన ఏ లోకంనుంచో
ఉవ్విళ్ళూరుతు వచ్చానే!
నీలిగుడారం కింద క్షణాలు
మధురోహ లనుచు వచ్చానే!

తెరిచిన భూవదనపు పెదవులలో దిగిపోయే
నే నహ్హో! మానవుణ్ణి!
కాలికింద అహ్హో!
నోరు తెరిచి మృత్యువు కోరలు
పంజ తెరిచి మృత్యువు గోళ్లూ.
పడగలూది మృత్యువు కోరలు
పడగలెత్తి మృత్యువు బుసలూ.
పట్టి గుంజి
పృథ్వీగర్భపుటడవుల చీకటిలోకో,
లోలోపలి సంద్రపు టట్టడుగులలో,

నేనే! నేనే! మానవుణ్ణి!
మరిచితినో స్మృతిప్రవాహమున గెడవేసిన బాటలు,
పసుపు తెలుపు లోహాలకు పేరాశలు లేనివాణ్ణి
మానవుణ్ణి!

మినుకు మినుకు అంగారకులో విప్పిన
మానవనేత్రం
తెలుపు నీలి తళుకు లింకి
రుధిరార్ణవ దీప్తి పొంగు!
నా మానవ హృదయగోళమున కాంక్షాజ్వాల లేచు!
పృథ్వినోట పడిపోయే నాలో
నరాలలో భయోద్ధృతాలవేలో?
జీవం విహ్వలించి దహించేనో!
కన్నెత్తవొ కరుణాలవాలు గోళాలు!
మిన్నెత్తదొ నే నద్దిన రక్తపతాక!

ఆరిన కొడిగట్టిన. దీపశిఖల చేతులెత్తి
ఎత్తి ఊపి పిలిచానో,
దిగి దిగి పోతూ వాణికి తెగే ప్రేవులు,
ప్రేవుల చివరలు కనబడవో!
నా కేకలు ప్రాణశక్తులు జ్వలించు
గోళాలకు వినబడవో!
వేవుల కొనగోళుల తళుకులె
పిలువ వహో!
నా కేకలు కంపించిన బ్రహ్మాండపు
హా హా ఘోషలొ మునిగినవో!

ఇదికాదా ఫక్కున బ్రద్దలైన శంఖం
కడుపు వెడలి
విస్మృతిలో రోదించే నాదమూర్తి!
ఇదికాదా స్వచ్ఛందుని తలలో జనించి
లయచెడి
రూపు నశించే సత్యశక్తి!
ఓహోహో! ఓహో! పృధ్వీ
తెల్లని చల్లని సూర్యుడు కాలిడు
ఇల్లా ఇధి?

* * *

నౌఖలి, తిప్పేరా. పాట్నాలలో దగ్ధమైన
అమాయకులకు, అనామకులకు అంకితము

భాష - పుట్టుపూర్వోత్తరాలు

శ్రీ పి. వి. శివయ్య

భాష, విజ్ఞానం, సాంప్రదాయం, నీతి, న్యాయం, రాజకీయ విధానం మొదలైన సంస్కృతీ రూపాలన్నీ సమాజాన్ని ఉత్తమ వ్యవస్థగా నిర్మించడాని కుపయోగించే సాధనాలు. వీటన్నిటిలో భాషముఖ్యమైనది. సమాజంతో, సమాజాభివృద్ధితో పెనవేసుకుపోయిన సంస్కృతి చరిత్ర అంతా భాషద్వారా శాశ్వత రూపాన్నిపొందింది. ఒకవ్యక్తి నుంచి ఒక వ్యక్తికీ, ఒకతరంనుంచి మరోతరానికిఅందించబడుతూవచ్చింది. నేటి సమాజచరిత్ర మనముందు తరాల వారికి భాషద్వారానే తెలియాలి. మరో మార్గంలేదు భాష మాట్లాడబడుతుంది. అక్షర రూపంలో వ్రాయబడుతుంది

భాష మానవ సమాజంయొక్క సంస్కృతీ రూపాల్లో ముఖ్యమైనదే గాక, మొట్టమొదటిదిగూడా. మానవుడు అడవుల్లో మృగప్రాయుడై తిరుగాడే దశలోనుంచిమారి, మానవత్వాన్ని పొందే మొదటి రోజుల్లో భాషపుట్టింది మానవుడు జీవించేందుకు సాగించే కృషితో, పడేపాటుతో భాషపుట్టింది కృషి కేకలతో భాషప్రారంభించింది. మనుష్యుడేదైనా శరీర కష్టం చేసేప్పుడు, దాని ప్రభావం అతని గొంతుక, శ్వాసకోశం మీద అవుపడుతుంది. అతడు పడే కష్టాన్ననుసరించి ఉచ్ఛ్వాస నిశ్వాసాలు త్వరగా ఆడటంగాని, బిగబట్టబడటం గాని, లేక దీర్ఘాలు గావటంగాని జరుగుతుంది. అలాగే అప్రయత్నంగా అతని గొంతుకలోంచి, ఒకరకమైన ధ్వని లేక అరుపు వస్తుంది కట్టెలు కొట్టేవాడు, "ఊఁహూ"లాంటి ధ్వనిని ప్రతివేటుకు చేస్తాడు బట్టలుతికే చాకలి ప్రతివేటుకు ఒక రకంగా అరుస్తాడు. కృషి ఎక్కువ అభివృద్ధి అయిన దశలో చూస్తే, సమిష్టిగా పదిమంది బరువులు నెట్టటం, రాళ్ళుకొట్టటం. సమిష్టిగా యే పనైనా చేయడంలో పాటలుపాడుతారు సోల్జర్లు మార్చిచేసేప్పుడు బ్యాండు వాయించడం, పాటలుపాడటం జరుగుతుంది. పాటల్లో ఉన్న లయతో లయకలిపి పని చేసేవారి అవయవాలుగూడ కదులుతాయి. పులి గాండ్రుమని ఎరపైకి దూకుతుంది. కుక్క "బౌ"మని ముందుకురుకుతుంది ఇలా పాటుబడేటప్పుడు వేసే కేకలను "కృషికేక" లందాం. ఈ కృషికేకలు జంతువులకూ, జంతుస్థితిని అప్పుడప్పుడే వదిలిపెట్టిన మానవులకూ సహజం. అంతేగాదు ఈ "కృషికేకలు" అప్రయత్నంగా లేక reflex గా వస్తాయి.

మొదట్లో మానవులు గుంపులుగుంపులుగా అడవుల్లో నివసించేవారు పుట్టుకవల్లా, ఒకేస్థలంలో నివసించడంవల్లా, ఒకేరకమైన భౌతిక పరిస్థితుల్లో జీవించడంవల్లా, స్వరూప స్వభావాల్లో ఆనాటి మనుష్యులకు పరస్పరం ఎంతోదగ్గిర

పోలికలుండేవి. కాబట్టి ఒకానొక ఆదిమ తెగలో ఉండేవ్యక్తుల " కృషికేకలు " గూడా పరస్పరం పోలియుండటమూ, యే కేకలు కృషిలో వచ్చాయో, ఆకేకలు ఆకృషిని సూచించే పేర్లుగా మారిపోవడమూన్నూ, సహజము. ఇలా భాషలో మొట్టమొదటి మాటలేర్పడి. మానవుడి కృషి మారి, అభివృద్ధిచెంది క్లిష్టత హెచ్చినకొద్దీ, దీనిపైన ఆధారపడి పుట్టిన ఆ ఆదిమపదాలే, మారి అభివృద్ధి చెంది, వేలసంవత్సరాలు గడిచిన తరువాత అనేక బాసలకు పునాదులైనవి ఈనాటికి, ఈ బాసలు గూడామారి ఆధునిక యుగపు నాగరిక భాషలైనవి. నేడా ఆదిమ పదాలనూ, బాసలనూ వెదకి మానవ సమాజానికి పునాది పురుషులైన ఆదిమ నివాసులు యిలా సంభాషించేవారని, కనిపెట్టి పోల్చడం సుకరంకాకపోయినా, భాషా శాస్త్రజ్ఞులు శ్రమజేసి కొంతవరకు దోవలు తీశారనవచ్చును.

అంటే ఈ ఆదిమపదాలు ఆదిమ మానవుల సమిష్ఠి కృషికి గుర్తులని వారి కృషి విధానానికి నిర్మాణ స్వరూపమివ్వడాని కుపకరించిన గుర్తులనీ చెప్పడానికి సంశయించ పనిలేదు మొట్టమొదలీ గుర్తులు కృషి కేకలుగా, ధ్వని మాత్రాలుగా ఉండి పనివాళ్ళ అవయవాల కదలికను క్రమబద్ధం చేయడానికీ, శక్తివంతం చేయడానికీ అంటే కృషిని నిర్మాణాత్మకంగా దిద్దటానికి ఉపయోగపడ్డాయి. తరువాత దశలో వీటికో కొత్త అర్థం వచ్చింది. ఏ కృషితో యీ ఆదిమ పదాలు పుట్టాయో ఆ కృషి కొరకు రమ్మని సూచించే సమిష్టి కృషి పిలుపులుగా మారినవి. ఇవి నేటి వ్యాకరణ శాస్త్రంలో వచ్చే ధాతువులకు ఆది రూపాలు గావచ్చు. అయితే యివి ఏకమాత్రా ధాతువులు.

ఆలోచనగాని, ఆలోచించి మాట్లాడడం గాని తరవాత వచ్చిన పరిస్థితి· అది మనుష్యుడి మెదడు అభివృద్ధి అయినకొద్దీ ఏర్పడుతూవచ్చిన లక్షణం. ఆటవిక స్థితిలో ఉన్న ఆదిమ మనుష్యుని మెదడు పరిమాణంలో చిన్నది గానూ, కట్టుబడి తీరులో సాఫీగానూ ఉంటుంది. అతని జీవితకృషి పెరిగినకొద్దీ, మారిన కొద్దీ, కృషిలో వివిధరీతులు ప్రవేశించిన కొద్దీ, ఆతడుప్రయోగించే పనిముట్లలో అభివృద్ధీ, మార్పూ వచ్చిన కొలదీ క్లుప్తంగా చెప్పాలంటే మనుష్యుడి భౌతిక జీవిత అనుభవం పెరిగిన కొద్దీ, ఆతని మెదడు పెద్దదై కట్టుబడి తీరులో క్లిష్టత ఏర్పడుతూ 'ఆలోచన' లక్షణం ఏర్పడుతుంది, ప్రకృతిలో సంభవించే సంఘటనల ప్రతి చిత్రాలు -కన్ను, ముక్కు, చెవి, నాలుక, చర్మం- అనే పంచేంద్రియాల ద్వారా మెదడు పైన హత్తుకుని మెదడు పదార్థం కదలుతుంది. ఈ మెదడు కదలికే ఆలోచన.

ప్రకృతిలో సంభవించే సంఘటనలన్నీ సంబంధం కలిగినంతవరకూ మనుష్యుడి అనుభంలోకి వస్తాయి. ఇంచుమించు ఒకేరకమైన అనుభవం కలిగినప్పుడల్లా ఇంచుమించు ఒకేరకమైన కదలిక మెదడుకు కలుగుతుంది. అందులోనూ ముఖ్యంగా మనుష్యుడి చుట్టూ ఉంటూవచ్చే వాతావరణం దాదాపు ఒకేరకపుదైనప్పుడు అలా జరుగుతుంది.

అప్పుడు మనుష్యుడు ఆ అనుభవాలను బట్టి ఒకేరకంగా అనువర్తించుతాడు. అంటే ఒకేరకంగా పనిచేస్తాడు. ఒకే రకమైన కృషి కేకవేస్తాడు బహిః ప్రకోపకాలను సునిశితంగా గ్రహించ లేని ప్రాథమికావస్థలో మెదడున్నప్పుడు శారీరకమైన కదలికగాని, కృషి కేకగాని అప్రయత్నమైనదిగానే, రిఫ్లెక్సుగానే ఉండేవి మెదడు పెరిగినకొద్దీ, అనుభవ మెక్కువైనకొద్దీ బుద్ధి సునిశితమైనకొద్దీ యీరిఫ్లెక్సు కేకలకే ఒకఅర్థం నిశ్చితమై పోతుంది ఇదే ఆలోచన ప్రారంభ మయ్యేదశ. జ్ఞాపకశక్తికి ప్రథమదశ గూడానూ. ఎంతప్రాథమికాలైనామాటలు లేనిది ఆలోచనసాగదు. ఆలోచన అనేది పైకి వినబడనిభాష. అలాంటప్పుడు అంటే "ఆలోచన" భాషవల్ల పుట్టి నప్పుడు, భాష సమాజఉత్పత్తి విధానం వల్ల పుట్టిందిగాబట్టి "ఆలోచన" గూడ సమాజ ఉత్పత్తివిధానంవల్లనే పుట్టింది.

మాటలు సమిష్టి కృషికి పిలుపులుగా ఉపయోగపడ్డవని చూచాం. ఇంతటి తోనే వాటిపని పూర్తిగాలేదు. ముఠాలో కృషి అనుభవాన్ని ఒకరింకొకరికి, పెద్దలనుంచి పిన్నలకూ అందించడం ద్వారా కృషి అనుభవంసంచరించబడ్డది. మాటలద్వారానే కొంతకాలానికి మను ష్యేతర ప్రకృతిలోని వస్తువులకూ సంఘటనలకూగూడా ఈమాటలు పయో గింప బడ్డాయి జంతువులు సహజంగా చేసే పనులకూ ప్రకృతిలోవచ్చే మార్పు లకూ గూడా పేర్లుగలిగాయి. ఈ దశ వచ్చేటప్పటికి మనుష్యుడి జీవనకృషి చాలసులభమైంది.

భాషకూడా ప్రాథమిక ధాతు రూపాల స్థితినుంచి ముందుకు నడిచింది. ఏక మాత్రా పరిణతాలైయున్న ప్రాథమిక ధాతువులు ఒకే అక్షరధ్వనివల్ల జనిం చిన యీప్రాథమిక ధాతువులు, తరవాత పుట్టినపేర్లూ, సంశ్లేషముపొందిక్రమేణా వాక్యరూపాలుగూడా వచ్చినవి. మను ష్యుని భాష యీ స్థితికి రావడానికి యెన్నో యేళ్లు పట్టింది

అటవీ నివాసం, క్రూరమృగ పరిస రాలు, పనిముట్లు అభివృద్ధిగాకపోవటం వల్లా, ముఠాలుగా నివసించడం, వేటా డటం, ఆకులు, కాయలు సేకరించడం, మొదలైన సమిష్టికృషి మనుష్యుడికి తప్పలేదు. సమాజనిర్మాణం గూడా వ్యవస్థా రూపంపొందలేదు. అడవి నుండి అడవికి ముఠాలు తమాం తమాం కదిలేవి. సమిష్టికృషి, సమిష్టి జీవితం గడిపేవి. జీవిత అవసరాలు, పద్ధతులూ మారినకొలదీ ముఠాకు నూతన అను భవం, దాంతోపాటు భాషలో మార్పు వచ్చాయి. జంతువులతో ముష్టాముష్టి పోరాడటం దగ్గరనుంచి కర్ర, రాయిలాంటి వస్తువులను ఆయు ధాలుగా వేట కుపయోగించటం, ఆకు, అలం, పచ్చిమాంసం పీక్కు-తింటం, మొదటి అనుభవ మనుకొంటే రెండో అనుభవం· ఒక ముఠా నివసించే ప్రదే శంలో జంతువులు దొరక్కుండాపోయి నపుడు, మరో అడవిలోకి పోతే అది వరకే అక్కడ నివసించే ముఠాతో యుద్ధం చేయవలసి రావటం. మూడో అనుభవం . ఒకఅడవినుంచి ఒకఅడవికి తిరిగితిరిగి వేటాడుతూన్నకొలదీ జంతు

పులు గూడా తగ్గిపోవటం, ఆత్మరక్షణా జ్ఞానం ఎక్కువై పారిపోవటం, జరిగి ఎక్కువభాగం ఆకులూ, కాయలమీదనే ఆధారపడటం జరుగుతూవచ్చేది. ఒకే చెట్టుకు ఒకమారు ఆకులూ కాయలూ కోసినతరువాత మరల ఆ చెట్టు చిగిర్చి కాయడం, ఎండలకు కాయలూ, పండ్లూ బద్దలై విత్తనాలు నేలపై రాలి కొంత కాలానికి మొలకెత్తడం, ఇలాంటి అనుభవంవల్ల విత్తనాలు భూమిపైనవేస్తే మొలకలెత్తుతాయి, పెరిగి మరల కాస్తాయి. అనేభావం ముఠాలో మనుష్యులకు కలిగింది అంటే మనుష్యుడికి వేటతోపాటు వ్యవసాయం జీవనపద్ధతిగా అమల్లోకి వచ్చిందన్నమాట ఇప్పటికప్పుడే వెంటనే ముఠాకు స్థిర నివాసం కలగలేదు. ఒకమారు పండించి వదలిపెట్టిపోయిన చోటికి తిరిగి తిరిగి అవకాశం వచ్చినప్పుడక్కడ మరల చెట్లు చూడటం తటస్థించి, ఒకేచోట మరల మరల పండించవచ్చనే జ్ఞానం మనిషికి కలిగినప్పుడే ముఠాకు ఒకే ప్రదేశంలో స్థిర నివాసం యేర్పడ్డది ముఠా మనుష్యుల్లో పని పంపకం తెనుగుమీరి ముఠా నిర్మాణం వ్యవస్థా రూపాన్ని పొందటానికి అవకాశం కలిగింది.

ఇప్పటివరకూ మనుష్యుడి జీవిత విధానంలోవచ్చిన మార్పు. అతడు ఉపయోగించే పనిముట్లలో వచ్చినమార్పు, అతినెమ్మదిగా జరిగింది. కొన్నివేల యేళ్ళు పట్టింది మనుష్యుడి జీవితం కేవలం ప్రకృతి సహజ పరిస్థితులపైన ఆధార పడినంత కాలము, మనుష్యుడి బుద్ధి, బలము ప్రకృతి పరిస్థితులను యేకొంత వరకైనా అతిక్రమించే దశ రానంత వరకూ, ప్రకృతి పరిస్థితులలో మార్పునుబట్టి మనుష్యుడి జీవితవిధానం మారుతుంది. ప్రకృతి పరిస్థితుల్లో గమనించగల మార్పు రావాలంటే సుకరం గాదు; వేలయేళ్ళు పడుతుంది అందుకనే మానవుడి ఆటవిక దశగూడా ఎన్నో వేల ఏండ్లు నడచింది. మానవుడు జీవిత విధానంలో ఉపయోగించే పరికరాలలో మార్పు రావడానికి కట్టుబడి, నైపుణ్యం (Technical Skill) అనేది ప్రారంభించడానికిగూడా అంతకాలమూ పట్టింది అందువల్ల ఈ ఆటవిక ముఠాదశలో, వ్యవసాయ జీవిత విధానంగా ఏర్పడే ముందటివరకూ, మనుష్యుడి భాష కూడా అంతగా అభివృద్ధి అయిఉండదు వచ్చిన అభివృద్ధిగూడా అన్నివేల సంవత్సరాలూ పట్టివుంటుంది. కాని ఒక్కటి మట్టుకు మరువగూడదు జీవిత విధానంతోపాటు అభివృద్ధి అవుతున్న భాష ఈ దశలో గూడా, జీవితకృషి అనుభవాన్ని సంతరించి ఒకరి నుంచి మరొకరికి, పెద్దల నుంచి పిన్నలకూ, ఒకతరం నుంచి మరోతరానికి అందించడానికి జీవిత కృషిలో నైపుణ్యం వృద్ధిగావటానికి తోడ్పడది

వేటయే ముఖ్యజీవనాధారంగా వుండటంమానేసి, వ్యవసాయం ముఖ్యవృత్తి, జీవనాధారం అయింతరువాత సమాజ నిర్మాణం అభివృద్ధి అయి ఒకవ్యవస్థగా ఏర్పడ్డది. చిన్నచిన్న ముఠాలన్నీ, సంచారదశను వదలి స్థిరనివాసాలుగా ఏర్పడ్డాయి పనిపంపకంగూడా పూర్వం

మాదిరి స్త్రీపురుషులమధ్య ఆస్తిసంబంధాల వాసనలేనిదిగా ఉండేదికాని, యీ దశ కొచ్చేప్పటికి పూర్తిగా మారిపోయింది. పూర్వం వేట జీవనాధారంగా ఉండే దశలో, ముఠాయుద్ధాల్లో చేజిక్కిన వాళ్ళని గెలిచిన ముఠా చంపేసేది. ఇప్పుడు వ్యవసాయానికి మనుష్యులవసర మయ్యేప్పటికి, ఆ ఖైదీలను చంపక, వారిచేత వ్యవసాయం చేయించేవారు మొదట్లో ఆహార మివ్వకనే పని చేయించుకునే వారు. తరవాత తరవాత వారికి తిండి బెట్టి పని చేయించుకునే వారు వీళ్ళు బానిసలు, వాళ్ళు ప్రభువులు ఇలా సమాజములోకి పూర్వపు కొయ్యలూ, రాళ్ళూ, ఈటెలూ వీటితోపాటు ఒక కొత్తసాధనం బానిస ఏర్పడ్డాడు. దీనిపైన ఆధారపడి మనుష్యుడి జీవిత విధానంలో, జీవితావసర వస్తువుల వుత్పత్తి విధానంలో, కొత్తమెలకువలూ, కొత్త నైపుణ్యమూ ప్రవేశించాయి

ఈ దశలో భాషలో వచ్చిన మార్పు, అమల్లోకి వచ్చిన కొత్త మాటలు అన్నీ ఈ ప్రభు-బానిస సంబంధాలను సూచిస్తాయి. దీనిపై ఆధారపడి సమాజంలో జరిగే నిత్య వ్యవహారాలకు సంకేతాలుగా ఉంటాయి.

మొదట సమిష్టి అధికారంలో ఉన్న భూమి వ్యక్తిగతమై భూస్వాములేర్పడి బానిసలు అస్వతంత్రులై భూస్వామి యొక్క భూమికి కట్టుబడ్డ రైతులుగా మారారు బానిసలు సమాజంలో సభ్యులుగా పరిగణింపబడలేదు వారెన్నడూ ఆ తాహతుకు రావడానికి అధికారం లేదు. బానిసలు తిరగబడి రైతులైన దశలో యీ రైతులు అవసరమైతే స్వతంత్రులు గావటానికి వీలున్నది.

ఈ దశలో ఉత్పత్తి పరికరాలు ఎక్కువ క్లిష్టమై తెనుగు మీరాయి. జీవితావసర ఉత్పత్తి విధానంలో కృషి చేయడానికి ఎక్కువ నైపుణ్యం కావలసి వచ్చింది. అనేక లోహాలు కనిపెట్టబడ్డాయి అనేక పరిశ్రమలు నేత, కమ్మరం, కుమ్మరం, వడ్రంగం మొదలైనవి అమల్లోకి వచ్చాయి ఇవన్నీ చేతిపరిశ్రమలే. ఈ ఉత్పత్తిపరికరాలూ వీటినుపయోగించే తీరూ, వీటిపైన అధికారమూ, అధికారులకూ పనిచేసే వారికీ ఏర్పడ్డ ఉత్పత్తి సంబంధాలూ వాటి ప్రయోగ పరిణామాలూ, వీటన్నిటిని సరిదిద్దటానికి, తీర్చడానికి ముఖ్యముగా అవసరమయిన భాష అభివృద్ధి పొందవలసి ఉన్నది. నిజంగానే యీ యుగంలో భాష యెంతో అభివృద్ధి అయింది. సమాజ జీవితాన్నంతటినీ అన్ని ముఖాలా చిత్రించగల శక్తిని అపారంగా పొందింది మాటలు ఎక్కువవటమే గాకుండా అనేక మాటలు కలిసి ఒకమాటగావటం, కొన్ని మాటలుచీలి ఒకటికన్నా ఎక్కువ మాటలైపోవడం, ఒకే మాటలకు వాడుకలో కొత్త అర్థాలు రావడం జరిగింది. పూర్వమున్న ధాతువులకు, నామవాచకాలకు తోడు, విభక్తులూ, ప్రత్యయాలూ వచ్చి కలసి సమాజ జీవితాన్ని సమాజ నిర్మాణ వ్యవస్థలోని ఉత్పత్తి సంబంధాలను సమగ్రంగా చిత్రించగల ఆయుధంగా భాష తయారయింది.

భాష యిలా అభివృద్ధి పొందటంలో వ్రాత ఎంతో సాయపడ్డది. భూస్వామిక విధానపు మొదటి దశలోనే లేక అంతకు పూర్వమే వ్రాత ఆరంభమైంది వ్రాత అంటే ఈనాడు చూచే పద్ధతి వ్రాత గాదు. మొదట విషయాలను జ్ఞాపకం పెట్టుకోడానికి, తాళ్ళు ముళ్ళు వేసు కానో, లేకపోతే కర్రలపైన రంగు లతో (అంటే వివిధ రకాల ఆకు పస రు మొదలైనవి) గుర్తులు పెట్టు కానో యెలాగో చెప్పదలచు కున్నది ఇతరులకు తెలియజేసేవారు. తరువాత రంగులతో రాళ్ళపైనా, చెట్ల బెరడుల పైనా, ఆకులపైనా, చెప్పదలచుకున్న దాన్ని బొమ్మలు ద్వారా సంకేతించారు. ఇలా చిత్రలిపినుంచి క్రమేణా అంతు లేని క్లిష్టపరిణామాలను పొంది నేటి అనేక లిపులేర్పడ్డాయి

పెట్టుబడిదారీ విధానం వచ్చింతర వాత యంత్ర యుగారంభమైన తరవాత ఉత్పత్తి విధానంలో క్లిష్టత హెచ్చిం చింది. పెట్టుబడిదారుడూ, కార్మికుడూ అని తెగలేర్పడ్డాయి. మనిషికీ మనిషికీ డబ్బు సంబంధమే సంబంధము. కృషికి ఎంతో నైపుణ్యం గావాలి. అది యంత్ర నైపుణ్యం శాస్త్ర నైపుణ్యమూనూ, అనేక యంత్రాలతో, అనేక జీవన విధా లతో అనేక సాంఘిక, రాజకీయ వ్యవస్థారూపాలతో సమాజం క్రిక్కిరిసి పోయింది. భాషగూడా యిలాగే అభి వృద్ధి అయింది.

ఇంతకూ చెప్పదలచిందేమంటే :

1. భాష మానవుడి జీవిత కృషితో ప్రారంభమైంది

2. జీవితకృషి అభివృద్ధి అయిన కొద్దీ, క్లిష్టమైన్నకొద్దీ, అంటే ఉత్పత్తి పరికరాల అభివృద్ధి, టెక్నికల్ అభివృద్ధి అయినకొద్దీ భాష అభివృద్ధి అయింది.

3. భాష పుట్టి అభివృద్ధి అవుతూ మరల ఉత్పత్తి పరికరాల అభివృద్ధికి అవసరమైన ఆయుధంగా తయారైంది.

4. భాషద్వారా నూత్న యంత్రాభి వృద్ధికీ, నూతన వ్యవస్థాభివృద్ధికీ అందు కవసరమైన నూతన సిద్ధాంతాభివృద్ధికీ తోడ్పడ్డది.

5. మానవ సమాజం పుట్టినప్పటి నుంచి యింతవరకూ అందులో వచ్చిన ఆర్థిక, రాజకీయ, సాంఘిక, వైజ్ఞానిక సంస్కారమంతా భాషద్వారానే ప్రచా రమై, భాషద్వారానే ఒక మనిషినుండి ఒక మనిషికి, ఒక తరంనుండి ఒక తరానికి అందించడానికి వీలుగా సంత రించబడ్డది

6. భాష జీవితవిధానంలో ఉత్పత్తి పరికరాలకన్నా ఎక్కువ గాకపోయినా కనీసం అంత ప్రాముఖ్యమయినా సాధనమే ;

తెలుగు నుడికారం - సామెతలు

డాక్టర్. శ్రీ చిలుకూరి నారాయణగావు

తెలుగు ప్రజలు నిత్యం వాడుకునే సజీవమైన భాషను గ్రంధస్థం చేసినవారు శ్రీ గిడుగు రామమూర్తి పంతులుగారు. కవులందరూ తమతమ గ్రంధాలలో వ్యాకరణవిరుద్ధమైన వ్యావహారికభాషను ప్రయోగించారని చెప్పి, సుమారు 1000 గ్రంధాల నుంచి అలాంటి ప్రయోగాలు చూపిఆయన పండితులను ఒప్పించారు కొందరు పండితులు గిడుగు వాదాన్ని పడగొట్టాలని కుటిల ప్రయత్నాలు సాగించారు.

కాని, వ్యావహారిక భాషలో గ్రంధాలు వ్రాయాలనే దృష్టితో తెనాలిలో సాహితీ సమితి బయలు దేరింది. కొత్తనీరు పాతనీటిని కొట్టేస్తుంది అసలుసరస్వతి అంటేనే, ప్రవహించేది అని అర్థం. దేనికయినా అభ్యుదయం, ప్రగతికావాలి గమ్యస్థానాన్ని నిర్ణయించుకోవాలి.

1912 లో బరువా గ్రామంలో ఆంధ్ర గ్రంధాలయోద్యమం ప్రారంభమయింద. ఇది బరోడా నుండి వచ్చింది. తర్వాత బందరు నుంచి జాతీయోద్యమం వ్యాపించింది. వీటన్నిటి ఫలితంగా నవ్య సాహిత్యపరిషత్తు ఏర్పడ్డది.

మనం సాహితీపరులమే అయినప్పటికీ, భౌతిక సమస్యలను గూర్చి కూడా ఆలోచించుకోవాలి. జీవితానికి ఆధారం తిండి ఈ నాడు మన మందరమూ తిండిలేక బాధపడుతున్నాం: ఎవ్వరైనా సరే ఇవాళ తిండిని సాధించడం కోసం కష్టపడడం కర్తవ్యం మన సాహిత్యం కూడా అందుకు తోడ్పడాలి

నేడు ప్రపంచంలో అనేక రాజ్యాలు ఘర్షణ పడుతున్నాయి ఈ ఘర్షణలో మనం నలిగిపోగూడదు. మనల్నిమనం కాపాడుకోవాలంటే నోట్లో మాటవుండాలి. చక్కగా మాట్లాడ నేర్వాలి. మంచి సాహిత్యంకూడా రావాలి. సర్వ మానవులు ఏక కుటుంబంలోనివారనే సత్యం అక్షరరూపం పొందాలి. ఏ కళ అయినా దీనికి తోడ్పడాలి. దీనికోసం కృషిచేయాలి

ఇంతవరకూ సాహిత్యంలో మేము రసలోకాన్ని చూస్తున్నాం, ఆనందం పొందుతున్నాం, దాన్ని మరచిపోగూడదు. కాని ఆనందంకోసం కృషిచేయడం సంకుచితమైన సంఘంలోనే వుండిపోయింది.

కాని, ఈనాడు సంఘం పెరిగిపోయింది. ఈ సంఘానికంతటికీ ఆనందం ఇవ్వవలసిన తరుణంవచ్చింది. దాని కోసమే మనం కృషిచేయాలి.

ఆంధ్రోద్యమంతోపాటు అన్నివుద్యమాలూ వచ్చాయి. నిఘంటువుల్లో తెలుగు శబ్దాలన్నీ పెట్టాలన్నారు. సామెతలు ప్రోగుచెయ్యాలన్నారు. చరిత్రను సమకూర్చాలన్నారు. అనేకులనేకవిధాల కృషిచేశారు.

ఆంధ్రవాఙ్మయ చరిత్రను పూర్తిచేసి, నేను గిడుగు వారికి పంపినప్పుడుఆయన సంతోషానికి మితిలేదు ఆంధ్రవాఙ్మయంలో ఆయన చేసిన కృషిఅపారం ఆంధ్ర భాష ఆంధ్ర జాతి దినదిన ప్రవర్ధమానం కావాలని ఆయన అహర్నిశలు తపస్సుచేశారు. ఆయన వ్రాసిననోట్సును వినియోగించుకోగలిగి, గ్రంథాలు వ్రాస్తే, వందలకొద్దీ ఉత్తమ గ్రంథాలు వస్తాయి 'బాలకవి శరణ్యం' అనే పుస్తకం ఆయన నోట్సునుంచి ప్రకటించిందే కాని, ఇంకా ఇలాంటివెన్నో ఉన్నాయి ఒకనిఘంటువు వ్రాయాలని ఆయన సంకల్పం శబ్దరత్నాకరంలో తెల్లకాగితాలు కుట్టి, కొన్నికొండ గుర్తులతో నోట్సురాసిపెట్టారు ఆగుర్తులన్నీ నాకుతెలుసు కాని, ఇవాళ ఆనిఘంటువు కన్పించడం లేదు

నిఘంటువంటే నుడుల సమూహం ప్రత్యేకంగా పదాలంటూ వుండవు. ఏ పదమైనా ప్రయోగించినప్పుడే, దానికి అర్థం వస్తుంది. నిఘంటువు ఎప్పుడూ ఆ అర్థాన్ని రికార్డు చెయ్యడానికే పనికివస్తుంది. ఒకమాట విడిగా వున్నప్పుడు ఒక అర్థం, రెండోమాటతోకలిసినప్పుడు మరొక అర్థం వస్తాయి మాటలు సమసించాలి. వాక్యంలో ఒదిగిపోవాలి. ఒక అర్థాన్ని తెలియజేసేది వాక్యమంటారు. ప్రతి కావ్యము ఒకవాక్యం. ఈ వాక్యం ఫుల్‌స్టాఫ్‌తో అంతం కాదు. ఇది ఒక పేరా కావచ్చు, పదిపేరాలు కావచ్చు; ఒక పెద్ద గ్రంథం కావచ్చు

ప్రతి భాషలోను పలుకుబడి, నుడికారం వుంటాయి. శబ్దాలకున్న అర్థాలు ఒక్కటే అయినప్పటికీ, నుడికారాన్ని బట్టి వాటి అర్థాలు మారుతాయి.

తుదిసోగ, నడిసోగ, తొల్లింటి సోగ, తుదిత్రుంపు,నడితుంపు,తొల్లింటి త్రుంపు—అని నుడికారం ఆరు రకాలు ఇందులో మళ్ళీ (gradations తరగతులు.

వీటి నన్నిటినీ గమనించి, నన్నయ కూడా తన గ్రంథాల్లో నాటి వ్యవహారిక భాషను ప్రయోగించాడు అంతేగాని, ఆయన వేరే ఎక్కడి నుంచో తెచ్చి భాషను సృష్టించలేదు. ఉన్న మార్పు ఏమైనా వుంటే, అది కూర్పులోనే కాని, వైయాకరణుల రాక్షసత్వంవల్ల, మన భాషకు చాలా ఉపద్రవాలు వచ్చాయి

తెలుగు నుడికారం కార్యత్వసిద్ధి సాధించాలంటే, ఒక ప్రత్యేకమైన టెక్నిక్ వుంది. తెలుగులో ఏరెండు పదాలనైనా ఇష్టంవచ్చినట్లు కలపడానికి వీలులేదు. అక్షరవిన్యాసం సరిపోవాలి. ఇది శబ్దగతమైంది. అర్థగతమైనకూర్పు కూడావున్నది. అన్నీకలసి, ఒక రకమైన సంగీతాన్ని పుట్టిస్తాయి. అందుకే కవిత్వరచన ఒక తపస్సులాంటి దంటారు. అలాంటి కావ్యమే నిలుస్తుంది ఇప్పటికివేలకొలదిగా గ్రంథాలు వచ్చినా, చెప్పుకోడానికి వందపుస్తకాల కంటె లేవు. ఇవి మాత్రమే చిరస్థాయి కాగలిగాయి వీటినే మనం కావ్యాలంటున్నాం ఏ కావ్యాన్నయినా మనకు ప్రయోజనం వున్నంతసేపూ జాగ్రత్తగా కాపాడుకొంటాం ప్రయోజనం లేకపోతే, దాన్ని కన్నెత్తి చూడం నేటి

మన రచనలలో ఏవి చిరస్థాయి అవుతాయో, ఏవి క్షణికాలో మనం నిర్ణయించుకోలేము. మన తరువాత తరం వారు నిర్ణయిస్తారు. ఇవాళటి కృష్ణశాస్త్రి కవిత్వాన్ని రేపు ఉత్తమ సాహిత్యంలో చేర్చుతారు.

ప్రజలు మాట్లాడే భాషయే సాహిత్యానికి పునాది ఈ భాషనే తీసుకొని తగినట్లుగా తనలో ఇముడ్చుకొంటుంది సాహిత్యం.

ఒక్కొక్క దేశంలో ఒక్కొక్క మాట ఒక్కొక్క రకంగా పలుకబడుతుంది. ఇదే నుడికారం. ఈ నుడికారాన్ని మనం గుర్తించాలి.

పరస్పర భావప్రకటనకు ఉపయోగించే సాధనం భాష. శబ్దార్థాలకు అన్యోన్యం ఐక్యత వుండాలి. మన భావాలను, అనుభవాలను తెలియజేయడానికై అర్థవంతమైన శబ్దాలతో కూడిన వాక్యాల నుపయోగిస్తాం ఇది సర్వసామాన్య విషయం. దేనినయినా వర్ణించేటప్పుడు దానికి మన పూర్వానుభవాలతో ఉన్న పోలికలనుగానీ, లేదా భేదాలనుగానీ చెప్పవలసివస్తుంది. ఈ పోలికలూ, భేదాలే అలంకార శాస్త్రానికి మూలం. స్త్రీముఖం చంద్రునివలె వుంటుందనే చోట పోలికవుంది. ఇదే ఉపమాలంకారం ఇలాంటి అలంకారాలు ఇప్పటికి 123 ఉన్నాయి.

అన్ని అలంకారాలకూ ప్రధానమైనది సామ్యత. ఇదే క్రమంగా సామెత అయింది. కాని సామెత 'వలె' అనే పోలికతోమాత్రమే ఆగలేదు "నీ పెళ్ళి ....వలె ఉన్నది" అన్నంతనే సామెత పూర్తి కాలేదు. వెంటనే "నా పెళ్ళికి దివిటీ పట్టు" అని వస్తేనే, అది సామెత. కొన్ని సామెతలు ఒకే వాక్యంలో వుంటాయి. మరికొన్నిటికి రెండేసి దళాలుంటాయి. అవి రెక్కలు కట్టుకొని గాలిలో ఎగురుతూ వుంటాయి పల్లెటూళ్ళలో ఆబాలగోపాలమూ ఈ సామెతలను వాడుతారు.

తెలుగుదేశంలో వున్న సామెతలన్నిటినీ ప్రోగు చేద్దామని నేనూ, మీరు మళ్ళ వాటూ చాలా కృషిచేశాం. అయితే రెండు మూడు పేలకంటే ప్రోగుచెయ్యలేక పోయాం. అందరం కలిసి చేసినట్లయితే ఆ పని ఎప్పుడో పూర్తి అయ్యేది కాని, మనలో కలిసి పని చెయ్యడమే లేదు. అదే మన దురదృష్టం.

సామెతలను ప్రోగు చేయడమనేది చాలా కష్టసాధ్యమైన పని అయినప్పటికీ 1 50,000ల సామెతలు నేను ప్రోగుచేశాను. 2000ల పాటలు ప్రోగుచేశాను

ప్రజా వాఙ్మయానికి ప్రాణం సామెతలు. లోకంలో నిలిచి వున్నదే సామెత. ఈ క్రింద కొన్ని సామెత లిస్తాను.

అ ఆ లు రావు, అగ్రతాంబూలం కావాలి.

అ ఆ లు రావు, అమరం చదువుతాడు.

అకాలంలో నవ్వితే, సకాలంలో ఏడ్వాలి.

అంకిలిలేనికోతి, లంకను కాల్చింది.

అంకుశంలేనిఏనుగు, అదుపులేని ఆడుది.

అక్కవుంటే బావ, బావవుంటే అక్క.

(8)

అక్కమ్మ శ్రాద్ధానికి, అధిక శ్రావణం.
అక్కరకురాని వస్తువులేదు,
పనికిమాలిన మనిషిలేడు.
అత్తరు గలిగిన ఎద్దు ఏనుగతోసమానం,
లేనియెద్దు గాడిదతో సమానం.
సామెతలకు యతిముఖ్యం.
పద్యాలకుకూడా అంతే.

అగ్గికి వాయువు తోడు,
అయ్యకు అమ్మతోడు
అగ్గిపెడితే యగ్గన్నఇల్లుమాత్రంకాలదా?
ఇలాగా, ఒక్కొక్క సామెత
ఒక్కొక్క పద్యం లాంటిది. సామెత
లన్నింటినీ సందర్భాన్ని బట్టే ఉపయో
గించాలి

బానిస వృత్తి

అధికాళల తమస్సులో
మృత్యువు కోరల వెలుతురుతో
తమది కానిది
వెతుక్కునే
నరహంతలు నాయకులై
యంత్రాల మంత్రిత్వంలో
మరణం విజయానికి మార్గం

సమానతా, స్వాతంత్ర్య
ప్రతిపత్తిని కల్పించే ఒక
సంఘ వినిర్మాణానికి —
సామ్రాజ్యపు టాశలు
సకలం పునాదులెత్తిన
ప్రజాస్వామికపు బలవద్దుర్గంలో
ప్రసవవేదనలు - పడే జగత్తు ! !

జగదభ్యుదయపుటాదర్శం
సమసిన యీ జగతి నడత
నిరసిస్తూ,
విరచిస్తూ,
నయబోధన గీతావళి
బానిసగా మరణిస్తా
స్వతంత్రుడిగ జన్మిస్తా.

శివరాత్రి ప్రభ కొనగంటల్లో
కిల కిల మని నవ్వుకునే
స్వతంత్రుడిగ జన్మిస్తా

శ్రీ కుందుర్తి ఆంజనేయులు

కోటి కులాలకు
లక్ష మతాలకు
బానిసగా బ్రతుకలేను,
సంఘానికి చదువు నేర్ప
స్వతంత్రుడిగ జన్మిస్తా.

నానాజాతుల నాయకులకు
పరస్పరం కక్ష పెరిగి
స్వార్థపరుల పాలనలో
గుండెలేని తుపాకి చట్టాల్లో
బానిసగా మరణిస్తే
స్వతంత్రుడిగ జన్మిస్తా.

సంఘాన్నీ, సామ్రాట్టుల్నీ
నిర్భయంగా నిందించే,
నిరంతరం నిరసించే
స్వతంత్రుడిగ జన్మిస్తా.

అజ్ఞానపు జలయానంలో
పంకరగా టింకరగా
వర్తించే జగన్నావకు
ఋజుమార్గం చూపించే
ఋక్షంగా జన్మిస్తా.
బానిసగా మరణిస్తే
స్వతంత్రుడిగ జన్మిస్తా.

"కుయం మంతే యేంవితి యచ్మి?"

శ్రీ తెన్నేటి సూరి

"అచ్మి! దో బూచ్!"

"అయ్యయ్యయ్యో! ఆరి వెధవా!" అంటూ కొంప మునిగిపోయినట్టు, పడమటింటి గుమ్మంలోనుంచి, ఒక్క గావుకేక బెట్టింది ముసలమ్మ— "మడిదణ్ణెం కాస్తా ముట్టుకుని తగులెట్టావూ? ఛీ! ఛీ! వెధవ కాపరం పిల్లణ్ణికూడా వదిలేసి, నాపసానుల్లా కచేరీలు తీర్చి కూర్చుంటే, వొక్కముండని యెందాకా యేడవను? మళ్ళా యీ గుడ్డలన్నీ తడుపుకు తగులడాలి; చస్తున్నాను నాకు చావన్నా రాలేదు."

"పిల్లణ్ణి ముందెట్టుకు కూర్చుంటే ఈ మైల చాకిరి అంతా ఎవరు తగలబెడతారూ" అంటు అందుకుంది కోడలు— "కచేరీలుట' కచేరీలు ఇక్కడెవ్వరూ కచేరీలు చెయ్యటం లేదు. ప్రొద్దుణ్ణించి రెక్కలు ముక్కలు జేసుకు చస్తున్నాను గుడ్డలు తడపమంటే తడపనా? ఇంతలోకే చావులూ బ్రతుకులూ యెందుకు ఇల్లా రావేంరా వెధవా! ఇంకా అక్కడే చచ్చావేం ఇలా రా! నీ దుంప తెగా' మాయదారి సంతానం అసలిక్కడికెందుకు చచ్చావ్?"

'చెళ్ళున' ఆ పసికూన లేత చెంపలమీద అయిదువ్రేళ్లూ బుసబుసా పొంగిపోయాయి.

"అయ్యయ్యో! ఎందుకమ్మా! పసిగుడ్డును అల్లా కొట్టావు?" అంటూ, చేతిలో వున్న నీళ్ళకడవ అక్కడ పారేసి, తల్లి చేతిలోనుంచి బిడ్డను బలవంతాన జారలాక్కుంది సుబ్బలక్ష్మిని కౌగిలించుకుని, బిడ్డ 'బావురు'మన్నాడు

తండ్రి, కాళ్లు గడుక్కోటానికి, దొడ్లోకి వచ్చాడు.

"పిల్లడు ఎందుకూ అలా ఏడుస్తున్నాడూ? ఎక్కిళ్లుకూడా వచ్చాయీ?"—

"నాన్నోయ్ మరే అమ్మే "ఒకదాని వెంట ఒకటి, ఎక్కిళ్ల, ఆపసిబిడ్డ పలుకుల్ని అడ్డగించి పారేసినయ్.

"కొట్టి చచ్చారూ? ..ఏముందీ వోడి ప్రయోజకత్వం "—సుబ్బలక్ష్మి చేతుల్లో నుంచి బిడ్డను తీసుకున్నాడు—"పసిగుడ్డు మీద చెయ్యి చురుకు చూపించేకంటే అంత చేతులు దురదగావుంటే, కూర్చుని దేనికది నెత్తేనెత్తే కొట్టుకోటం మంచిది ఏది నాన్నా ఎక్కడకొట్టి చచ్చారూ?"

"ఇదుగో! " అంటూ, కందిపోయిన బుగ్గ చూపించాడు

"అరెరె! యేమిటీ పశుత్వం? లేత బుగ్గలమీద అయిదువ్రేళ్ళూ ఎలా కుందాయో చూడు సుబ్బలక్ష్మి! ..ఏముందీ గొడ్డుమోతు మనుష్యులు రెండువైపులా, రెండు కొంపలూ మృతనాష్టమై, పరాయివాళ్ళపరమైనాయి. ఈకొంపకూడా అలా కావలసిందే ఏదేవుడో కనికరించి, నలభై ఏళ్ళకి మళ్ళా పసిబిడ్డంటూ యీ కొంపకు యీ నలుసుని చూపించాడు. ఈ మనుషులు అసలు పశువులో, దున్నపోతులో అర్థంకాదు ఏడవకు నాన్నా! ఇదుగో యీ తద్దినం కాస్తపూర్తి గానీ, ఆ దుసదుసేమిటో కనుక్కుంటాను మా నాయనే యేడవకు "

"మరే .అచ్మితో దూబూచ్ అలా ననీ" మళ్ళా బిగ్గిరిగా యేడుస్తాడు.

"తగని చిత్తడి ఎల్లాగైనా. అల్లరి నేర్చుకుంటున్నాడు భోక్తలకోసం ఆరేసిన మడిగుడ్డలన్నీ ముట్టుకున్నాడు " అంది లక్ష్మి,

యజమానికి వచ్చిన కోపం కొంచెం చల్లారా లని

యజమాని మరీ మండిపడ్డాడు—

"ఓహో! అదా యేడుపు! ముప్పెయ్యేనేళ్ళు, బుద్ధికింది కొచ్చేదిపినవాళ్ళకి, పసిగుడ్డును కొట్టుకోకూడదనే పరిజ్ఞానం లేదుగాని యీ నాలుగేళ్ళ నాపకీ వీరి మళ్ళూ, వీరి ఆచారాలూ, వీళ్ళ శ్రాద్ధం ఈ ప్రపంచ విజ్ఞానమంతా వాడికి తెలియా లన్నమాట? మన షలైతే బుద్ధీ, ఆలో చనా వుంటుంది పశువులకేముంది. ఏజన్మ లోనో, యే దేవుడి పాదాలదగ్గిరో, ఒక తులసిదళం, తోచో తోచకో, పారేశాను. ఈ కాస్తసలుసూ ఓసిపించుతున్నారు. ఏడ వకు నాన్నా! ఆసంగతి నేను కనుక్కుం టాగా సుబ్బలక్ష్మీ! భోక్తలు లేచేదాకా, పిల్లణ్ణి మీ యింటకి తీసుకుపో. ఆ పిల్లల్తో పాటు ఆడించు చిన్న సన్నాసి. వాడికేం తెలుసు. ఇక్కడయివన్నీ ముట్టుకుంటాడు మీరు వాడిమీద చెయ్యిచేసుకుంటే, నాకురేచి క్కెత్తుకొస్తుంది. చిట్టెమంతపనొస్తే చిందులు ద్రొక్కేడస్తాగు"

మెళ్ళో చిక్కుబడివున్న పులిగోరు పత కం సరిజేసి, బిడ్డను సుబ్బలక్ష్మి చేతుల్లోకి అందించాడు.

దొడ్డి తలుపు తెరిచి "తలుపు వేసుకోండి" అని కేకబెట్టింది, సుబ్బలక్ష్మి ఇంటి వెనక వున్న పాటిదిబ్బ దిగుతోంది లక్ష్మి చంక నెక్కిన హుషారులో, తల్లి కొట్టిన దెబ్బ అప్పుడే మరచేశాడు - సంతోషంగా మాట్లాడ టం ప్రారంభించాడు.

"అచ్చిమీ!—"

"ఆఁ!"

"బామ్మ అప్పాయి లొందుతోంది —"

"అవును. ఇవ్వాళ మీ తాతగారి తద్దినం గదూ —"

"తద్దినం అంతే యేవితిఅచ్మీ?"

"ఇవ్వాళ మీ తాతయ్య వస్తారు."

"అచ్చోయ్! మొన్నే—మా మామయ్యొ చ్చారు"

"అబ్బే! ఛీ! తప్పు! అలా అన గూడదు. తాతయ్య రావటమంటే అది గాదు"

"కాదుయే! మావయ్య సైకిలెక్కొ త్తాలూ తాతయ్యే ఎద్దులబండీ యెక్కీ. చో! అహహోయ్! అంతూ వత్తాలు అచ్మీ! తాతయ్య యెవలూ?"

"మీ బామ్మ పెనిమిటి"

"పెనిమిటంతే మొగులా?"

"ఆఁ"

"అచ్చోయ్"—అంటూ లక్ష్మి రెండు భుజాలూ ఎట్టుకుని, ధీమాగా, ముఖంలోకి చూచాడు—ఏదో గొప్పవిషయం చెప్పబో తున్న దర్జాతో—

"ఇదిగో! అచ్చిమోయ్! ఈ తలవ గనప్పమాబామ్మనన్నుకొత్తుతే తాతయ్యతో చెప్పీ — యిత్తా — యిత్తా — యిత్తా— దుగ్గు దుగ్గు చేయిత్తాను"

"తప్పుగాదూ? పెద్దవాళ్ళని అలా అనొచ్చా?"

"తప్పా! అనగోల్దా? చెంపలేచు కోనా?" చిరి చేతుల్తో చెంపలేసుకుంటాడు.

"మలీ చిన్నవాల్లని కొత్తతం, తప్ప న్నాలుగా. నాన్నగాలూ! అమ్మా, బామ్మా నన్ను కొత్తుతాలుగదా చెంపలేచుకో లేం?—అచ్మీ! బుర్రు! బుర్రు! బుర్రు! ఏక్కుయాయే! ఒకమ్మాయి బుర్రి దొక్కిందే." అంటూ తాళవరుసలో పాటగా పాడుతున్నాడు.

కొంచెం పల్లంలోవుంది, అపార వాన గురిసి ఆ పాకచుట్టూ బురదగావుంది

"పాపాయి! పాపాయి! దొరగారి పాపాయి!" అంటూ రాముడూ, నారాయణా, ఆడపిల్ల మాణిక్యం—సుబ్బలక్ష్మి ముగ్గురు బిడ్డలూ, సంతోషంగా గెంతుకుంటూ, తల్లి వెంట పాకలోకి వచ్చారు—ఏదో ఒక బం గారుకొండనే తల్లియింటికి తెచ్చినట్టు. ఆ పిల్లల పంకచూసి, చంకలో వున్న పసిబిడ్డ ముఖం సంతోషతో విప్పారింది చిరు నవ్వు నవ్వాడు లక్ష్మి ఆ బిడ్డను చంకలో

నుంచి క్రిందికిదించింది దింపీ దింపగానే, ఆబిడ్డ నలువైపులా 'లియజూచాడు ఆ పాకలో సగానికి అడ్డంగా కట్టివున్న తడిక చాటుకుపోయి, తొంగిచూస్తున్నాడు.

"ఏంగావాలి నాన్నా ?" అంది సుబ్బలక్ష్మి.

"బుచ్చా యేదీ ?—"

"బుచ్చాయేమిటి ?—"

"ఈ పాకలో గొడ్డులేవీ — లాగవాయి పొలం తోలు ల్లాలా ?"

"ఇది గొడ్లపాక కాదు నాన్నా ! మనుష లుండేదే - నేనూ, రాముడూ, నారాయణా, చెల్లాయీ, అంతా, యీ పాకలోనే వుంటాం"

"ఛా ! అబద్దం - పాకలో ఎక్కడలన్నా మనుషులుంతాలా ? గొడ్డులుంతాయి మను చులు పెంకుతింతో వుంతాలు." ఆ పాక లోనే లక్ష్మి, బిడ్డలూ వుంటారనేమాట వట్టి తెలివితక్కువమాటని ఆ బిడ్డ అభిప్రాయం. తను చాలా తెలివిగలవాణ్ణనీ, లక్ష్మికి తనంత తెలివి లేకపోవటంచేతనే, పాకలో మనుష లుంటారని, అజ్ఞానంగా మాట్లాడిందనీ అను కున్నాడు.

"ఏక్కుయాయే ! ఒకమ్మాయికేమీ తెయి య్యేదె — జియ్యాయియే — జియ్యాయియే- పాకలో మన్సులుంతాలుతే !" అంటూ గంతులేస్తున్నాడు.

"నిజం నాన్నా ! మేముండేది ఈ పాక లోనే" అంది లక్ష్మి.

"నిజంగా పాపా ! యిక్కడే మే ముం దేది" అన్నాడు, రాముడు

"నిజం నిజం బువ్వతింతం ఇక్కలే, బబ్బోతం అంతా ఇక్కలే—" అన్నాడు నారాయణ

"తాతాను బొమ్మలెత్తుకునీ, ఇక్కలే అలు కోతం నువ్వు నాతో ఆ గుదుంబావా?" అన్నది చెల్లాయి

"బొమ్మలేవీ?"

మాణిక్యం గుడ్డలుకట్టిన తాటాకుబొమ్మలు తెచ్చి, పాపాయికి చూపిస్తోంది. "ఇదిగో . ఇది మొగులు ఇది పెల్లాం. పెల్లాత లాల్దామా ?"

"ఆల్దాం ఆల్దాం" తూతుతూ, తూతుతూ, అంటూ, నోటిముందు వ్రేళ్లు కదు పుతూ సన్నాయి వూదుతున్నాడు పాపాయి.

"ఢమ్కఢమ్, ఢమ్ఢమ్" అని పిర్రల మీద డోలు వాయించేస్తున్నాడు, నారాయణ.

ఎన్నె పేరంటాలు. మాణిక్యం, పెళ్లి కూతుర్నీ, పెళ్ళికొడుకునీ తడికకు ఆనించి కూర్చోబెట్టి, తల్లిదగ్గిరి కెళ్ళింది

"అమ్మా ! బొమ్మలపెళ్ళి చేచుకుంతాం, పప్పులెత్తవ్."

"అన్నంతిని, ఆడుకుందురుగాని, అన్నం పెడుతున్నాను."

మూలన్న కంచుకంచం తెచ్చి నట్టింట పరిచింది, సుబ్బలక్ష్మి. అది సరిగ్గా ఒక అర్ధమణుగు బరువుంది. కొయ్యతెడ్డుతో అన్నంకుండలో నుంచి కంచంలోకి తోడు తోంది

"అచ్చిమీ ! పెరుగుకుండలో అన్నం బెత్తావేం ?"

"మేము కుండతోనే అన్నం వండు కుంటాం నాన్నా ! మాకు గిన్నెల్లేవు !"

"ఎందుకనీ ?"

"కొన్లేదు"

"మొన్నా - కంచలి దేలా ఒచ్చిందిగా ఎందుకొక్కన యేదూ ? అమ్మ బోలెలు గిన్నెలు కొంతేనూ"

"అమ్మకు దబ్బుంది గనక అమ్మ కొన్నది. నా దగ్గిర డబ్బేదీ ?"

"అమ్మకి దబ్బుంతే మలి నీకెందుకు యేదూ ?"

"అమ్మకు నాన్నిస్తారు "

"నాన్న నీకియ్యలా ?"

"ఎందుకిస్తారూ ?"

"నాన్న నీకియ్యకపోతే నే నిత్తాయే అచ్మి !"

"నీకు డబ్బెక్కడిదీ ?"

"నాన్నమల్లే అంత బెద్దవాన్నయీ కాయితాలులాచీ దబ్బు చంపాయిత్తా."

లక్ష్మి చిరునవ్వు నవ్వుకుంది

'మానాయనే' అప్పుడు కొనిపెడుదువు

గానిలే నేనందాకా బ్రతుకుతానా ?'

సుబ్బలక్ష్మి కంచంనిండా అన్నం పెట్టింది. ఆ యెంగిలిచేత్తోనే పోయి ఉట్టిమీదనుంచి పిడత తియ్యబోయింది—

"ఆయ్! అచ్చిమీ! అదేంతీ!" అని గదమాయించాడు

లక్ష్మి తెల్లబోయి, "ఏమిటి నాన్నా!" అంది

"అంతచేత్తో ఉత్తి ముత్తుకుంతావేం ?"-

"ఇంత తెలివిగలవాడివీ ఇందాక మడి గుడ్డలన్నీ ముట్టుకుని దెబ్బలెందుకు తిన్నావూ ?"

"నీకు పిచ్చా యేమితి అచ్చిమీ? — దన్నెంమీదవి మరిబత్తలా? అవి పత్తు బత్తలా యేవితి? మా అమ్మ నన్ను ఎప్పులూ ఊలికే అత్తాగే కొత్తుతుంది మా నాన్న అమ్మనెత్తాకోప్పద్దాలో చూచావా ?"

బిడ్డముందు తల్లిని కోప్పడట మెంత తప్పో, లక్ష్మికి తెలిసింది.

"నాన్న అమ్మని కేకలేశారని, అల్లరి చెయ్యొచ్చు ననుకుంటున్నావా ఏమిటి? నువ్వు ఏడుస్తున్నావని నిన్ను సముదాయించటానికి, నవ్వటాలకి నాన్న అమ్మనలా కేకలేశారు. అల్లరి చేస్తే నాన్న ఊరుకుంటారనుకుంటున్నావా ?

"చయ్యే ముందుచెయ్యి కయుక్కు యా-మయ్యా ఉత్తిముత్తుకో బోతున్నావేం? నీకు పిచ్చా యేమితీ ?"

చెయ్యి కడుక్కోకుండా ఉట్టి ముట్టుకుంటే ఆపిల్లడు ఊరుకోడు దొడ్లోకిపోయి చెయ్యి కడుక్కొచ్చింది.

వాసినకట్టిన ముంతలోనుంచి సంబారు కారం తీసి, కంచంలోవేసి ముద్ద కలుపుతోంది అసువాసన. ఘుమఘుమా పాకంతా చుట్టేసింది వస్తూవస్తూ, కడుపునిండా పెరుగూ అన్నం తినేవచ్చాడు అంచేత, ఇంతసేపూ, అన్నంతినే ధోరణిలో లేడు. దూరంగా కూర్చుని, కబుర్లు కొడుతున్నాడు. కాని ఆసువాసన అతణ్ణి ఆకర్షించింది. తెలుగుదేశంలోవున్న బీదజనమంతా యీ ఒక్క ఆదరువుతోనే కాలక్షేపం చేస్తారు. బ్రాహ్మణ కుటుంబాల్లో నుటుకు ఎందుకనో దీన్ని వాడరు. తక్కిన శూద్రులంతా వాడే యీ పదార్థం తామూ వాడితే ఒకవేళ బ్రహ్మత్వం పోతుందనో యేమిటో!

పిల్లలంతా, కంచంచుట్టూ మూగారు. అంతా ఒక్క కంచంలోనే తింటున్నారు తల్లి తలో ముద్దా చేతుల్లోపెట్టి, తనూ తింటోంది. పాపకూడా, నెమ్మదిగా, దగ్గిరికి చేరాడు అరచెయ్యి చాపాడు. ఎర్రటి, ఆచిట్టి అరచేతిలోకి, బంగారుగాజు ముందుకు పడి, తొంగిచూస్తోంది.

"ఏమిటి నాన్నా!" అంది లక్ష్మి

"అం పెత్తూ"

"ఎబ్బే"

"ఏంతీ ?"

"నువ్వు నాదగ్గిర అన్నం తినగూడదు"

"లాములు తింతున్నాలేం మలీ ?"

"వాడు తినొచ్చు"

"వాలు తింతే నే నెందుకు తినగోల్దూ ?"

లాములు తింతే నేనూ తింతా పెత్తుతావా పెత్తవా? మీ కెవ్వలికీ యేకుందా, అంతా నేనే యాక్కుంతా నాగంది"— కంచంమీద కలియబడుతున్నాడు.

"ఆ! ఆ! ఆగాగు" అంటూ చెయ్యి అడ్డుబెట్టింది

"ఆ! అంతచేత్తో ముత్తుకున్నావంతేనా! అందయ్యాముత్తుకుని మైలపయేత్తా నమ్మాయ్! ఏంతనుకున్నావో! నాకూ పెత్తాయిచిందే"—అంటూ ఆపినా ఆగకుండా కంచంమీద కలియబడుతున్నాడు

ఆ బిడ్డ పట్టినపట్టు వదిలేరకం కాదు ఆ సంగతి లక్ష్మికి బాగా తెలుసు. ఏమి చెయ్యటానికీ లక్ష్మికి తోచలేదు కొంచెం గదమాయించిచూదామనుకుంది

"ఆయ్! చెబుతుంటే వినవేం ?" అని బిగ్గిరిగా కసిరింది.

పాపాయి రెండుగుడ్లనిండా నీళ్ళు తిరిగాయి. నెమ్మదిగా కంచం దగ్గిరనుంచి దూరంగా వచ్చేసి, తడికను ఆనుకుని శోక

మూర్తిలా దిగులుగా నిల్చున్నాడు.

ఎవరన్నా తన్నలా కసిరితే, లక్ష్మని కావిలించుకుని, పెద్దపెట్టున యేడ్చేసి, మారాం వేసేవాడు. లక్ష్మ తన్ని కేకలేస్తే ఇంకేంజేస్తాడు పెదవులు వణికిపోతున్నయ్. నల్ల నీలాలు చెక్కిళ్లు దిగజారుతున్నయ్ లోలోపల కుములుతున్నాడు

ఆ బిడ్డవంక చూసి. లక్ష్మ కడుపు తరుక్కుపోయింది. ముద్ద నోట్లో బెట్టుకోలేక పోయింది "మీరు తినండర్రా !—బిడ్డ యేడుస్తున్నాడు " అని కంచం దగ్గరనుంచి లేచి. దొడ్లోకి పోయి, చెయ్యి కడుక్కువచ్చేసింది. పాపాయిని ఒళ్ళోకి తీసుకుంది. "వెధవ కూడూ బిడ్డ హైరానైపోయాడు" అనుకుంటూ—

" పోనీ, తాయి తాగుతావునాన్నా !"

" నాకేమీ అక్కర్యేదుయే " అంటూ మూతిముడుచుకున్నాడు. లక్ష్మకి, ప్రపంచమే చిన్నబుచ్చుకుంటున్నట్టనిపించింది. "బిడ్డను ఎలా సముదాయించను"—అని ఆతల్లి జాలి పేగులు కళవళపడుతున్నయ్

"నా అన్నం, నువ్వు తినగూడదునాన్నా' నాఖర్మ పట్టెడు ముద్ద నీ బంగారుచేతులో బెట్టుకునే గీత నాకీజన్మలో లేదూ— నాకులం, నీకులం ఒకటికాదునాన్నా ! యేం చెయ్యమంటావు చెప్పు"—మునివ్రేళ్ళ చివరలు అలిగిన ఆ పసిచుబుకాన్ని బ్రతిమిలాడుతున్నయ్

కులమంటే యేమిటో ఆ పసిబిడ్డకు అర్థం కాలేదు. తనకూ, సుబ్బలక్ష్మికీ మధ్య ఏదో నల్లటి ఉక్కు తెర ఒకటి దిగుతోందనిపించింది. సుబ్బలక్ష్మి ఒళ్ళోనుంచి తన్నేదో ఒక పిశాచం బలవంతాన ఎక్కడికో చీకట్లోకి పడలాక్కుపోతున్నట్టు భయమేసింది, ఆ పసికందుకు

"కుయ మేమిటి అచ్చిమీ ? నా జతుందవా ?" — బెంగగా వణికిపోతున్న జాలి గొంతుతో దీనంగా అడిగాడు—"పోనీయే " ముంజేతుల్తో రెండుకళ్లూ నలుపుకుని, బిగ్గరిగా యేడ్చేశాడు చెలియలికట్టలు తెగిపోతున్నయ్.

లక్ష్మికికూడా కళ్ళు చెమ్మగిల్లాయి. ఆపసికూన పలుకులు ఆ తల్లి పేదగుండెల్ని, జాలిగాపిలిచి కలచినట్టయింది. ఆతల్లి, భరించలేకపోయింది. ఉద్రేకంతో పెదవులు కదిలిపోతున్నయ్—

"ఛీ ! ఛీ ! వెధవకులాలూ, వెధవ మతాలూనూ !—కసుగందుల లేతగుండెల్ని కూడా కత్తికోతగా చీరాలిసొచ్చిందీ !" అని విసుగ్గా గొణుక్కుంది.

"అట్టా, మా అన్నం నీకు పెట్టగూడదు నాన్నా ' నీకు తెలియదూ మా తండ్రి గదూ నేను నీ లక్ష్మని కానూ నామాట వినవ్ ?—" అంటూ, దీనంగా, ఆబిడ్డ కళ్లల్లోకి చూసింది. ఏమీ చెయ్యలేని, తన అసమర్థతనంతా, ఆ జాలిచూపుతో ఆపసి హృదయానికి చెప్పుకుంది. తన మాతృహృదయమంతా విప్పిచూపి "తెలుసుకోవూ ?" అంటూ ఆపసి గుండెల్ని నిశ్శబ్దంగా బ్రతిమిలాండింది

ఆబిడ్డ ఏడుపు నెమ్మది నెమ్మదిగా తగ్గితగ్గిపోతూంది పైకిబిగ్గరిగా ఏడవటం మానేశాడు కాని లోలోపల కుములుతున్నాడు అల్లా బలవంతాన దుఃఖం మింగుకోటం చేత. సూత్రం తెగిన ముత్యాలపేరులా కన్నీరు ఒలికొలికిపోతూంది. గుబులు గుబులుగా ఎక్కిళ్ళు. పైట్ట చెంగుతో కళ్ళు ఒత్తింది లక్ష్మి. గట్టిగాహృదయానికి హత్తుకుని ఆపసి గుండెల్ని తనలోకి లయించుకుంటోంది.

ఆబిడ్డ, గుబులుగుబులుగా, లోలోపల కుమిలి కుమిలి యేడుస్తూ ఆ తల్లిఒళ్ళో, "అలాగే నొ" మ్మని'కన్నుమూశాడు. మధ్య మధ్య ఎక్కిళ్ళు వినిపిస్తున్నయ్.

నిద్రపోతున్న ఆ పసికూన వెన్నుమీద చెయ్యివేసి ఆప్యాయంగా నిమిరింది లక్ష్మి. ఆ బిడ్డ ఒళ్ళు, పేలగింజ వేస్తే పేళ్ళుమనేట్టు కణకణా కాలిపోతోంది. లక్ష్మి కలవరపడ్డది. "అయ్యయ్యో! ఇదేమిటి బిడ్డకు కొండలపెట్టున జ్వరంకూడా వచ్చేసిందీ !"

"కుయమంతే యేవితి యచ్మీ!" బిడ్డ నిద్రలో కలవరిస్తున్నాడు.

ఆంధ్ర అభ్యుదయ రచయితల చతుర్థ మహా సభ

— మన బాధ్యతలు —

ఆంధ్ర అభ్యుదయ రచయితల తృతీయ మహాసభానంతరం సాహిత్య రంగంలో అభ్యుదయ రచయితల సంఘం చేసిన కృషి ఆంధ్ర ప్రజల ఆదరానికి పాత్రమయింది పెదపూడి ఆంధ్ర సాహిత్య పాఠశాలద్వారా ఆంధ్ర సాహితీరంగంలో నూతన చైతన్యం రేకెత్తింది ఆంధ్ర సాహితీపరుల ఐక్య కృషిఫలితంగానే, ఈనాటికి 'అభ్యుదయ'ను వెలువరించడానికి మనం అనుమతి పొందగలిగాం ఆంధ్ర సాహిత్యాభ్యుదయానికీ, లలిత కళాభ్యుదయానికీ సేవచేయడానికి తగిన అవకాశం సంపాదించాం 'అభ్యుదయ' ఆంధ్ర ప్రజల ఆమోదాన్నీ, ఆదరణనూ చూరగొన్నది

ఈ పరిస్థితుల్లో ఆంధ్ర అభ్యుదయ రచయితల చతుర్థ మహాసభను జరపడానికి కార్యవర్గం తీర్మానించింది ఆ తీర్మానానుసారం మహాసభ జనవరి మొదటివారంలో మద్రాసులో జరుగుతుంది జస్టిస్ శ్రీ పి. వి రాజమన్నారు గారు అధ్యక్షతవహిస్తారు

కనుక జనవరిలో ప్రారంభంకానున్న నూతన సంవత్సరానికి అభ్యుదయ రచయితలందరూ తమ సభ్యత్వాన్ని పునరుద్ధరించుకోవాలి వెంటనే తమ తమ స్థానిక సంఘాలనుంచి మహాసభా ప్రతినిధులను ఎన్నుకోవాలి ఈ విషయములో అన్ని స్థానికసంఘాలు చురుకుగా పనిచేసి, తమ తమ ప్రాంతాలలో ఉన్న రచయితలనూ, కళాకారులనూ అందరినీ సభ్యులుగా చేర్పించి, తమ మహాసభా ప్రతినిధులను ఎన్నుకొని, మహాసభా కార్యక్రమాన్ని జయప్రదంగా నిర్వహించడానికి తోడ్పడవలసిందని కోరుతున్నాను.

చదలవాడ పిచ్చయ్య
కార్యదర్శి,
ఆంధ్ర అభ్యుదయ రచయితల సంఘం

అడుక్కు_దినక సేసేదేంది!

శ్రీ మాధవపెద్ది గోపాలకృష్ణగోఖలే

వూరికి ఎలపల వుండ ఆ పాడుబడ్డ కొట్టుమీన రేత్రిళ్ళు దెయ్యాలు అరుత్తా వుంటయ్యని ఆ వూరిజనం సానామంది అనుకుంటారు

రే_త్తిరి పదిగెంట లయింది కారు సీకటి యాడ ఏంవుండదీ కన్నుబొడ్చు కుండా కా్రనాటంలా

ఆ కొట్టుమీన రొండు యిగ్రహాలు కూకునుండై గర్భగుళ్ళో అమ్మోర్లకి మల్లే ఒక యిగ్రహం కళ్ళు మెరుత్తా వుండయి, రెండో యిగ్రహం కళ్ళు మూసుకునుండై

"తూత్ యింత సన్నాసివూరు నే నేడా సూళ్ళా!" అంది కళ్ళు గల యిగ్రహం

"అన్ని వూళ్ళూ యిట్టనే సచ్చినై!" అంది కళ్ళుమూసుకుండ యిగ్రహం

"యింత వుప్పు గోంగూర ముద్ద దొరికి మంచీలు తాగేటప్పటికి గనమై పాయె! తిరగంగా తిరగంగా సివరకి ఆ యమ్మ కా_త్తె పప్పుశారుండది కావాలా అనడుగుతే అ_పదేలనుకుంటా దొసెట్టో అటనే తాగి సల్లగా యీడకి జేరుకుంటిని"

"యిగ ఈ పానాలు యిట్ట బోవ ల్చిందేలే! అయినా సావటం అంటే గబిక్కున సావాలగాని, యిదేంది యిదా పద్దతి? పోసీ, ఆముసల్ది ఆడా, నేనీడా, ఆడకి వొదిలిపోద్ది శని" అంటా తుబుక్కున వుమ్మేసింది కళ్ళు గల యిగ్రహం,

"పెల్లాం యాడన్నా వుండదా?" అంది కళ్ళు మూసుకుండ యిగ్రహం

"పెల్లాం! మా అమ్మదప్పితే నా కెవరూ లేరు"

"నీకు ఎన్నేళ్ళేం?"

"ముప్పయి"

"ఆఁ! మాటవోకడజూత్తే యాబ య్యేళ్ళకిమల్లే వుండది! బలేవోణ్ణే!" అన్నది కళ్ళు మూసుకుండ యిగ్రహం

కూసేపు ఆగివోయినై యిగ్రహాల మాటలు

"యిదుగో. నిదరబోతుండావా?" అంది కళ్ళు మూసుకుండ యిగ్రహం కొంతలెక్క పోయినాక

"నిదర్రావటంలా నాకు" అంది కళ్ళు గల యిగ్రహం.

"ఎవరన్నా యిటనే జతపడ్తావుంటారా, అదిదంటా ఏదన్నా కూసేపు మాట్టాడంది నాకు దోసదు సెప్పొద్దూ"

"ను వా మాట అనకుండావుంటే యింకూసేపు జూసి నేనే అడిగేవోణ్ని అసలీ చీకటి తిక్కబుట్టిత్తుండది!"

"నాకా దిగులేంలేదులే!" అంది కళ్ళు మూసుకుండ యిగ్రహం

"ఔను మరీనయుం పెపంచకం ఆవజానలేంది సోకేలేమూ!"

"మీది ఏవూరేం?"

"అసలు దబ్బాదిన రెట్టపాడయితే పందెలుగు వొచ్చేశారు మా అయ్యోళ్లు"

"నందెలుగు ఏవిఁటికి రావల్సొచ్చిందీ ?"

"ఆఁ అడుక్కుదిన్ను ! యిప్పుడెంముకులే ఆ పురానం"

"అదిగో. ఆడే సిబుఫ్క మంటది పానం ! ఏందో యియ్యాలుండి రేపు సచ్చేదానికి- నువుగాంగా అమాటన్నావు! మంచీ సెబ్బరకొత్తే నువెంతో నేనంతే ఏమంటా ?"

'అంతేలే ఎదవబతుకులు"

"సరింకేం ?"

"వుండ కొత్తైకూత్తే బూవిఁ తుదును బెట్టుకువోతే, కొత్తె బతికినవూళ్ళో నినకయినా నగుబాట్లపనవుద్దని నందెలుగో, పొందెలుగో వొచ్చేశాటు మా అయ్య" అంది కళ్ళుగల యిగ్రహం

"ఆహాఁ ! ముంగల కొత్తె బూవిఁ వుండదన్నమాట, ఎంతేం ?"

"మూడెకరాల మెట్ట"

"అబ్బా ! బాగానే తింటానికి వుండదన్నమాటా ! తాగుడుగాని ముండలుగాని మరిగాడెట్టా మీ అయ్య ?"

"చా ! మా అయ్య మంచోడు. ఏళొవటమే సదమంత్రంగా పొయిందయితే."

"అంటే ?"

"మనగాడి సజ్జపంట బండేది మా బూవిఁలో తింటానికి కొంటానికి అదే నయమని ఏటా అసేపంట ఏసేవోళ్ళం, కొత్తపంట రాంగానే ఆ కోఁవటి సెంచయ్యకాడ మిరబగాయ బొరబగాయ తాలూకు సేసిన అప్పు, యింకేవన్నా సిల్లర బొల్లరవి వుంటే తీర్చిబారేసి మిగతాయన్నీ పురిగట్టి బోసేది మల్లీ వొచ్చే ఏటి పంటలొచ్చేదాకా అయావజాన తిండికి సరిబోతావుండాల్సిందే ఈలోగా సెంచయ్య నాలిక బీక్కుండా ఒక్క గిద్దెడు సజ్జలన్నా బోసేదిలేదు"

"మరి యింటిముంగలకొచ్చే సెక్కరాలూ ముంతకజ్జాయం యిట్టాటియి కావల్సొంటే డబ్బులుండేయా ?"

"డబ్బుగిబ్బు మనకవసరమే వుండేదిగాదు అప్పట్లో అదుగో నువ్వుజెప్పినట్టు అయ్యేయన్నా కావల్సొత్తే గిద్దో రొండుగిద్దలో సజ్జలేబోత్తే పనిగడ్సిపొయ్యేది"

"ఏడాదంతా తిండికి మటుకు బాగా సరిపొయ్యే దంటావ్ ?"

'తరుగులు బొరుగులుండా ఇబ్బంది మటు కుండేది గాదు"

"ఏడాదంతా బాకీలడక్క బోటం జూత్తె మీవూరికోఁవటి సెంచయ్య మంచోడల్లే వుందే ?"

"ఆడా ! ఆణ్ణిజూత్తెనేనాకసలు మొమట్నుంచీ గిట్టేదికాదు. పందికొక్కుఋంటయి జూశా-అదీఆడిబుద్ది, అప్పుడో పన అప్పుడోపనంటా మాసొప్పంతా ఎత్తికెల్లి ఆళ్ళబర్రెల్ని మేపుకునేవోడు ఎప్పుడన్నా అవసరానికి అప్పుబెడ్తె సెంచయ్యేగందా అని మాఅయ్య ఆణ్ణేం అనేవోడుగాదు"

"మరిఆళ్ళబుద్ది అసువంటిదీ"

"కొత్తె ఒకేడు పంట ఎచ్చుతగ్గయితే ఒంట్రొండు బత్తాలు ఎక్కువజేసుకుని బాకీ పైయ్యేటిదాకా ఆపేవోడేలే మరి వాన్దేవుడిమీన ఆదారపడుంటదిగా మన పానం ?"

“అందుట్టో మెట్టసేలయె”

“యింతకీ మారోజులు బాగుండక బోతే ఎవురేం జేత్తారు. అప్పటికేకొంత బాకీ నిల్చింది సెంచయ్యకాడ, ఒకేడు వానలు బొత్తిగా లేకపోటం, పైయ్యేటికి గాలివానలు దంచి సేలన్నీ మురుగెత్తటం వరసొరసన జరిగింది మూడో ఏటికి సెంచయ్య గబిక్కిన మొత్తం బాకీ ముంగలబెట్టి అదంతా అప్పుడి కప్పుడు కక్కకబోతే కోరుటు కెక్కిత్తానని మాఅయ్యను పొలంపంటమీనుం డంగా నిలేశాడు యింగేం లాబంలేక బోయింది వొడ్డీలు గిడ్డీలు మొత్తంజేరి తొమ్మిదొందల రూపాయల పైసిలుక్కు మామూడెకరాల బూపి బాకీకింద కట్టుకుండాడు సెంచయ్య రొండురోజులు బోనిచ్చి మాగుడిసె వుండ స్తళం,అయిన కాడికి తెగనమ్మి ఒకరేత్రి మమ్మల నందెలుక్కు పయానం గట్టిచ్చాడు మా అయ్య అంతే రెండు మూడునెల్లుండి అయ్య జరంతో సావనే సచ్చాడనుకో” అంది కళ్ళుగల యిగ్రహం

“అరెరెరెరె ఎట్టాటి పన్జరిగిందీ ! నిచ్చేపవంటి బూమి ఆవజాన నీలుగారి పోయిం దన్నమాట ! హూ !” అన్నది కళ్ళు మూసు కుండ యిగ్రహంయిళారంగా

“మొదులు ఒల్లూ కాలూ గుల్లయి, అంవేలు సంగతి అట్టయితే దిక్కులేదు గాని ఎప్పుడో ఏందో పోయిందానికి ఎవుడో ఏడ్చాడంట !” అన్నది కళ్ళు గల యిగ్రహం యిసిరేసినట్టు

“ఒల్లూకాలూ గీలంటండా వేందీ ?”

“మరిగనేంది ! అసలాడ ఏంలేందే యీకొట్టుమీన కొచ్చి నీతో కూకుండా నంటా ! యీ కాల్తో గాదూ నాకతంతా అడ్డం గిరిగిందీ ! లేకుంటే నాజనమలో ఒకణ్తో కానీ దేబరించి ఎరుగుదునా ? ఎనకటికి శాత్రం వుండదిలే, బోడిగుండు మీన గొబ్బరికాయ పడిందని ! యింతకీ సెని తంతావుంటే యీ యదవకి అలివేలు ఎట్ట దక్కుద్దిలే !” అంటావుంది కళ్ళుగల యిగ్రహం.

“ఏంది నువనేదీ ?” అంది కళ్ళు మూసుకుండ యిగ్రహం.

“నా సంగతేలే !”

“ఎవురో అలివేలంటంటే ఏందబ్బా అనుకుండా ”

“నందెలుగులో ఓ కుర్రదిలే.”

“పానం దీత్తివే ! అయితే అలివేలు వుండదన్న మాట ?”

“నా బతుకు సాలా సెండాలబ్బాతు కన్నా !”

“యింకో నిమసానికి ఏం జరుగుద్దో మనికి తెలవదు గందా ? మనవి వొట్టి ముదనష్టబ్బతుకులు ”

“నందెలుగుల్లో మొదట అలివేల్ని వరికోతలకాడ సూసే సూట్టం లలికే తిక్కబుట్టిందంటే నమ్ము అసలట్టాటిదీ అలివేలు యింకెవురయినా దాని ముంగల బాలాదూరే! అల్లమ్మ రంగమ్మ- గుర్రాలుంటయి తెల్సుగా ? తెగ ఎగురుద్దీ, దాంతోనే వొచ్చిందీ సావంతా ఓనాడు ఏమయినా అయిద్దని ఎల్లి అలివేల్ని పెల్లి జేయమన్నా ”

“ఏ మంది గు-రంగమ్మా ?”

“యీలుగాదంది ”

“ఏందీ యీలుగాందీ ?”

"రంగమ్మ పెళ్లి యీలు కాదంది"

"మరి అలివేలుకు నువంటే గురేగా?"

"పది సమ్మద్ది"

"మరి రంగమ్మ ఏమంటదీ?"

"తన కూతుర్ని పోషించను నాకాడ డబ్బులేదంట"

"ఆసి యదవా-పేసీబెట్లిందే?"

"కాల్లకి కడాలూ, సెవిలికి దుద్దులూ, ముక్కుకి పుడకలూ సేయిత్తే, ఒకపేళ నాకు గుబుల్దిరిగి ఆళ్ళమ్మాయిని వొది లేసినా ఆటితో కొన్నాలన్నా తనకూతురు బతకొచ్చునంట"

"మరి నువేమన్నా?"

"అంటానికి నాకాడేంవుండది బూడ్ద రోజంతా కూల్జేస్తే వొచ్చిన అరనాలో అద్దరూపాయితోనో మూఅమ్మ నేను తినంగా యింకేంవుంటదాదా? అసలు మాఅయ్య పొలంగిలం పోనూకొన్ని నండెయిగు సేరేడని తెలిసే అది పేసీ బెట్టింది"

"అలివేలేమంటదీ?"

"ఆసేమంటది, అమ్మన్జూత్తే అడ లాయితే ముండి-రంగమ్మని ఏందేందో అంటా లెగిశా,"

"ఆ?"

"అలీ రోసంగలాడివయితే యాడ కన్నా ఎల్లి డబ్బు సంపాయించుకు రారాదా, అనంది రంగమ్మ ఒక యాడాది అలివేల్ని నాకోసం వుంచు తానని మాటిత్తే అటనే సంపాయిచ్చు కొత్తానన్నా వుంచుతానంది రంగమ్మ యీ యవారం తనకి నచ్చకబోయినా, ఎల్లి ఎప్పుడొత్తానో కనిబెట్టుకుంటా నంది అలివేలు ఎంటనే నండెలుగు ను చలుసలెల్లా ఎల్లీ ఎల్లీ ఎల్లీ ఎట నయిలేసేం సివరకి రేత్రింబగలూ పన్జేత్తే రూపాయిపావలా గిట్టుద్దని తెల్సినాల్లే బగమంతుడా అనుకుంటా బెజవాడలో రామసెంద్రయ్యగారి ఏడ్జెన క్కాయ ప్యాక్టరీలో బత్తాలుమోసే పనికి వొప్పు కుండా అది సానా పెద్ద ప్యాక్టరీ అడ యిన ప్పన్లవి యింకా సానా వుంటాన రామసెంద్రయ్యగారికి ఏలకి ఏలు లాబా లుండేవి బలేచోట పడ్డాగందా, ఎటనో గట్ట ఏడెందిమాసాలు తంటాలుబడ్తే అలివేల్ని పెళ్లి జేసుకోవచ్చుగందా అను కుంటా, రామసెంద్రయగార్ని మెప్పిత్తా, అందరికన్న మిగులుగా బొహుప్పసారు మీన సెకాసెకా బత్తా ఎంట బత్తా మోత్తా పొయ్యేవోణ్ణి తిండికి పావలా అరనాలకన్నా కరుజుపెట్టకుండా రోజుకి రూపాయో పద్దాలుగణాలో ఎనకేత్తా వచ్చా ఆవజాన రెణ్ణెల్లు గడిసేతలికి ఒల్లు కాత్త సెట్టం మొదలబెట్టింది ఆ బెజవాడ నీలు పుత్త సన్నాసి నీరు గావాలా, వొల్లు ఎచ్చగా వుంటం మొదులుజెట్టింది పదిరోజులు వొంటి పూటే పన్జేసి కాత్తె సుమారుగా వుండ మీదట మల్లీ మామూలుగా పనిజేత్తా వొచ్చా ఒకరోజురేత్తిరి ఎయ్యి ఏడ్జెనగ పప్పు బత్తాయి మేం పదిమందిమి లోన గోతాలమీన పేరివాల్సొచ్చింది మోసే బత్తా ఏసేబత్తా - లెగిసిబోతుండయి బత్తా మీన బత్తా రేత్తిరి రెండుగంటల యా లకు నాముంగల బత్తా మోసే కోటయ్య నెత్తిన బత్తాతో నిచ్చెన సివరికంటా

(మిగతా ప్రక్క పేజీలో)

గ్రంథ సమీక్ష

అరుణ రేఖలు

రచయిత శ్రీ తెన్నేటిసూరి

వెల 0—10 0

రాధేశ్యాం ఏజెన్సీస్.

గవర్నరుపేట బెజవాడ

ఇది ఉత్తమ గేయ సంపుటి ఇందులో 'అరుణ రేఖ' 'మాతృగీతి' 'మహోదయం' 'కన్నీటి కాలువ' 'అశ్రుసన్యాసం' 'ప్రపంచ విప్లవం' మొదలైన 16 గేయాలున్నాయి

"మానవ స్వాతంత్ర్య 'మాగ్నకార్టా' పైన రక్తాక్షరములతో వ్రాలుచేసే" సిన శ్రీ సూరిగారు ఇందులో ప్రతిఒక్క గేయంలోను ప్రత్యేకత చూపారు ప్రజా జీవితంలోకి చొచ్చుకుపోయిన ఆయన నిశిత దృష్టే. ప్రజాహృదయంలోకి చొచ్చుకుపోయే శక్తిని ఆయన గేయాలకు ప్రసాదించింది

ఈ కవి "తరుణారుణప్రభా తరళ రేఖ" యై, "తొలిసంజ ప్రొద్దులో వెలుగులందిం" చాడు అవే ఈ 'అరుణ రేఖలు'!

"కులములని మతములని

కూటికా? గుడ్డకా?

చిలిపి తగవులు రేపు పలుకులేలా?

ముళ్ళ మాటలు మీరు మానండిరా,

అమ్మ వింటే కోప పడుతుందిరా..

పారతంత్ర్యపు బ్రతుకు బ్రతుకనేలా?

స్వాతంత్ర్య యోధులై సాగండిరా!"

శతాబ్దాల నిదురమైకంలో, బానిసత్వంలో అణగివున్న ప్రజానీకానికి కవి

[అడుక్కుదినక సెసేదేంది]

ఏల్లాడూ- నేను రొండు మూడు మెల్లె క్కా-వొల్లు తూలింది-యిగనాకుతెలవదు ఆమీన ఏంజరిగిందీ మూడోరోజుగ్గాని నాకు తెలివి రాలా—అప్పటికి రొండు దినాలు కిందటే యీకుడికాలు తొడల కాడికి ఆపరేసను జేశారంట"

"అరే, అరే ఎంతపన్జరిగిందీ —"

"నిచ్చెన ఎక్కతుండోణ్ణల్లా అరుత్తా కల్లుదిరిగి అటనే పడ్డానంటా ఆ అదురుడికి అదిరిపోయి కోటయ్య బత్తా అటనే వొదిలేసే తలికీ-కిందబత్తా మీనగా ఎల్లి కిల పడుండ నాకుడికాలు మీనకి ఒచ్చి సరీగా పడిందంట"

"రామరామరామ రామ సెంద్రయ గారేమన్నాడూ?"

"ఆయనేం జేత్తాడు నాకావజాన రాసుంటే! రొండు మాసాలు ఆస్పత్తిర్లోమందేపించాడు, సాలు"

"ఎన్నాలయింది యిదిజరిగీ?"

"రొండేళ్ళయింది,"

"మరి అలివేలూ?"

'యింకేం అలివేలు!" అంది కళ్ళు గల యిగ్రహం

ఏందో అసిబోయి అటనే ఆగిపోయింది కళ్ళు మూసుకుండ యిగ్రహం

'మహోదయం' ప్రదర్శించాడు బానిస ప్రజలకు, కష్టజీవులకు, నిగళబద్ధులకు మహోదయ కాంతుల్లో స్వాతంత్ర్యగీతి ఆలపించాడు

"బ్రతుకండోయీ! ప్రాణికోటులూ!
భయములు వాసీ, బ్రతుకండీ!
వెతలను బాసీ వీరగభీరత
గుండెలనింపుక బ్రతుకండి!"

అనిచెప్పి, నేటి ప్రజాపోరాటాలను చిత్రిస్తున్నాడు

"విప్లవారుణగీతి వినువీధి జ్వలియించి
విశ్వప్రజా హృదయ మూగిపోయింది
కడలిపొంగులు మింటి కందుకున్నాయి
తరగలై
కెరటాల సరుదులై,
ముంపుల్ల వరదలై,
భయదాల ప్రళయమై
విలయగతి "

లేచిన ఆ 'కడలి పొంగు' "ఉక్కు కోటలనెల్ల ఊపి వైచిం"దట భావనాశక్తికి బంధాలులేవు. కవి విజ్ఞానభానుణ్ని లక్షిస్తున్నాడు

"చల చలా, మిల మిలా,
నిగ నిగా, ధగ ధగా,
కెంపుల్లు కోనలో ముంపులైనాయి.
బంగారు కాంతుల్లు ప్రభలు రేగాయి.
దివ్యరత్న కిరీట దీప్తి యమిగోను,
పసిడిమెయి చాయల్ల భానుడడుగోను
జ్ఞానభానునికంటి యెరుపులవిగోను!
మ్రానుల్లు మ్రాకుల్లు మండెనవిగోను!
"వేయి చేతులవాడె విక్రమించాడు,
రక్త కవచాలతో రాణువదుగోను!"

శ్రీ సూరిగారు నేటి ప్రజాహృదయాన్ని ఆకలింపు చేసుకున్నా రనడానికి ఇంతకంటె నిదర్శనం ఏం కావాలి? ఇంతేకాదు, ఈయన రచనలో ప్రతిభ వుంది పదం పదం కదనుత్రొక్కుతూ,

"మానవ జాతికి ఆఖరు యుద్ధం
యోధుల్లారా! నడవండి,
నరనారీ జన విప్లవ గీతం
వీరమూర్తులై పాడండి "

అంటూ విప్లవ యోధుల్ని పురికొల్పుతూ, మార్గదర్శకంగా పురోగమిస్తుంది ఈయనలో ప్రతిభా వ్యుత్పత్తులు మేళగించి, ఈ 'అరుణరేఖలు' ప్రసరింపజేసాయి

ఈ ఉత్తమగేయ సంపుటిని ఆంధ్రప్రజలు ఆదరిస్తారనీ, "నీకవిని బ్రతికించుకోవాలిరా!" అన్న సూరిగారి సందేశాన్ని పాటిస్తారనీ ఆశిస్తున్నాను

—ప్రయాగ

★

శేషప్రశ్న

రచయిత శరత్ బాబు

అనువాదం శ్రీ నాగు

వెల రు 4—0—0

ప్రచురణ దేశికవితామండలి

గవర్నరుపేట బెజవాడ

శరత్‌బాబు బెంగాలీ సాహిత్యంలో ఉత్తమస్థానం అలంకరించిన నవలాకారుడు బెంగాలీప్రజల జీవితాన్ని, ఆచార వ్యవహారాలను చిత్రిస్తూ పెక్కు నవలలు వ్రాశాడు శరత్‌బాబు ఉత్తమ నవలల్లో శేషప్రశ్న ఒకటి

ఇందులో ఆషుబాబు ఆరోగ్యం కొరకై తన యేకైకపుత్రిక మనోరమతో ఆగ్రావస్తాడు

మనోరమను అజితుడికిచ్చి పెండ్లి

చేయాలని సంకల్పం అగ్రాలో ఆమ బాబుకు, శివనాథబాబు, అవినాశుడు, అక్షయబాబు, మహేంద్రుడు అనేవాళ్ళతో పరిచయం కలుగుతుంది శివనాథబాబు, భార్యను వదలి కమలఅనే వితంతువును పెండ్లిచేసుకున్నాడు కమల బాల్యం నుంచీ అనేకకష్టాలకోర్చిన వ్యక్తి

ఆషుబాబుకు సంగీతమంటే ప్రీతి పాటకచేరీలు యేర్పాటుచేసి మిత్రులను ఆహ్వానిస్తాడు శివనాథుడికి మనోరమతో పరిచయము కలుగుతుంది ఊరికి వెళ్ళుతున్నానని చెప్పి ఊళ్ళోనే ఉంటూ ఇంటికి వెళ్ళడు. ఈ సంగతి అజితుడు చెప్పగా విని కమల పొందే ఆవేదన స్త్రీల అస్వతంత్ర జీవితాన్నీ, వారి మన స్తత్వాన్నీ వ్యక్తం చేస్తుంది అయ్యో మన సోదరి ఎంత బాధపడు తున్నది అనిపిస్తుంది

శివనాథుడితో మనోరమ పరిచయం ప్రణయంగా మారుతుంది

చివరకు మనోరమ శివనాథులు, కమల అజితులు పెండ్లి చేసుకుంటారు

కథలో మధ్యమధ్య చర్చల్లో అనేక విషయాలు వస్తాయి పాత్రలు తమ తమ ఆశలతో, ఆవేదనలతో మనముందు ప్రత్యక్ష మవుతారు ఈనవలలో ఎంతో సహజం గాను, సజీవం గాను మానవ హృదయాన్ని చిత్రించాడు శరత్‌బాబు

అనువాదం అంత సరళంగా లేదు కాని ఇది ఉత్తమ నవల శరత్ - సాహిత్యాన్ని తెనుగులోకి తీసుకు రావటానికి దేశి కవితామండలి చేస్తున్న కృషి ఆదరణీయమైంది.

—— రాజగోపాలరావు

శరత్ సాహిత్యము

శ్రీకాంత	6- 0-0
చరిత్ర హీనులు 1 2	5- 0-0
శేషప్రశ్న ...	4- 0-0
గృహ దహనమ్ 1, 2	3- 0-0
శరత్ కథలు 1, 2, 3	3- 0-0
సుభద	2- 0-0
పూజారిణి (లేక భైరవి)	1- 8-0
విరాజబహు	1- 4-0
స్వామి	1- 0-0
అడబ్రతుకు	1- 0-0
సరయు (లేక చంద్రనాధ్)	0-12-0
కాశీనాధ్	0- 8-0
అమ్మ - గోర్కి	5- 0-0
పాపికొండలు (శ్రీ సూరి)	1- 4-0
నెత్తురు చుక్కలు (శివరామకృష్ణ)	1- 4-0

దేశి కవితామండలి, గవర్నరుపేట, బెజవాడ.

Editor, Printer & Publisher C Pitchayya
Secretary, Andhra Progressive Writers' Association, Governorpet, Bezwada
Printed at Prajasakti Press Q. H No K 3 A